అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సోమవారం 23-12-2024
సంపుటి : 10 సంచిక : 354 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



యువ చాంపియన్

అండర్-19 మహిళల ఆసియా కప్

ఫైనల్లో గొంగడి త్రిష సూపర్ షో

వివరాలు 14లో



పార్టీల హక్కులను హరిస్తాయి

ఎన్నికల నిబంధనలకు సవరణలు తగవు

వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలి: సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ : ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను సవరించడానికి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సీపీఐ (ఎం) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వీడియో, ఇతర డిజిటల్ విచారణలు సహా ఎలక్ట్రానిక్ రికార్డులు పొందేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ప్రస్తుతం ఉన్న అవకాశాన్ని ఈ సవరణల ద్వారా హరించాలని కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించింది. ఈ మేరకు సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో ఆదివారం ఒక ప్రకటన విడుదల ... 13లో



ఈసీ సమగ్రతకు ప్రణాళికాబద్ధమైన హాని

ఇది కేంద్రం కుట్రలో భాగం

ఎన్నికల నిబంధనల్లో మార్పులపై కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఖర్గే ఆగ్రహం

న్యూఢిల్లీ : కొన్ని ఎలక్ట్రానిక్ పత్రాలను బహిరంగంగా తనిఖీ చేయకుండా నిరోధించ టానికి ఎన్నికల నియమావళిని సవరించటంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికల సంఘం(ఈసీ) సంస్థాగత సమగ్రతను నాశనం ... 13లో



అల్లు అర్జున్ ఇంటివద్ద ఉద్రిక్తత

పూలకుండీలను ధ్వంసం చేసిన ఓయూ జేఏసీ విద్యార్థులు

ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్

ప్లకార్డులతో నిరసన..వారిని అడ్డుకుని చితకబాదిన బౌన్సర్లు

రంగంలోకి పోలీసులు..అదుపులో ఆందోళనకారులు

నవతెలంగాణ-ఓయూ

సినీ హీరో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇంటివద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంపై కొందరు విద్యార్థి జేఏసీ నాయకులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ సర్కార్‌పై అల్లుఅర్జున్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలంటూ..ప్లకార్డులతో నిరసన చేస్తుండగా..బౌన్సర్లు వారిని చితక బాదారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు అక్కడే ఉన్న పూలకుండీలను ధ్వంసం చేశారు. రాళ్లు రువ్వినట్టు సమాచారం. సంధ్య థియేటర్ వద్ద తోపులాట ఘటన కేసులో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం, ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో అల్లుఅర్జున్ ఎపిసోడ్ రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా అసెంబ్లీలో సంధ్య థియేటర్ వద్ద తోపులాట ఘటనపై రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన అల్లు అర్జున్ తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగు తోందని, శాసనసభలో రేవంత్ చెప్పినవన్నీ అవాస్తవాలని సీఎం పేరు ప్రస్తావించకుండా చెప్పారు. తనపై ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందన్నారు. అల్లు అర్జున్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకో వాలంటూ కాంగ్రెస్ శ్రేణులు తెలంగాణ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అల్లు అర్జున్‌కు బీఆర్ఎస్, బీజేపీ నేతలు అండగా నిలవటంతో అగ్నికి మరింత ఆజ్యం పోసినట్టైంది. దీంతో అల్లు అర్జున్ ఇంటి వద్ద విద్యార్థి నాయకులు ...13లో

సినీ ప్రముఖుల ఇండ్లపై దాడులకు సీఎం ఖండన 13లో..

సంధ్య థియేటర్ ఘటనపై

న్యాయ సలహా తీసుకుని ముందుకెళ్తాం

మరోసారి బౌన్సర్లు ఓవర్ యాక్షన్ చేస్తే తాటతీస్తాం: హైదరాబాద్ సీపీ ఆనంద్

సినిమా చూశాకే వెళ్లానన్న అల్లు అర్జున్: చిక్కడపల్లి ఏసీపీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్ వార్షిక నేర నివేదికపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై ...13లో

పౌరుల భద్రత, రక్షణే

మాకు ముఖ్యం

పోలీసులు ఎవరికీ వ్యతిరేకం కాదు

చట్ట ప్రకారమే అల్లు అర్జున్, మోహన్‌బాబుపై చర్యలు : రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్

సంధ్య థియేటర్ ఘటనపై స్పందన

కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో భరోసా కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ - కరీంనగర్ క్రైమ్

పౌరుల భద్రత, రక్షణ తమకు ముఖ్యమని, పోలీసులు ఎవరికీ వ్యతిరేకం కాదని, సినీ హీరో అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. కరీంనగర్ ...13లో

తిప్పలు తీరేదెట్టా...

● పెద్ద బకాయిలు సరే.. ● చిన్న వాటి సంగతేంది?

● జీపీఎఫ్, గ్రాట్యుటీల చెల్లింపులకు సైతం కటకట ● పెండింగ్ బిల్లులపై నిర్దిష్ట కార్యాచరణ లేని వైనం

ఎఫ్ఆర్‌బీఎమ్ పరిధిలో రూ.60 వేల కోట్ల అప్పు తెచ్చిన సర్కార్

గ్యారెంటీల రూపంలో మరో రూ.50 వేల కోట్లు, అవిగాక మరో రూ.15 వేల కోట్ల రుణాలు

- బి.వి.యన్.పద్మరాజు

'మా పార్టీకి పాలనలో అపార అనుభవం ఉంది, అప్పులను ఎలా తీర్చాలో, ఆర్థిక పరిస్థితిని ఎలా చక్కదిద్దాలో, ఆర్థిక వనరులను ఎలా సమకూర్చుకోవాలో మాకు బాగా తెలుసు...' డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అటు అసెంబ్లీలోనూ, ఇటు బయటా చెబుతున్న మాటలివి. కాసేపు ఇది నిజమే అనుకున్నా... అందుకనుగుణంగా సర్కారు నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించకపోవటం గమనార్హం.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో అప్పులను ఎలా తీరుస్తారు? బకాయిలను ఎలా సర్దుబాటు చేస్తారనేది తేలకుండా ఉంది. గత బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో నాలుగు లక్షల బిల్లులు, రూ.40 వేల కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. వీటిలో బడా బడా కాంట్రాక్టర్లకు ఇచ్చే వేల కోట్లతోపాటు ఉద్యోగ విరమణ చేసిన వారు, పెన్షనర్లకు జీపీఎఫ్, గ్రాట్యుటీ రూపంలో చెల్లించాల్సిన రూ.20 లక్షలు, రూ.30 లక్షల్లాంటి బాకీలు కూడా ఉన్నాయి. వీటిని చెల్లించేందుకు కూడా 'కటకట' ఏర్పడటం గమనార్హం. సచివాల యానికి మంచి నీటి పీపాలను సరఫరా చేసే ఓ చిన్న సైజు కాంట్రాక్టరుకు రూ.4 లక్షల బిల్లు ఐదు నెలల నుంచి పెండింగ్‌లో ఉందని ... 13లో



ఏడాది కాలంలో అప్పుల పరిస్థితి ఇదీ...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా ఏడాది కాలంలో ఎఫ్ఆర్‌బీఎమ్ పరిధిలో రూ.60 వేల కోట్ల అప్పులను తీసుకున్నారు. ఇవిగాక గ్యారెంటీల రూపంలో మరో రూ.50 వేల కోట్లు, గ్యారెంటీలు లేకుండా ఇంకో రూ.15 వేల కోట్ల మేర రుణాలను ప్రభుత్వం తీసుకుంది. మరోవైపు బీఆర్ఎస్ పదేండ్ల ఏలుబడిలో చేసిన అప్పు రూ.6,71,157 కోట్లని రేవంత్ సర్కార్ తన శ్వేతపత్రంలో ప్రకటించింది. ఆ కాలంలో ఉన్న బకాయిలు రూ.40,154 కోట్లు. ఇవి రెండూ కలిపితే మొత్తం అప్పు రూ.7,11,311 కోట్లుగా తేలింది. వీటికితోడు పదేండ్ల కాలంలో కార్పొరేషన్ రుణాలు కూడా పెద్ద మొత్తంలో పేరుకుపోయాయి.పౌరసరఫరాల కార్పొరేషన్‌కు రూ.50 వేల కోట్లు, విద్యుత్...13లో

'రైతు భరోసా' మోసాన్ని ఎదిరించండి

ఆంక్షలతో సగం మందిని ఎత్తేసే కుట్ర : రైతులకు కేటీఆర్ బహిరంగ లేఖ


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రైతు భరోసాను ఎగవేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎదిరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా అసలు విషయాన్ని తేల్చకుండా సంబంధంలేని అంశాలను ప్రస్తావించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఆంక్షలు, అనుమానాలు, సందేహాలు వేటికీ సమాధానం చెప్పకుండా దాట వేశారని విమర్శించారు. "ఎన్నికలకు ముందు అందరికీ అన్నీ.. ఎన్నికలయ్యాక కొందరికే కొన్ని" అంటూ ఉద్యోగులు, ఐటీ, పాన్‌కార్డు హోల్డర్లకు కటింగ్‌లు పెట్టి ఏదో రకంగా తప్పించుకోవాలన్న ఎజెండా తప్ప ప్రభుత్వానికి రైతులపట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సన్నాలకు రూ.500 బోనస్ పేరిట మొత్తం సీజన్లో రూ.700 కోట్లు చెల్లించి, ...13లో

తైవాన్‌కు సైనిక సాయాన్ని ఆపండి

అమెరికా చర్యను తీవ్రంగా ఖండించిన చైనా



బీజింగ్: తైవాన్ జలసంధిలో శాంతి, సుస్థిరతలను దెబ్బతీసే అమెరికా యత్నాలను చైనా తీవ్రంగా ఖండించింది. తైవాన్‌కు సైనిక సాయం, ఆయుధాల అమ్మకాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేసింది. శనివారం తైవాన్‌కు 571.3 మిలియన్ డాలర్ల విలువైన సైనిక సహాయాన్ని వైట్‌హౌస్ ప్రకటించడంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఆదివారం నాడిక్కడ ఒక ప్రకటన చేస్తూ, అమెరికా రక్షణ మంత్రిత్వ శాఖ 295 మిలియన్ల విలువైన ఆయుధాలను తైవాన్‌కు అమ్మేందుకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం 'తైవాన్ స్వాతంత్ర్యానికి మద్దతు ఇవ్వబోమన్న అమెరికన్ నేతలు గతంలో ఇచ్చిన హామీని ఉల్లంఘించడమేనని" చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి చెప్పారు. అమెరికా తీసుకున్న ఈ చర్య 'తైవాన్ స్వాతంత్ర్య' వేర్పాటువాద శక్తులకు తప్పుడు సంకేతాన్ని పంపుతుందని అన్నారు. చైనాకు చెందిన తైవాన్ ప్రాంతానికి మిలిటరీ సాయం, ఆయుధాల సరఫరాలకు ఆమోదం తెలపడం ద్వారా, ఒక చైనా సూత్రాన్ని, మూడు చైనా-అమెరికా సంయుక్త ప్రకటనలను, ముఖ్యంగా 1982 ఆగస్టు 17 ప్రకటనను, చైనా సార్వభౌమాధికారాన్ని, భద్రతా ప్రయోజనాలను తీవ్రంగా ఉల్లంఘించిందని ప్రతినిధి విమర్శించారు. .తైవాన్‌ను ఆయుధాలు ఇవ్వడం, తైవాన్ వేర్పాటువాదాన్ని ఎగదోయడం వంటి అమెరికా చర్యలు నిప్పుతో చెలగాటమాడడమేనని పేర్కొన్నారు. తైవాన్ అంశం చైనా కీలక ప్రయోజనాలకు సంబంధించిన అంశంగానే గాక, చైనా- అమెరికా సంబంధాలలో దాటకూడని మొదటి రెడ్ లైన్ కూడా అని నొక్కి చెప్పారు.

చైనాకు చెక్ పెట్టేందుకు తైవాన్‌ను పావుగా వాడుకోజూసే ఎలాంటి యత్నమైనా బెడిసికొట్టక తప్పదు అని ప్రతినిధి చెప్పారు. చైనా తన జాతీయ సార్వభౌమాధికారం, భద్రత, ... 13లో

ఇంటి వంట పట్టదు

ప్రాసెస్డ్ ఆహారం పైనే మోజు | శరీరంలో పేరుకుపోతున్న కొవ్వు

దేశీయ మార్కెట్లలో విరివిగా లభ్యమవుతున్న ఆహార ఉత్పత్తులు, అల్పాహార పదార్థాలపై నిర్వహించిన ఓ అధ్యయనం ఆందోళన కలిగించే విషయాలను బయటపెట్టింది. ఈ అధ్యయనంలో మొత్తం 432 ఆహార ఉత్పత్తులను ఐదు కేటగిరీలుగా...ఇడ్లీ మిక్స్‌లు, అల్పాహారంలో వినియోగించే తృణధాన్యాలు, గంజి మిక్స్‌లు, పానీయాలు, సూపులు...విభజించారు. తినడానికి సిద్ధంగా ఉన్న (రెడీ టూ ఈట్), ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తులలో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయని అధ్యయనం తేల్చింది.

'ప్లాస్ వన్' జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనానికి సీనియర్ శాస్త్రవేత్త శోభనా షణ్ముగం నేతృత్వం వహించారు. చెన్నయ్‌కి చెందిన మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్ పరిశోధకులు ఈ అధ్యయనంలో భాగస్వాములు. ఆహార పదార్థాలలో ఉన్న పోషక విలువలను మదింపు చేసి అవి ఆరోగ్య రక్షణకు ఎంత వరకూ దోహదపడతాయో పరిశోధకులు పరిశీలించారు.

అధ్యయనం ఏం చెప్పింది?

పిండి పదార్థాలు అధికం...ప్రొటీన్లు స్వల్పం

చేదు అనుభవాన్ని మిగిల్చే తియ్యని పానీయాలు

అనారోగ్యానికి కారణమవుతున్న ఆహారపు అలవాట్లు



పిండి పదార్థం అనారోగ్య కారకం

పిండి పదార్థాలను అధికంగా తీసుకోవడం వల్ల పాంక్రియాటిస్‌పై ఒత్తిడి పెరగడమే కాకుండా టైప్ 2 డయాబిటీస్ వచ్చే అవకాశం కూడా ఉంది. అయితే ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల కారణంగా ఫ్యాటీ లివర్ వంటి వ్యాధులు కూడా రావచ్చునని వైద్య నిపుణులు చెప్పారు. ప్యాకేజ్, ప్రాసెస్డ్ ఆహార పదార్థాలలో మరింత ప్రొటీన్, తక్కువ కొవ్వు, సోడియం ఉండేలా చూడాల్సిన అవసరం ఉన్నదని వారు సూచించారు.

న్యూఢిల్లీ : పలు ఆహార ఉత్పత్తులు అందిస్తున్న శక్తిలో (ఎనర్జీ) 70 శాతానికి పైగా పిండి పదార్థాల నుండే లభిస్తోంది. స్నాక్స్‌లో 47 శాతం ఎనర్జీ కొవ్వు నుండే వస్తోంది. ప్రొటీన్ నుండి లభించే ఎనర్జీ 15 శాతం కంటే తక్కువగా ఉండడం గమనార్హం. ఇక పానీయాల విషయానికి వస్తే వాటిలో కూడా పిండి పదార్థాలే అధికంగా ఉంటున్నాయి. వీటిలో చక్కెర కూడా ఎక్కువగానే ఉంటోంది. సూపులకు సంబంధించి సోడియం స్థాయిలు అధికంగా ఉన్నాయి. వీటిలో ప్రొటీన్, పీచు పదార్థాలు చాలా తక్కువ. ఇడ్లీ మిక్స్‌లలో ప్రొటీన్ ఎక్కువగా ఉంది. చాలా వాటిలో చక్కెర కన్పించలేదు. అల్పాహారంగా తీసుకునే తృణధాన్యాలలో పీచు పదార్థాలు అధికంగా ఉన్నాయి.

ప్రాసెస్ చేసిన పదార్థాలపై మోజు



2022-23 సంవత్సరపు కుటుంబ వినియోగ వ్యయ సర్వే ప్రకారం భారతీయులు ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, పానీయాలు, రిఫ్రెష్‌మెంట్లపై ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. ఇంటిలో వండే ఆహారంపై ఖర్చును తగ్గిస్తున్నారు. ఈ విషయంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం ఉన్నప్పటికీ ఖర్చు మాత్రం అలాగే ఉంటోంది. ఆహార వినియోగంలో వస్తున్న మార్పుల కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 56.4 శాతం వ్యాధులకు అనారోగ్యకరమైన ఆహారమే కారణమని భారత వైద్య పరిశోధనా మండలి మార్గదర్శకాలను ఉటంకిస్తూ ఈ సంవత్సరపు ఆర్థిక సర్వే తెలిపింది.

ప్యాకేజీలపై సమాచారం

ఆహార ఉత్పత్తులకు సంబం ధించిన ప్యాకేజీలపై పోషకాలకు సంబంధించిన సమాచారాన్ని ముద్రిం చాల్సి ఉంటుంది. అంటే ఆ ఉత్పత్తిలో ప్రతి వంద గ్రాములు లేదా వంద మిల్లీలీటర్లు లేదా ప్రతి సర్వింగుకు ఎనర్జీ, ప్రొటీన్, పిండి పదార్థాలు, చక్కెర, మొత్తం కొవ్వు ఏ పరిమాణంలో ఉన్నాయో తెలియ జేయాలి. అయితే సర్వింగుకు సంబంధించిన సమాచారాన్ని కొన్ని అల్పాహార తృణ ధాన్యాలు, పానీయాలు మాత్రమే అందజేస్తున్నాయి. కొన్ని ఉత్పత్తులపై వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా సమాచారాన్ని అందజేస్తున్నారు. ఆహార పదార్థంలో అధిక కొవ్వు, చక్కెర, సోడియం ఉన్నట్లయితే దానికి సంబంధించి హెచ్చరిక లేబుల్స్ ప్రదర్శించాల్సి ఉంటుంది. దీనివల్ల అధిక సోడియం ఉన్న ఆహార పదార్థాన్ని హైపర్ టెన్షన్ ఉన్న వారు వదిలేస్తారు. అలాగే చక్కెర కలిగిన ఆహారాన్ని మధుమేహ వ్యాధిగ్రస్తులు ముట్టుకోరు. అయితే ప్రస్తుతం లేబుల్స్‌ను ప్రదర్శించే పద్ధతి ఒకేలా ఉండటం లేదని అధ్యయన పత్రం ప్రధాన రచయిత, మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ షణ్ముగం తెలిపారు. దీనివల్ల వినియోగదారులకు ఆ సమాచారాన్ని అర్థం చేసుకోవడం కష్టమవుతోందని ఆమె చెప్పారు.

ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్

ప్రధాని మోడీకి కువైట్ అత్యున్నత పురస్కారం



6లో..

రాహుల్ గాంధీకి యూపీ కోర్టు సమన్లు



అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కులగణనపై వ్యాఖ్యలకు..

వివరాలు 14లో

ఐరాస కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ లోకుర్



న్యాయ వ్యవస్థలో అనుభవం, నైపుణ్యానికి గుర్తింపు 6లో..



డిజిటల్ ఛానెల్స్ అండ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆవిర్భావం

- 20 మందితో రాష్ట్ర కమిటీ
- ఏడుగురితో కోర్ కమిటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

డిజిటల్ జర్నలిస్టుల హక్కులు, అభ్యున్నతి కోసం డిజిటల్ ఛానెల్స్ అండ్ జర్నలిస్టు ఫెడరేషన్ (డీసీజేఎఫ్) ఆవిర్భవించింది. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిజిటల్ ఛానెల్స్, జర్నలిస్టులు నిర్వహించిన సమావేశానికి ఈ69 భానుప్రసాద్ అధ్యక్షత వహించారు. సమావేశానికి 32 ఛానెళ్లు, స్వతంత్ర జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు కంబాలపల్లి క్రిష్ణ మాట్లాడుతూ దేశంలో ప్రజల గొంతుకగా డిజిటల్ మీడియా పని చేస్తోందన్నారు. వేగంగా అభివృద్ధి చెందిన సోషల్ మీడియా ఎంతో క్రెడిబిలిటీ సాధించిందని చెప్పారు. కొద్ది మంది అతి కారణంగా అబాసుపాలు కూడా అవుతోందని అభిప్రాయపడ్డారు. డిజిటల్ జర్నలిస్టుల హక్కుల కోసం ఏర్పడుతున్న ఈ సంఘానికి తన పూర్తి మద్దతు ఉంటుందని, అభినందనలు తెలిపారు. టీ10 సుందర్, ఈ69 భాను ప్రసాద్, మహువా మీడియా వనజ, ఎన్9 మీడియా రాకేష్, మాస్ వాయిస్ శంకర్, జనం టీవీ శంకర్, ఇజం టీవీ లాట్కాడ్ నారన్నలతో కోర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రాచకొండ రమేష్, నేషనల్ వెబ్ ఛానెల్స్ అసోసియేషన్ బాలక్రిష్ణ, ఆన్లైన్ వర్కింగ్ జర్నలిస్టు పెడరేషన్ తిరుపతిరెడ్డి, నాగేష్ భూంపల్లి, యాటల సోమన్న, ఏపీఎం వెంకటేష్, మిట్టి మీడియా రవి, తెలంగాణ శ్యాం, టీ21 లెనిన్, ఎ6 ఆదేశ్, మనరైతు శోభన్, వర్తమానం టీవీ ఉదయ్, ఉమెన్ కలెక్టీవ్ విప్లవ శ్రీ, వీరయ్య, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం

- సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బహుభాషా కోవిదుడు, భారత దేశ మాజీ ప్రధాని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా పని చేసిన పాములపర్తి వెంకట నరసింహారావు సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతికి దిశా నిర్దేశం కావించిన ఘనత ఆయనకే దక్కుతుందని ఆయన వర్ధంతిని పురస్కరించుకుని వారికి ఘనంగా నివాళులర్పించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు ఆందోళనకరం

- 'ఎక్స్'లో మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని 'ఎక్స్'లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒక్క ఏడాదిలోనే హైదరాబాద్‌లో 35,944 క్రైమ్ కేసులు నమోదు కావడం ఘోరమైన పరిస్థితికి అద్దం పడుతున్నదన్నారు. అల్లు అర్జున్ నివాసంపై జరిగిన రాళ్ల దాడి సంఘటన పూర్తిగా పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమనీ, హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి శాంతిభద్రతల పట్ల తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. హత్యలు, అత్యాచారాలు, దాడులతో ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారిందనీ, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యాల్లో శాంతి భద్రతలు లేవనే విషయం స్పష్టమవుతున్నదని విమర్శించారు.

రైతు నాయకుడు దల్లేవాల్ పరిస్థితి విషమం

- 27 వ రోజుకు చేరిన ఆమరణ నిరాహార దీక్ష



చండీగఢ్ : కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని కోరుతూ గత నాలుగు వారాలుగా నిరాహార దీక్ష చేస్తున్న పంజాబ్ రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ పరిస్థితి విషమించినట్టు వైద్యులు తెలిపారు. పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లా ఖానౌరీ సరిహద్దు దగ్గర ఆయన చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఆదివారం నాటికి 27వ రోజుకు చేరింది. దల్లేవాల్‌కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయనకు గుండె ఆగిపోవడం బహుళ అవయవ వైఫల్యం సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతి రైతుకు కనీస మద్దతు ధర కల్పించడం ప్రాథమిక హక్కు లాంటిదని గురువారం ప్రధాని నరేంద్ర మోడీకి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. పంటలపై ఎంఎస్‌పికి చట్టబద్ధమైన హామీతో సహా ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లను ఆమోదించాలని కేంద్రాన్ని ఒత్తిడి చేసేందుకు 70 ఏళ్ల దల్లేవాల్ నవంబర్ 26 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు.వైద్యుల సలహా మేరకు ఆదివారం నాడు వేదికపైకి రాలేదని సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా ఒక ప్రకటనలో తెలిపారు.

వేగంగా పావులు కదపడంలో దేవాన్ష్ ప్రపంచ రికార్డు

అమరావతి : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తనయుడు దేవాన్ష్.. చెస్‌లో వేగవంతంగా పావులు కదపడంలో ప్రపంచ రికార్డు సాధించాడు. తొమ్మిదేళ్ల దేవాన్ష్ 'వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్-175 పజిల్స్'లో ఈ రికార్డు సాధించాడు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ నుంచి అధికారిక ధ్రువీకరణను అందుకోవడంతో నారా కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. వ్యూహాత్మకమైన ఆటతీరు, థ్రిల్లింగ్ ప్రదర్శనతో యువ చెస్ ప్రాడిజీ దేవాన్ష్ 'చెక్‌మేట్ మారథాన్' పేరుతో ఈ రికార్డు నెలకొల్పాడు. ఈ రికార్డులో క్రమక్రమంగా సవాలు చేసే చెక్‌మేట్ పజిల్‌ల క్రమాన్ని అతను పరిష్కరించాడు. చెస్ సంకలనం నుంచి ఎంపిక చేసిన 5,334 సమస్యలు, కలయికల ద్వారా ఈ పోటీని రూపొందించారు. ఇటీవల దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను సాధించాడు. 7డిస్క్ టవర్ ఆఫ్ హనోయిని కేవలం నిమిషం 43 సెకన్లలో పూర్తిచేశాడు. 9 చెస్ బోర్డులను కేవలం 5 నిమిషాల్లో అమర్చాడు.

మెరుగు వేగాన్ని కళ్లారా చూశాను : లోకేష్

దేవాన్ష్ మెరుగు వేగాన్ని తాను కళ్లారా చూశానని మంత్రి లోకేష్ తెలిపారు. గ్లోబల్ అరేనాలో భారతీయ చెస్ క్రీడాకారుల అద్భుతమైన, చారిత్రాత్మక ప్రదర్శనల నుంచి ప్రేరణ పొందాడని తెలిపారు.

అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు దేశానికి అవమానకరం

బీజేపీ.. ఆర్ఎస్ఎస్ డీఎన్ఏలో భాగమే

- కేంద్రమంత్రి బర్తరఫ్‌కు అందరూ ఏకం కావాలి : ప్రముఖ సీనియర్ అంబేద్కర్ వాది జేబీ రాజు
- రాజ్యాంగం మనుధర్మంపై రాష్ట్రవ్యాప్త సెమినార్లు
- సామాజిక ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సాక్షాత్తూ రాజ్యసభలో బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ పేరును ఉచ్ఛరిస్తూ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలు దేశానికే అవమానకరమని ప్రముఖ అంబేద్కర్ వాది జేబీ రాజు అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ డీఎన్ఏలోనే ఇలాంటి విధానాలు దాగి ఉన్నాయని, తక్షణమే అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాలులో సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేబీ రాజు మాట్లాడుతూ.. అమిత్ షా అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యల పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోందన్నారు. 75 ఏండ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలోనే ఆ రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన తక్షణం క్షమాపణ చెప్పటంతో పాటు తన పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరు ఉచ్చరించటమే నేరమన్నట్టుగా అసహనం ప్రదర్శించడం బీజేపీ అసలు బుద్ధిని చూపించిందని, తన మనువాద ధోరణిని బయటపెట్టుకున్నారని విమర్శించారు. పైగా ప్రధాని మోడీ తన అనుచరుడిని వెనకేసుకురావటం, ఎప్పటిలాగానే నెహ్రూను, కాంగ్రెస్‌ను రంగంలోకి లాక్కొచ్చి పాత పాటలే వల్లెవేయడం దబాయింపు ధోరణికి పరాకాష్ట అని అన్నారు.

సీఐటీయూ, రైతు సంఘం, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పాలడుగు భాస్కర్, టి. సాగర్, ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ..అమిత్‌షా వ్యాఖ్యలు అప్పటికప్పుడు అనుకోకుండా, ఆవేశపరంగా వచ్చినవి కావని, సంఘ్ పరివారంలో అణువణువునా జీర్ణించుకొని ఉన్న అసహనపు భావజాలానికి బహిర్గత వ్యక్తీకరణే అది అని గుర్తు చేశారు. దేశానికి దశదిశా నిర్ణయించుకొని, అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగం రూపొందించుకొన్న తరుణంలో నేటి బీజేపీ మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిందన్నారు. బహుజన వాగ్గేయ కారుడు ఏపూరి సోమన్న, టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు మాట్లాడుతూ.. దేశానికి ఈ రాజ్యాంగం పనికిరాదని, మూడు రంగుల జెండా అరిష్టమని ఆర్ఎస్ఎస్ చెప్పిందని గుర్తుచేశారు. అవకాశం వచ్చిన ప్రతిసారి రాజ్యాంగంపై విరుచుకు పడటం చాలామంది కాషాయదళ నాయకులకు అలవాటేనని అన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కేంద్రాలు నియోజకవర్గ కేంద్రాల్లో 'మనుస్మృతి భారత రాజ్యాంగం' అనే అంశంపై సెమినార్లు నిర్వహించాలని, ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాద అహంకారపు భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. ఈ సమావేశంలో సీనియర్ అంబేద్కర్‌వాదులు గొల్లపల్లి దయానంద్, ఎస్. రాజలింగం, సీఐటీయూ వర్కింగ్ ఉమెన్ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీ రమ, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు పి. ఆశయ్య, లెల్లెల బాలకృష్ణ, జి. నరేష్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, ఆనెగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ, ఐద్వా నాయకులు వరలక్ష్మి, శశికళ, రూప, సామాజిక ఉద్యమకారుడు తెలంగాణ శ్యామ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఉదయ్ కుమార్, సీనియర్ జర్నలిస్టు ఎండీ వలీ హుస్సేన్, ప్రొఫెసర్ ఏకు తిరుపతి, బహుజన వాగ్గేయకారులు మచ్చ దేవేందర్, రామంచ భరత్, జూపాక శివ, కేవీపీపీఎస్ నగర కార్యదర్శి బి సుబ్బారావు పాల్గొన్నారు.

బీసీలపై కేసులు పెడతామనే ఆలోచనను

టీటీడీ బోర్డు ఉపసంహరించుకోవాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీలపై కేసులు పెడతామనే ఆలోచనను టీటీడీ బోర్డు ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్రకులాలకు ఒక విధంగా బీసీలకు ఇంకో విధంగా టీటీడీ బోర్డు వ్యవహరించడం తగదని తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పై అక్రమ కేసు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఇటీవల తిరుమల దర్శనం సందర్భంగా తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనం విషయంలో తెలంగాణ ప్రజల పట్ల టీడీపీ ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నదని మాజీ మంత్రి, బీసీ నేత శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారంటూ అక్రమ కేసు నమోదు చేస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఆలోచిస్తున్నట్టు తెలుస్తుందని చెప్పారు. అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడతామనడం సమంజసం కాదనీ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పై కేసు పెట్టాలనే ఆలోచనను టీటీడీ బోర్డు విరమించుకోవాలని జాజుల డిమాండ్ చేశారు. గతంలో లార్డ్ శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం చాలామంది అగ్రకుల నాయకులు ముఖ్యంగా తెలంగాణకు చెందిన అగ్రకుల ప్రజాప్రతినిధులు తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించకపోవడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై విమర్శనాత్మకంగా మాట్లాడారని గుర్తుచేశారు. వారు మాట్లాడిన సందర్భంలో ఎలాంటి కేసులు పెట్టని టీటీడీ బోర్డు, కేవలం బీసీ నేత అయినటువంటి మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్‌పై కేసు పెట్టాలని యోచించడం వివక్ష కాదా ? అని ఆయన ప్రశ్నించారు టీటీడీ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడితే వివరణ కోరేటువంటి అవకాశం, మళ్లీ భవిష్యత్తులో మాట్లాడకుండా చేసే షరతు టీటీడీ బోర్డు విధించే అవకాశాలు ఉన్నప్పటికీ, ఇవేమీ పరిగణనలోకి తీసుకోకుండా రాజకీయ కోణంలో బీసీ నేతపై కేసు నమోదు చేయాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల పేటెంట్ అని చెప్పుకునే టీడీపీ బీసీలపైనే కేసులు పెడుతుందని తాము అనుకోవడం లేదనీ, ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీటీడీ బోర్డు చైర్మెన్ బీ.ఆర్.నాయుడు ఇలాంటి వివాదానికి ముగింపు పలకాలనీ, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీసీల విషయంలో సానుకూలంగా ఆలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు సమస్త బీసీ సమాజం అండగా ఉంటుందని జాజుల తెలిపారు.

రాష్ట్రపతి, సీజేఐలుగా ఆ ఇద్దరు లాయర్లు

ఆసక్తికర విషయాన్ని వెల్లడించిన జస్టిస్ నాగరత్న



ఢిల్లీ : సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న తన కుటుంబం గురించి ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ఆమె తండ్రి, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య జయంతి శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని బెంగుళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్శిటీ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అక్కడి విద్యార్థులకు ఓ ఆసక్తికరమైన విషయం చెప్పారు.

1946 డిసెంబర్‌లో నాగ్‌పూర్‌లో అఖిల భారత న్యాయవాదుల సమావేశం జరిగిందని.. అక్కడకు వెళ్లడానికి బెంగుళూరు, నాగ్‌పూర్ మధ్య నేరుగా రైలు లేకపోవడంతో చెన్నైకి వెళ్లి అక్కడ నుంచి గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లాల్సి ఉండేదన్నారు. ఆ రైలు కంపార్ట్‌మెంట్‌లో కొందరు న్యాయవాదులు కలిసి సరదాగా గడుపుతూ, మంచి స్నేహితులుగా మారారని ఆమె తెలిపారు. అయితే ఆ రైల్లో మిత్రులుగా మారిన ఇద్దరు వ్యక్తులు దాదాపు నలభై మూడు ఏండ్ల తర్వాత 1989లో కలుసుకున్నారని పేర్కొన్నారు. వారిలో ఒకరు దేశంలోనే అత్యున్నత పదవిని అధిరోహించిన రాష్ట్రపతి ఆర్ వెంకటరామన్ అయితే మరొకరు దేశ అత్యున్నత న్యాయస్థానానికి ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయబోయే తన తండ్రి జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య అని ఆమె తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం వారిరువురు నలభై మూడేండ్ల క్రితం తాము రైల్లో కలుసుకున్న విషయాన్ని గుర్తు చేసుకొని ఎంతో ఆనందపడ్డారని ఆమె తెలిపారు.

అయితే తాను ఈ స్థాయికి రావడానికి తన తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహం, మద్దతే కారణమని అన్నారు. జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య తనకు తండ్రి మాత్రమే కాదని..గురుతుల్యులని తెలిపారు. ఆయనకు ఒక మంచి విద్యార్థిగా ఉండడానికే తాను ప్రయత్నించానని.. ఎప్పటికీ ఆయనకు విద్యార్థిగానే మిగిలిపోతానని తెలిపారు. "న్యాయమూర్తిగా పదవి చేపట్టినప్పటి నుంచి మనం విచారణలో ఉంటాము. పదవీకాలం ముగిసిన తర్వాత గౌరవప్రదంగా ఉండటం ముఖ్యం" అని తన తండ్రి ఎప్పుడూ చెబుతుండేవారని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సాహిత్యంపై ఆయన ఎంతో మక్కువ చూపేవారని అన్నారు. తన తండ్రి పని ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని తల్లి పద్మ ఇంటి బాధ్యతలను ఒంటి చేత్తో నడిపేవారని గుర్తుచేసుకున్నారు.

ఏపీ సీఎస్ రేసులో ముగ్గురు..!

నెలాఖరుకు రిటైర్డు కానున్న సీఎస్ నీరబ్ కుమార్

అమరావతి : తదుపరి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రేసులో ముగ్గురు సీనియర్ ఐఎఎస్ అధికారులు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుత సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఈ ఏడాది జూన్ 7న సీఎస్‌గా బాధ్యతలు తీసుకున్న నీరబ్ ఆ నెలఖారుతోనే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయన పదవిని ఆరు నెలలు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో కేంద్ర ప్రభుత్వం అందుకు అనుమతినిచ్చింది. మరోసారి పొడిగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఆయన ఈ నెలఖారుకు పదవి విరమణ చేయనున్నారు. సీనియార్టీ ప్రకారం రేసులో 8 మంది ఉన్నా, ప్రధాన పోటీ ముగ్గురి మధ్యే నెలకొంది. రేసులో ప్రముఖంగా జి సాయిప్రసాద్, ఆర్‌పీ సిసోడియా, విజయానంద్ పేర్లు వినిపిస్తున్నాయి. సీనియార్టీ ప్రకారం చూసుకుంటే సీనియర్ అధికారి వై శ్రీలక్ష్మి అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి అనంతరాము, జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్, గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, కేంద్ర ప్రభుత్వంలో ఉన్న సుమితాదావ్ర, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ వరుసలో ఉన్నారు. అయితే వై శ్రీలక్ష్మి గత ప్రభుత్వానికి అంటకాగారనే నెపంతో జీఏడికే ఆమెను పరిమితం చేశారు. అజయ్‌జైన్ కూడా చంద్రబాబుకు అత్యంత దగ్గర ఉంటారనే చర్చ అధికారుల్లో ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబుపై నమోదు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అజయ్‌జైన్ వాంగ్మూలం ఇచ్చారనే ఆగ్రహం టీడీపీ నేతల్లో ఉంది. ఈ కారణంతో ఆయనకు సీఎస్ పదవి అందదని అంటున్నారు. పోటీల్లో ఉన్న ముగ్గురిలో సాయిప్రసాద్, సిసోడియా 1991 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారులు కాగా, విజయానంద్ 1992 బ్యాచ్‌కు చెందిన అధికారి. వీరు ముఖ్యమంత్రి చంద్రబాబుకు దగ్గరగా ఉంటారనే చర్చ నడుస్తోంది. విజయానంద్ 2025 నవంబర్‌లో, సాయిప్రసాద్ 2026 మేలో, సిసోడియా 2028 జనవరిలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ ప్రకారం చూసుకుంటే ముందుగా ఉద్యోగ విరమణ చేసే విజయానంద్‌కు ఆయన తరువాత సాయి ప్రసాద్‌కు, ఆ తరువాత సిసోడియాకు ఇస్తారనే చర్చ కూడా నడుస్తోంది.

అమరావతిపై నిరంతర పర్యవేక్షణ

- కన్సల్టెన్సీలతోపనులపై నిఘా
- చెప్పినవి అమలు చేయకపోతే నోటీసులు



అమరావతి : అమరావతికి రుణం ఇస్తున్న ప్రపంచబ్యాంకు నిరంతరం పర్యవేక్షణ చేయనుంది. ఒప్పందాల్లో భాగంగా పరపతి నివేదికలో ఈ అంశాన్ని ప్రపంచబ్యాంకు ప్రస్తావించింది. ప్రతి పనినీ సొంత కన్సల్టెన్సీలతో పర్యవేక్షణ చేయనుంది. దీనికోసం టెండర్లకు సంబంధించిన సమాచారం, చేపడుతున్న కంపెనీలు, వాటి వివరాలూ, చేస్తున్న పని వివరాలనూ ఎప్పటికప్పుడు నివేదికల రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. వీటిపై ప్రపంచబ్యాంకు సూచించిన కన్సల్టెన్సీలు తనిఖీలు చేస్తుంటాయి. ఒప్పందంలో పేర్కొన్న పని జరిగిందని, మిగిలిన నిధులు విడుదల చేయొచ్చని అవి సూచిస్తే నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ ఉంటారు. దీనికోసం సెక్షన్ 4లో అనేక అంశాలు పేర్కొన్నారు. డిస్బర్సమెంట్ లింక్డ్ రిజల్ట్స్(డిఎల్ఆర్-పంపిణీ నిధుల ఫలితాలు)ల్లో ఎప్పుడు ఏమి చేస్తామన్నారు. ఏమిచేయాలనే విషయాలను ప్రస్తావించారు. అమరావతికి రుణం అంగీకరించే నాటికి అమెరికన్ డాలరుకు రూ.84.09పైసలుగా పేర్కొంది. రుణ ఒప్పంద పత్రాన్ని గ్రహీతలు ఎక్కడా బహిర్గతం చేయకూడదని, ప్రపంచబ్యాంకు అనుమతి లేకుండా కంటెంట్ కూడా చెప్పకూడదని మొదటిపేజీ నిబంధనల్లోనే స్పష్టంగా పేర్కొన్నారు. తాము ఇచ్చే రుణానికి అనుగుణంగా పేర్కొన్న నిబంధనలు అమలు చేశామని ఎప్పటికప్పుడు వారు నివేదిక సమర్పించాల్సి ఉంది. అయితే అప్పటి వరకూ డ్రా చేసుకున్న నిధులు వినియోగానికి సమగ్ర నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. దీనిపై సంతృప్తి చెందితే తరువాత నిధులు ముందస్తుగానే డ్రా చేసుకోవచ్చని పేర్కొంది. సెక్షన్ 4 పార్ట్ బి1లో ఈ అంశాన్ని పేర్కొన్నారు. నిధులు డ్రా చేసుకున్న తరువాత చెప్పిన నిబంధనల అమలు సంతృప్తికరంగా లేకపోతే బ్యాంకు ఇచ్చిన క్లోజింగ్ సమయంలోపు అడ్వాన్స్‌ను తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుందని సెక్షన్ 4 పార్ట్ బి2లో పొందుపరిచారు. అలాగే సూచించిన తేదీలోపు ఫలితాలు సాధించలేకపోతే బ్యాంకు రుణ గ్రహీతకు నోటీసు ఇస్తుందని, విత్‌డ్రా చేసుకోకుండా మిగిలిన మొత్తాన్ని షెడ్యూలు 4లో పేర్కొన్న ఫార్ములా ప్రకారం తగ్గిస్తామనీ సెక్షన్ 4 పార్ట్ బి2లో పొందుపరిచారు. అమరావతిని రెండు దశల్లో అమలు చేయనుండగా మొదటిదశలో రూ.30,644 కోట్లు ఖర్చు చేయనున్నారు. నిబంధనల ప్రకారం అమరావతిలో పట్టణాభివృద్ధి సదుపాయాల అమలు, నిర్మాణాలకు చట్టపరమైన అనుమతులు తీసుకోవాల్సి ఉందని స్పష్టంగా పొందుపరిచారు. మొదటిదశ అభివృద్ధిలో 2025-2029 మధ్యకాలంలో సదుపాయాలు, మంచినీటి సరఫరా, అమరావతి గవర్నమెంటు కాంప్లెక్స్ ఒకటో జోన్ నుండి ఏడో జోన్ పదోజోన్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ప్రపంచబ్యాంకు ప్రొగ్రామ్ ఫర్ రిజల్ట్స్(పిఫర్ఆర్)లో అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోని భవనాలు, ఒకటి మూడు జోన్లు, 5బి, 5డి, 6 జోన్లలో ఫలితాలు సాధించాలని పేర్కొంది. ప్రపంచబ్యాంకు, ఎడిబి రెండూ సమన్వయంతో నిధులు విడుదల చేయంతోపాటు ఒకే సంస్థ ద్వారా తనిఖీలు నిర్వహిస్తాయనీ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు.

ఆశావర్కర్ల శ్రమను గుర్తించని ప్రభుత్వాలు

రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ ముట్టడి : ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి

మహబూబ్‌నగర్‌కు బస్సు జాతా

నవతెలంగాణ- మహబూబ్‌నగర్

ప్రజలకు ఏ రోగం వచ్చినా ప్రభుత్వాలకు ఎలాంటి చెడ్డ పేరు రాకుండా ప్రజలకు నిత్యం సేవలు చేస్తున్న ఆశా వర్కర్ల శ్రమను గుర్తించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చేరుకున్న బస్సుజాతాకు అశోక్ టాకీస్ చౌరస్తాలో స్వాగతం పలికారు. అక్కడినుంచి క్లాక్ టవర్ మీదుగా మున్సిపల్ టౌన్ హాల్‌వరకు ఆశా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం టౌన్‌హాల్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దిప్లా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో వెంకట్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లను సేవలు చేసేవారిగా మాత్రమే గుర్తిస్తున్నాయని, వారికి తగిన వేతనాలు ఇవ్వడంలో శ్రద్ధ చూపించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశా వర్కర్ల సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పిందని, ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. సమానపనికి.. సమాన వేతనం కింద.. ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు అడుగుతున్నారని, ఇది హర్షించదగ్గ విషయమని అన్నారు. కానీ దాన్ని కూడా ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విమర్శిం చారు.గత అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకారం.. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రత,



సాధారణ సెలవులు.. తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ బస్సుజాతా ముగిసేలోపు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ప్రకటన చేయాలని లేకపోతే అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరిం చారు.ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లలో ఐక్యత తీసుకురావడంతో పాటు కార్యకర్తల సమస్యలపై ప్రజల మద్దతు కూడగట్టేందుకే ఈ బస్సు యాత్ర చేపట్టినట్టు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో యూనియన్ తరపున రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నప్పుడు ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు ఆనాడు మద్దతిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. బస్సుయాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 31న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలాదేవి, బస్సు జాత బృందం సభ్యులు బాలమణి, ఎస్. పద్మ, ఆర్. సాధన, గంగామణి, సునీత, సీఐటీయూ జిల్లా కోశాధికారి బి. చంద్రకాంత్, టౌన్ కన్వీనర్ జి. రాజ్‌కుమార్, నాయకులు యాదమ్మ, సావిత్రి, సుగుణ, భాగ్య, సునీత, వెంకటమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు ఎర్రజెండాదే

- ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్
- సంగారెడ్డిలో కవులు, రచయితలు, గాయకులతో సమావేశం
- సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు



నవతెలంగాణ-సంగారెడ్డి

దేశంలో నీతి నిజాయితీ గల పార్టీ సీపీఐ(ఎం) అని, భవిష్యత్తు ఎర్రజెండాదే అని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన కవులు, రచయితలు, గాయకుల సమావేశంలో ఆనంద్ మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్నది సీపీఐ(ఎం) మాత్రమేనని అన్నారు. సంగారెడ్డిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కళాకారులు, రచయితలు, గాయకులు కూడా మద్దతు తెలపాలన్నారు. కళ వ్యాపారం కోసం కాకుండా ప్రజల కోసం ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై కవులు, రచయితలు గళమెత్తాలన్నారు. ప్రజల కోసం గళం ఎత్తితే చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య, ప్రజానాట్యమండలి నాయకులు నాగభూషణం, అంజయ్య, ఆంజనేయులు, యేసు, రాజు, ఎల్లయ్య, ప్రకాష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు తోషిబా కార్మికుల రూ.20లక్షల విరాళం

ప్రజాపోరాటాలకు అండగా నిలబడాలి : పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజాపోరాటాలకు అండగా నిలబడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు ప్రజలను కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా తోషిబా కార్మికులు సంగారెడ్డిలో ఆదివారం ఆహ్వాన సంఘం చైర్మెన్ చుక్క రాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య, యూనియన్ అధ్యక్షులు జై మల్లికార్జున్‌కు రూ.20 లక్షలు విరాళాలను అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు, వీరయ్య మాట్లాడుతూ.. ప్రజాపోరాటాలకు కార్మిక వర్గం అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

మహాసభల జయప్రదానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న జెండా ఎర్రజెండా అని అన్నారు. సహకరించిన కార్మికులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రెటరీ అనంతరావు, నాయకులు శ్రీధర్, పుల్లం రాజు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో పాటు సామాజిక సేవలోనూ సీపీఐ(ఎం) ముందంజ

మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జె.మల్లికార్జున్

- సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంపు



నవతెలంగాణ-పటాన్‌చెరు

పోరాటాలతో పాటు సామాజిక సేవలో కూడా సీపీఐ(ఎం) ముందుంటుందని ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జె.మల్లికార్జున్ అన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామంలోని పీఎస్ఆర్ టౌన్‌షిప్‌లో అమేద హాస్పిటల్స్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. వైద్యం ప్రజలందరికీ అందినప్పుడే దేశం ముందుకు పోతుందన్నారు.

వైద్యం పట్ల పాలకులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. వైద్యం బాగా వ్యాపారమయమైందని, సామాన్యులకు అందని ద్రాక్షగా మిగిలిపోయిందని వాపోయారు. వైద్యానికి నిధులు ఎక్కువగా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రాజయ్య, కాలనీ ప్రెసిడెంట్ నల్లవాగుల మురళీ, నాయకులు బంగారాజు, నగేష్, నరసింహారెడ్డి, భరత్, వెంకన్న, పోలీస్ రెడ్డి, నరేష్, బసవేశ్వరి, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 10న చలో ఢిల్లీ

- కనీస పింఛన్ రూ.ఐదువేలకు పెంచాలి
- ఎన్‌పీఆర్‌డీ దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం : రాష్ట్ర సదస్సులో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఎం. అడివయ్య

కనీస పింఛన్ రూ.ఐదువేలకు పెంచాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగుల హక్కుల కోసం ఫిబ్రవరి 10న చలో ఢిల్లీకి పిలుపునిస్తున్నట్టు ఎన్‌పీఆర్‌డీ జాతీయ ఉపాధ్యక్షులు ఎం అడివయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల కనీస పింఛన్‌ను రూ.మూడు వందల నుంచి రూ.ఐదు వేలకు పెంచాలనీ, ప్రతి వికలాంగునికీ అంత్యోదయ రేషన్ కార్డు, ఉపాధి హామీ చట్టంలో భాగంగా జాబ్ కార్డు ఇచ్చి 200 రోజులు పని దినాలు కల్పించాలని దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్టు ప్రకటించారు. జనవరిలో జిల్లా సదస్సులతో పాటు 20న కలెక్టర్ కార్యాలయాల ముందు సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు కె వెంకట్ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ దేశంలో 2011 నుంచి పింఛన్లలో కేంద్ర ప్రభుత్వం వాటా కేవలం రూ.300 మాత్రమే చెల్లిస్తుందని తెలిపారు. నిత్యావసర సరకుల ధరలు 300 రెట్లు పెరిగాయనీ, పింఛన్లు మాత్రం పెంచకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదల సూచికి పింఛన్‌ను అనుసంధానం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఇందిరాగాంధీ జాతీయ వికలాంగు ల పింఛన్ పథకాన్ని వికలాంగులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్ మాదిరిగా పింఛన్ పొందడం వికలాంగుల హక్కుగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. 2015 డిసెంబర్ 3న ఆర్భాటంగా ప్రధాన మంత్రి ప్రారంభించిన సుగమ్య భరత్ అభియాన్ పథకం అమలు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు నిధుల కేటాయింపులో ఆ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం అసమర్థత వలన 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్, 2007 ఐక్య రాజ్య సమితి హక్కుల ఒప్పంద పత్రం, నేషనల్ పాలసీ, నేషనల్ ట్రస్ట్ వంటి కీలక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని వివరించారు. 2016 ఆర్‌పీడీ చట్టానికి సవరణ చేయడానికి విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2016 ఆర్‌పీడీ చీఫ్ కమిషనర్, నేషనల్ ట్రస్ట్‌కు పదేండ్ల నుంచి చైర్మెన్‌ను నియమించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వికలాంగులకు రిజర్వేషన్లు అందని ద్రాక్షగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి భర్తీ చేసేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వలన వికలాంగులు రిజర్వేషన్ సౌకర్యం కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. వివాహంతో సంబంధం లేకుండా వికలాంగులకు అంత్యోదయ అన్న యోజన కార్డులు జారీ చేయాలనీ, అన్ని రకాల రైళ్లలో వికలాంగుల ప్రయాణ రాయితీ సౌకర్యాన్ని పునరుద్ధరిం చాలని డిమాండ్ చేశారు. వెంకట్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల రాయితీలను పొందేందుకు యూడీఐడీ కార్డునే గుర్తింపుగా పరిగణిం చాలని డిమాండ్ చేశారు, బడ్జెట్‌లో వికలాం గుల సంక్షేమానికి ఐదు శాతం నిధులు కేటాయిం చాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, ఉపాధ్యక్షులు సాయమ్మ, బి స్వామి, యశోద, దశరథ్, ఉపేందర్, సహాయ కార్యదర్శులు కొనింటి నర్సింహులు, బాలేశ్వర్, గంగాధర్, లింగన్న, రాష్ట్ర నాయకులు శశికళ, ప్రకాష్, చంద్రమోహన్, నాగమణి, శేఖర్ గౌడ్, లలిత, దుర్గ, చెన్నయ్య, నర్సింహా, బాలయ్య, రమేష్, మల్లేష్‌తో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు

బుక్‌ఫెయిర్‌లో బాలామణి రచనల ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ రచయిత్రి బాలామణి రచించిన, నవతెలంగాణ ప్రచురించిన స్త్రీ ఆధునిక కళాకారిణిగా శతాబ్దయానం-సమాజ ప్రతిబింబం, భారతీయ దృశ్య కళాచరిత్ర పుస్తకాలను హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో ముఖ్య అతిథులు ఘంటసాల నిర్మల, తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్ కోట్ల అనుమంతరావు, కిన్నెర మూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నవతెలంగాణ బుక్‌హౌస్ ఎడిటర్ ఆనందాచారి, నవ తెలంగాణ జనరల్ మేనేజర్ ఆర్ వాసు, మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. నిర్మల మాట్లాడుతూ..చిత్రకళలో విస్మృతికి గురైన కళాకారులను వెలుగులోకి తీసుకురావడానికి బాలామణి చేసిన కృషి పుస్తకాల్లో కనిపించిందన్నారు. ఆమె ప్రతివారం రాసిన వ్యాసాలను సంకలనం రూపంలో తీసుకొచ్చినందుకు నవతెలంగాణ పబ్లిషింగ్ సంస్థను అభినందించారు. హనుమంతరావు మాట్లాడుతూ...ఉమ్మడి రాష్ట్రాల్లో తెలుగు విశ్వవిద్యాలయంతో పాటు పలు వర్సిటీల్లో ఆర్ట్ అండ్ కల్చర్‌కు సంబంధించి సబ్జెక్టులను బోధించడానికి పుస్తకాల కోసం బరోడా వర్సిటీపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇప్పుడు ఆ కొరత తీర్చేలా బాలామణి రచనలున్నాయని కొనియాడారు. పరిశోధక విద్యార్థులకు ఈ రచనలు తోడ్పడుతాయని చెప్పారు.

రచయిత్రి బాలామణి మాట్లాడుతూ..చిత్రకళ మీద ఆసక్తితో పరిశోధన చేస్తూ రాసిన వ్యాసాలను పుస్తక రూపంలో తెచ్చామన్నారు. ఆనందాచారి మాట్లాడుతూ.. సామాజిక శాస్త్రాలు చదివే విద్యార్థులకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయని ఆకాంక్షించారు.

మనువాదం మానవాళి మనుగడకు ముప్పు

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ



నవతెలంగాణ-క్లాక్‌టవర్

మనువాదం మానవాళి మనుగడకు తీవ్రమైన ముప్పు అని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం ఐద్వా నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పీఏపల్లి మండలం పుట్టంగండి వద్ద పిక్నిక్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో అంబేద్కర్‌పై అహంకారపూరిత వ్యాఖ్యల చేయడం పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంద న్నారు. 75 ఏండ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయం లోనే ఆ రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమ న్నారు. ఆయన తక్షణం క్షమాపణ చెప్పాలని, అలాగే హోం మంత్రిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పేరు ఉచ్చరించడమే నేరమన్నట్టుగా అసహనం ప్రదర్శించి, బీజేపీ అసలు స్వరూపాన్ని చూపించుకుందని విమర్శిం చారు. అమిత్ షా వ్యాఖ్యలను మోడీ సమర్థించడం దారుణమని అన్నారు. బీజేపీ, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్.. రాజ్యాంగం స్థానంలో మనుధ ర్మశాస్త్రాన్ని తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తోందని, ఇది వారి పరా కాష్టకు నిదర్శ నమని అన్నారు. తాము అత్యంత ప్రామాణికంగా భావించే మనుస్మృతికి స్థానం లేకుండా పోయిందని ఆర్ఎస్ఎస్ నేత గోల్వాల్కర్ స్వయంగా తమ ఆర్గనైజర్ పత్రికలో వ్యాసాలు రాసుకున్నారని తెలిపారు. ఇలాంటి బీజేపీపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచార కార్య క్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడు తూ.. అవకాశం వచ్చిన ప్రతిసారి రాజ్యాం గంపై విరుచుకుపడడం చాలామంది కాషా యాదళ నాయకులకు అలవాటేన్నారు. ఈ తరహా పెత్తందారీ పోకడలు భారత రాజ్యాంగ స్ఫూర్తికి ప్రమాదకరన్నారు. హోంమంత్రి అమిత్‌షా బుకాయింపు దేశ ప్రజలకు బేషరతుగా క్షమా పణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు కొండా అనురాధ, జిట్టా సరోజ, జిల్లా ఆఫీస్ బేరర్స్ పద్మ, భూతం అరుణ, నాగమణి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

- నేడు జిల్లా కేంద్రాల్లో నిరసనలు
- ఎస్కేఎం నాయకుల పిలుపు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలంటూ సోమవారం జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలపాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. మార్కెట్ పాలసీ పత్రాలను దహనం చేయాలని సూచించింది. 'అన్ని రైతు సంఘాలతో చర్చలు జరపండి' అనే నినాదంతో ఎస్కేఎం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని కోరింది. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఎస్కేఎం రాష్ట్ర నాయకులు టీ. సాగర్, పశ్యపద్మ వి.ప్రభాకర్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతునేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలనీ, అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారిపై హత్యాయత్నం, కుట్రకు బాధ్యులైన పోలీసు కమిషనర్ లక్ష్మీసింగ్, ఇతరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ వ్యవసాయ మార్కెట్‌విధానం, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, నేషనల్ కో ఆపరేషన్ పాలసీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడు శోభన్, లెల్లెల బాలకృష్ణ, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, దేవరాం తదితరులు పాల్గొన్నారు.

కరుణ.. ప్రేమ.. దయ.. క్షమాపణ ఇవే యేసు ప్రవచనాలు

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరుణ , ప్రేమ , దయ , క్షమాపణ వంటి సద్గుణాలతో తోటి మానవుణ్ణి ప్రేమించాలని, ప్రపంచ మానవాళికి యేసుక్రీస్తు సూచించిన సుగుణాలు, ప్రవచనాలు ఇవేనని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో బీజేపీ మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షురాలు అల్కా మనోజ్ నివాసంలో క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసు క్రీస్తు ప్రవచనాలు సమస్త మానవాళికి అనుసరణీయమన్నారు. యేసు చూపిన మార్గాన్ని అనుసరిస్తే శాంతి నెలకొంటుందనీ, ఆయన ప్రవచనాలను ప్రతి ఒక్కరు అనుసరించి ప్రపంచ శాంతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సమాజంలో హింస, దోపిడీ లాంటి రుగ్మతలు పోవాలంటే యేసు క్రీస్తు సూచించిన ప్రవచనాలను అనుసరిస్తే వాటిని నిర్మూలించవచ్చని సూచించారు. ఈ దేశంలోనే కాకుండా ప్రపంచంలోని అనేక దేశాల్లో క్రిస్టియన్ సోదరులు విద్య, వైద్యంలో అనేక సంస్థలను నెలకొల్పి ప్రభుత్వానికి దీటుగా నడుపుతున్నారని అన్నారు. ఇంకా ఇలాంటి ఇనిస్టిట్యూషన్లను నెలకొల్ప డానికి కేంద్ర, రాష్ట్ర సహకారాలు తీసుకుని నిరుపేదలకు సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిషప్ డేవిడ్ సుధాకర్, పాస్టర్ రాజ్ ప్రకాష్ పాల్, పాస్టర్ జోసెఫ్ వినోద్, పాస్టర్ జాన్ క్రిస్టోఫర్, పాస్టర్ ఆమోస్ , గవర్నర్ ప్రయివేటు కార్యదర్శి కాళిదాస్ నగేష్‌తో పాటు హెూప్ ఫర్ హెల్త్ డైరెక్టర్ విజయ్ కుమార్ అండ్ టీం తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో సింగరేణి పాత్ర కీలకం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశ ఆర్థికాభివృద్ధిలో సింగరేణి కాలరీస్ సంస్థ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సింగరేణి సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన యాజమాన్యానికి, కార్మికులకు, వారి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్ర, దేశ ఇంధన అవసరాలను సింగరేణి తీరుస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో లక్షలాదిమంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారం కల్పిస్తున్నదన్నారు.



సింగరేణిని కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా, ఖనిజాన్వేషణ సహా ఇతర రంగాల్లోకి కూడా విస్తరింపచేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

వసుంధర రాజే కాన్వాయ్‌లోని వాహనం బోల్తా

- నలుగురు పోలీసులకు గాయాలు

జైపూర్: బీజేపీ నాయకురాలు, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే కాన్వాయ్‌లోని పోలీస్ వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. పాలి జిల్లాలోని రోహత్-పానిహరి క్రాస్‌రోడ్స్ సమీపంలో ఆదివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రోహత్-పానిహరి క్రాస్‌రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనదారుడిని తప్పించే క్రమంలో పోలీస్ వాహనం డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బోల్తా పడింది. ఆ సమయంలో కారులో ఏడుగురు పోలీస్ సిబ్బంది ఉండగా.. వారిలో కొందరికి గాయాలైనట్టు పాలి ఎస్పీ వెల్లడించారు. వాహనం బోల్తా పడడంతో రాజే వెంటనే తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులైన పోలీసు సిబ్బందిని ఆస్పత్రికి తరలించారు. అయితే వసుంధ రాజే తన క్యాబినెట్ మంత్రి ఓటారాం దేవసి తల్లి మృతి చెందడంతో నివాళులర్పించేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

రేల పువ్వు

తనువు మీది హరిత వస్త్రం జారిపోయి
రహస్యమేదో బహిర్గతం అయినట్టు
కొమ్మ కొమ్మకు
బొట్టు బొట్టంత బంగారు పూమొగ్గలు

అదేదో పార్టీ జెండా రెప రెపలాడుతున్నట్టు
చెట్టు నిండా విరబూసిన పువ్వు
సీమంతమో
పట్టు వోణీ వస్త్రాలంకరణా మహోత్సవమో
జరుగుతున్నట్టు

పేరంటాళ్ళ లేలేత ఎరుపు గదుమకు
పూసిన గంధం
కవచం తొడిగినట్టు
స్త్రీ లోక పాదాలకు రాసిన
ముత్తయిదు మర్యాద

కనబడని తీగ ఏదో
ఆకాశానికి పాకుతున్నట్టు
చెట్టంతా
గుమ్మడి, బీరపువ్వుల దరహాసం
నేల చూపులు చూసే
అదోరకం తంగేడుపువ్వు



మంగళస్నానానికి సిద్ధమయిన నవ వధువు

ఎల్లో కలర్ అభిమాన చిత్రకారుడు
కాన్వాసు మీద గీసిన పాలపుంత
ముట్టుకుంటే బుగ్గలు కందిపోయే
సుకుమారి సోయగం
కొంటె గాలి చిటికెన వేలు తాకగానే
కస్సుమని దునికే ముక్కుమీది కోపం
క్షణాల్లో రాలిపోయే తుమ్మపూల వర్షం

ముచ్చటకో మురిపానికో
కోడిగుడ్డు కూరలా
క్యాలీఫ్లవర్ ఫ్రైలా
అమ్మ వండి పెట్టు కమ్మటి వంట కోసమో
అడవికి పోయి
గుత్తులు గుత్తులుగా కోసుకువచ్చిన
తీపి గురుతు

రేల పువ్వు
పిలిస్తే పలికేది
చేయి చాపితే దోసిట్లో వాలేది
పాపిష్టి భూదందా రోగం ముదరక మునుపు.

- గజ్జెల రామకృష్ణ, 8977412795

దీప సందేశం

పంచే వెలుగును ఆసరాగా
లోకాన్ని చూడమంటుందే తప్ప
ఏ దీపమూ తననే చూస్తూ
కూర్చోమనదు

మనం వెలిగించే దీపమే అయితే..
ఆరిపోకుండా ఇంత తైలం
ఆర్పకుండా గాలికి అడ్డూ
కాలిపోకుండా ఇన్ని వత్తులూ
అందించమంటుందంతే!

సూర్యుని వెలుగులో
ప్రకృతి అందాలను
ఆ అందాల వెనుక ఉన్న
ప్రాకృతిక నియమాలను
జీవిత పాఠాలను నేర్పే
కదులుతున్న కాలచక్రాన్ని
అవలోకించి అవగాహన
చేసుకోవడం
ఓనమాల బడికే వదిలేశాం.

దీపాల చుట్టూ తిరిగే పురుగుల్లా
విశ్వాసాల చుట్టూ
కళ్లుమూసుకుని
ప్రదక్షిణలు చేస్తుంటామంతే

అవి చూపే
వెలుతురు దారుల్లో
అడుగే వేయం

వాళ్లకు
మనం శలభాలమై దీపజ్వాలలకు
రెక్కలు కాలుతూ..
ప్రాణాలు పోతున్నా
వాళ్లు చూపే కృత్రిమ ప్రగతి
దీపాల చుట్టూ
ఎగరటమే కావాలి

రంగురంగుల కాంతుల
జలధారలు చూస్తూ
మురిసి మైమరచి పోయి
విద్యుల్లతా కాంతిచ్ఛటలకు
కళ్లుబైర్లు కమ్మి
మత్తులమూ ఉన్మత్తులమై పోవాలి

వాళ్లంతే..
మనల్ని మాయాకాంతిపుంజాల
తాళ్లతో కట్టేసి
తమ చీకటి రాజకీయాలకు
తెరలు తీస్తారు

మనమెప్పటికీ
తూరుపు తిరిగి
దండంపెట్టమంటూ..
పడమటి సుఖాలకై
పరుగులు పెడతారు.

- మడిపల్లి రాజ్‌కుమార్
99496 99215

పాలమూరు సాహిత్య సుగంధం...
'తెలంగాణ సాహితీ' పరిమళం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు

"తెలంగాణ సాహితి" మహబూబ్ నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్‌లోని వాగ్దేవి కళాశాలలో ఈ నెల మొదటి ఆదివారం (1-12-24) ఉమ్మడి పాలమూరు జిల్లా తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ప్రారంభ సమావేశానికి ప్రముఖ గజల్ ఇరివింటి వెంకటేశ్వర శర్మ అధ్యక్షత వహించగా కాళిదాసు సభను పరిచయం చేశారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా ప్రముఖ రచయిత తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం, తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన, ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్‌కృష్ణ, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఖాజా మైనద్దీన్, కొప్పోలు యాదయ్య, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వహీద్ ఖాన్, భానుచందర్ పాల్గొన్నారు. ప్రారంభసభలో సాహిత్యం సమాజం అనే అంశంపై ప్రసిద్ధ రచయిత, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం లోతైన విశ్లేషణ చేశారు.

'నడువు.. నడువు .. కవి గాయకా.. రైతన్నల కండదండ నీవుండగా' అనే పల్లవితో తెలంగాణ సాహితి వనపర్తి జిల్లా కార్యకర్త, కవి, వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ ఆలపించిన గీతాలాపన ఆహూతులను అలరించింది.

మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల కార్యక్రమాల నివేదికలను ఆయా జిల్లాల ప్రధాన కార్యదర్శులు ప్రవేశపెట్టారు.

మధ్యాహ్న భోజనానంతరం జరిగిన రెండవ సమావేశానికి ప్రముఖ కవి లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సభలో నాగర్‌కర్నూల్ తెలంగాణ సాహితి జిల్లా కార్యదర్శి వహీద్‌ఖాన్, ప్రసిద్ధ కవులు వెన్నెల సత్యం, వనపట్ల సుబ్బయ్య, భాస్కరయ్య పొద్దుటూరు ఎల్లారెడ్డి, వివిధ సాహిత్య ప్రక్రియలపై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. వైద్యం భాస్కర్, కె.ఏ.ఎల్.సత్యవతి, సురభి జగపతిరావు, ఆర్.వనజ, పులి జమున, బాదేపల్లి వెంకటయ్య గౌడ్ తదితరులు కవితా గానం వినిపించి అందరిని ఆకట్టుకున్నారు.

కవి కథకులు వహీద్ ఖాన్ కవి సమ్మేళనం ను ప్రారంభిస్తూ పద్యం,వచనం, కథ, గల్పిక, నవల, పాట ఏ సాహిత్య ప్రక్రియ అయినా గానీ ప్రజల సమస్యలను ప్రస్తావించాలని, అప్పుడే ప్రజాదరణ పొందుతుందని తెలియజేశారు. సీనియర్ కవులు రచయితలు వల్లభాపురం జనార్ధన, పొద్దుటూరి ఎల్లారెడ్డి లక్ష్మణ్ గౌడ్, వైద్యం భాస్కర్, డా. భానుచందర్, సత్యవతి, పులి జమున దేవదానం, దినకర్, వనపట్ల సుబ్బయ్య, రాజారామ్ ప్రకాష్, గంధం నాగరాజులకు సన్మానం చేశారు.

యువ కవులు రాజేష్, సాయి ప్రణవి, ఎం భానుప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.





- ప్రమోద్ కుమార్,
9603387135





సామాజిక అస్తిత్వ చైతన్యంతో సాహిత్యం రావాలి

పేరు కోసమే రాసేవాడు అక్కడే ఆగిపోతాడు. సమాజంలో మార్పు కోసం, సమసమాజ నిర్మాణం కోసం సామాజిక అస్తిత్వ చైతన్యంతో రాసేవాళ్లే అనునిత్యం సూర్యునిలా వెలుగుతారు. సాహితీ కారుని సృజన.. మనిషిలోని కనుగుడ్డు మాదిరి స్వల్పంగా కనిపించినా సమాజమంత విస్తృతమైనది. సమాజాన్ని సాహిత్యం మార్చగలదని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఆధునిక సాహితీ ప్రక్రియలో పాటకు విశేషస్థానం ఉంది. అది మనుషుల్ని చైతన్యవంతం చేస్తుంది. అదే సినీ యుగళ గీతాలు మనిషికి తాత్కాలిక ఆనందం కలిగిస్తాయి. కొన్నిసార్లు వారి జేబుల్ని గుల్ల చేస్తుంది. తనలోని చైతన్యమే సమాజ చైతన్యమని పలువురు కవులు అనుకుంటారు. అది సరికాదు. సామాజిక అస్తిత్వ చైతన్యం ఉంటేనే సాహితీకారుల సాహిత్యం సుసంపన్నమవుతుందని గుర్తుంచు కోవాలి. అదే ప్రజల చైతన్యస్థాయిలను పెంచి, పోరాడే తత్వాన్ని పెంచుతుంది. సమాజంలో ఆశించిన మార్పు సాధ్యమవుతుంది. ప్రస్తుతం దేశం కుంపట్లో ఉంది. పాలకుల దుశ్చర్యలతో మాడిపోయే సమాజాన్ని మేల్కొల్పి చైతన్య వంతం చేసేలా... సాహితికారులే చైతన్య శీలంగా మారి, సాహిత్యాన్ని వెలువర్చాల్సిన సమయం ఆసన్నమైంది.

- నాళేశ్వరం శంకరం, ప్రముఖ రచయిత

తెలంగాణ సాహితే నాకు స్ఫూర్తి

నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన నేను స్థానికంగా సాహితీ స్రవంతి సంస్థ ద్వారా కవిత విధానాన్ని ప్రాథమికంగా నేర్చుకున్నాను. తెలంగాణ సాహితి సంస్థకు చెందిన ప్రముఖ కవుల కవితల్ని చదివి ఎంతో స్ఫూర్తి పొందాను. ఆ స్ఫూర్తితోనే ఎన్నో కవితల్ని వెలువరిస్తున్నానని చెప్పడానికి గర్విస్తున్నాను. కొన్ని పుస్తకాల్ని సైతం ప్రచురించి.. ప్రముఖుల మన్ననలను అందుకోవడం సంతోషంగా ఉంది.

- వనపట్ల సుబ్బయ్య, ప్రముఖ కవి

నూతన ప్రక్రియలపై విశేష కృషి జరగాలి

మూస ధోరణిలో, యాంత్రికధోరణి లేని కవిత్వం రావాలి. విభిన్న సాహితీ ప్రక్రియలలో సృజన శీలతతో సాహితీ ప్రస్థానం కొనసాగడం అత్యవసరం. అందుకు యువతరం ముందుకు రావలసిన తరుణం ఆసన్నమైంది. సమాజాన్ని చైతన్యపరిచేలా, ప్రజలను అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదిరించే పోరాటపటిమ పెంచేలా నవ కవనం రావాలి. అప్పుడే సాహితీ వనం సుసంపన్నమై శోభిస్తుంది.

- వల్లభాపురం జనార్ధన,
తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షులు

యువతకు చుక్కాని.. "తెలంగాణ సాహితి"

ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న యువతను కవితా పథం వైపునకు తీసుకొచ్చేందుకు 'తెలంగాణ సాహితి' కొన్ని జిల్లాల్లో అవిరళ కృషి చేస్తోంది. యువతకు కవితా పోటీలు, వ్యాసరచన పోటీలను నిర్వహించి, బహుమతులను అందించి.. భవిష్యత్తులో వారిని మేలైన కవులుగా సమాజానికి అందించేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తోంది. ఇలాంటి కృషి అన్ని జిల్లాల్లో జరగాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. గతేడాది 'పాటకు జేజేలు' కార్యక్రమం ద్వారా సినీ గేయ రచయితలపై పీహెచ్‌డీ పరిశోధకుల చేత సమీక్షలు చేశాం. దానికి చక్కని ఆదరణ లభించింది. 'తెలంగాణ సాహితీ యాత్ర' ద్వారా ప్రాచీన కవులు పాల్కురికి సోమనాథుడు, పోతన, వట్టికోట అళ్వారుస్వామి జన్మభూముల్ని సందర్శించి అక్కడ శిథిలావస్థలో ఉన్న వారి సమాధులను చూసి చలించిపోయాం. సంఘం తరపున ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, అక్కడ పర్యాటక శోభను తేవడంలో సఫలీకృతమయ్యాం. ఆరేండ్ల క్రితం ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ప్రసిద్ధ రచయిత, గోల్కొండ పత్రిక సంపాదకులు, సామాజికవేత్త సురవరం ప్రతాపరెడ్డి జన్మస్థలమైన ఇటిక్యాలపాడును సందర్శించి, యువ కవులను చైతన్యపరిచాం. లెక్కకు మిక్కిలి కార్యక్రమాల ద్వారా యువతకు చుక్కానిగా మారేందుకు తెలంగాణ సాహితి శక్తివంచన లేకుండా అవిరళ కృషి చేస్తోంది.

- అనంతోజు మోహన్‌కృష్ణ

కాలంతోపాటు కవిత్వము మారాలి

తెలంగాణ సాహితి ఏర్పడినప్పటి నుంచి ఇందులోనే కొనసాగుతున్నాను సామాజిక మాధ్యమాల పుణ్యమా అని సుదీర్ఘ కవితలు చదివే విధానం పోయింది. కవితా పుస్తకాలు ప్రచురించి ఇచ్చినా పాఠకులు వాటిని తిరగేస్తారనే నమ్మకం లేకుండా పోయింది. ప్రజల సమస్యలే ప్రధాన అజెండాగా మారినప్పుడు వారి నుంచి తప్పకుండా సానుకూల స్పందన వస్తుంది. అయితే మనం చెప్పే విధానాన్ని, రాసే పద్ధతిని సృజన శీలంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దికోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కవులు ఎంచుకునే అంశాన్ని బట్టే పాఠకుల ఆదరణ ఉంటుందని నేను నమ్ముతాను.

- వెన్నెల సత్యం, ప్రసిద్ధ కవి

బహుజన సుక్కను

మా
నాయిన నాగలి పట్టి
తొలి పొద్దు పాట పాడుతుంటే
మాయమ్మ ఇత్తనమేస్తూ..,
మలి పొద్దు రాగమందుకుంటే
సెమట సుక్కల ఉమ్మనీరును తాగి
విముక్తి ఎలుగునై పుట్టినోన్ని !

పుట్టుకకు ముందే
అమ్మ కడుపుల ఉండి
ఆకలి పాఠాన్ని చదువుకున్నోన్ని !
అవమానాల గాయాల్ని రుచి చూసినోన్ని !!

నేను పుట్టినెంబడే,
బతుకు పోరును చూసి భయపడి
ఏడుపు పదమందుకుంటే...,
మాయమ్మ పట్టుకున్న ధైర్యపు
కొడవలిని నాకిచ్చింది.
స్వేచ్ఛ తగులును తెంపి
కడుపు నింపుకొమ్మని భరోసానిచ్చింది

మా నాయిన
భూజాన మోస్తున్న సుత్తెను నాకిచ్చి
బువ్వ దొరికే బుద్ధులెన్నో చెప్పిండు.
దోపిడీ కొండల్ని పిండి చేసి
రొట్టెల్ని చేసుకొని తినమని,
శ్రమల సక్కని బాట చూపిండు.

మాయక్క
అంటు ముట్టు, మాయ కట్టుబాట్ల
మడుల సంగతేందో తెలుసుకొని సుక్కల ముగ్గై
అందరిని అల్లుకొమ్మని
ఇరికి పండ్ల మాట చెప్పింది.

మాయన్న
నడి ఊళ్ళకు తోలుకపోయి
రావి చెట్టు కిందున్న అచ్చర దీపాలను చూపి
గన్ను లాంటి పెన్ను ఒకటి నాకిచ్చి పోయిండు.

ఇప్పుడు
నేను చేయాల్సిందల్లా ఒక్కటే....
కొడవలి కోతై, సుత్తె దరువై
అల్లుకున్న పెను చీకట్ల మీద అక్షర తూటాలు
పేల్చుతూ...,
నీలి ఆకాశంలో
తూరుపు గుండెల మీద
బహుజన సుక్కని నిలబెట్టడమే!!

- చిక్కొండ్ర రవి, 9502378992


న్యాయవాదిగా, న్యాయమూర్తిగా తన వృత్తి జీవితంలో చవిచూసిన పక్షపాత ధోరణులను- పోలీస్ స్టేషన్లలో, కోర్టుల్లో నలిగిపోతున్న జీవితాలను బట్టబయలు చేస్తూ రాజేందర్ 'జింబో' రాసిన కథల సంపుటియే "నేను... నా నల్లకోటు".

న్యాయం కోసం

పోలీసు, న్యాయవ్యవస్థ, రాజ్యంలోని అవకతవకలు, అన్యాయాన్ని వివరిస్తూ కథలు రాయడం సాహసమేనని చెప్పాలి. కటువైన నిజాలను బాహాటంగా తెలియజేసి లేనిపోని చిక్కులను ఎదుర్కోవడం కంటే, వాటిని హాస్య వ్యంగ్యరీతిలో, కొన్నిసార్లు అలిగరీ పద్ధతిలో రాసి పాఠకులను ప్రభావితం చేసే పద్ధతిని రచయిత ఎంచుకున్నారు. ఇందులో చాలా కథలు చందమామ కథలుగా, బేతాళ కథలుగా, గాడిద కథలుగా, చివరకు నీతి బోధకాలుగా తీర్చిదిద్దడంలో మంచి వ్యంగ్యాన్ని పోషించగలిగారు.

నగరంలో ఫ్లెక్సీలు వేలాడదీయరాదని మున్సిపాలిటీ వారి ఆదేశం. అయినా అన్ని రాజకీయ పార్టీలు, చివరకు వీఐపీలు కూడా నగర సందర్శనానికి వస్తే చాలు, ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు వేలాడదీసి నానా హంగామా చేస్తుంటారు. పర్యావరణం గురించి ఎవరు పట్టించుకోరు. మనుషులకు రాహుకాలం, వాస్తు పట్ల పిచ్చి పెరిగిపోతున్న రోజుల్లో, కోర్టు కేసులకు వీటిని వర్తింప చేస్తే అసలుకే మోసం వస్తుందని ఒక కథ తెలియజేస్తుంది. మేధావులని గుర్తించి ఇచ్చే గౌరవ డాక్టరేట్ల ప్రహసనం గురించి ఒక కథ, మేధావుల్లో పెరిగిపోతున్న సన్మానాల మోజు మీద విసురు ఇంకో కథలో కనిపిస్తుంది. మనుషుల్లోనే ప్రేమ, బాధ ఇతరుల పట్ల కన్సర్న్ క్రమంగా క్షీణిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తారు.

రాజరికాలు పోయినా ప్రజాస్వామ్య ముసుగులో రాజ్యపాలన కొనసాగుతూనే ఉన్నది. రాజ్యానికి చేరువ కావడం కోసం, అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి ఎంతటి నీచానికైనా దిగజారుతున్నారు. ఉద్యోగులు, పై అధికారులను కాకా పట్టడానికి కాళ్లు మొక్కడం మామూలై పోతున్న సందర్భంలో- ఐఏఎస్ అధికారులు కూడా రాజకీయ నాయకులకు పాదాభివందనం చేయడం వారి విధేయతకు, లొంగుబాటుతనానికి చిహ్నం కాదా? ఇది న్యాయవ్యవస్థలోకి కూడా ప్రవేశించిందంటే ఆశ్చర్యమే. ఉద్యోగుల్లో ఉండే బానిస మనస్తత్వానికి న్యాయాధికారులు కూడా మినహాయింపు కాకపోవడం విచారకరం. అధికారులు, ఉద్యోగుల్లో పెరిగిపోతున్న అధికారలాలస, పదవీ వ్యామోహాన్ని ఇందులో చాలా కథలు చిత్రీకరించాయి. పదవీ విరమణ చేసిన తర్వాత కలిగే భ్రమలు- చిత్తభ్రాంతులను ఇంకో కథలో వివరించిన విధానం బాగుంది. తమ బాధలను తమ కష్టాలని చెప్పుకోలేని వ్యక్తులను అర్థం చేసుకున్నవాడే మంచి నాయకుడు అవుతాడు. అట్లాగే మంచి న్యాయమూర్తి అవుతాడని నిర్ధారిస్తున్నారు.



రాజరికాలు పోయినా ప్రజాస్వామ్య ముసుగులో రాజ్యపాలన కొనసాగుతూనే ఉన్నది. రాజ్యానికి చేరువ కావడం కోసం, అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి ఎంతటి నీచానికైనా దిగజారుతున్నారు. ఉద్యోగులు ,పై అధికారులను కాకా పట్టడానికి కాళ్లు మొక్కడం మామూలై పోతున్న సందర్భంలో- ఐఏఎస్ అధికారులు కూడా రాజకీయ నాయకులకు పాదాభివందనం చేయడం వారి విధేయతకు, లొంగుబాటుతనానికి చిహ్నం కాదా? ఇది న్యాయవ్యవస్థలోకి కూడా ప్రవేశించిందంటే ఆశ్చర్యమే.

ఎవరైతే మన పాలనని విమర్శిస్తున్నారో, అందులో ముఖ్యులను ఎంపిక చేసి, బుల్డోజర్లతో వాళ్ల ఇండ్లను కూల్చివేస్తే మిగతావాళ్లంతా చచ్చినట్టు పడి ఉంటారని పాలకవర్గాలు అనుకోవడంలో ఆశ్చర్యమేమున్నది. రాజ్య వ్యవస్థను సవాలు చేసే పరిస్థితుల్లో న్యాయస్థానాలు ఉండడాన్ని సహించలేని ప్రభుత్వాలు ప్రజాకోర్టుల్లో న్యాయమూర్తి ఎంపిక జరగడాన్ని నిలిపివేస్తూ, న్యాయాధికారుల బదిలీల్లో జాప్యం చేస్తూ, న్యాయస్థానాల పనితీరును నియంత్రిస్తూ, ప్రజాస్వామ్య ప్రమాణాలకే అడ్డుకట్ట వేస్తున్న తీరును వివరించిన తీరు ప్రశంసనీయం. ధనవంతులకు, రాజకీయ నాయకులకు అర్ధరాత్రి పూట లేదా సెలవు రోజుల్లో కూడా బెయిల్ సులభంగా దొరుకుతుంది. సామాన్యులకు అది అసంభవం మరి. న్యాయం కూడా ఉన్నవాడికి ఒకలా, లేని వాడికి మరొకలా వ్యవహరించడం కనిపిస్తూనే ఉంది. డబ్బులతో ఓట్లను కొనడం తప్పని తెలిసినా ఎవరు ఏం చేయలేని పరిస్థితి. చివరకు ఎలక్షన్ కమిషన్ కూడా నిస్సహాయంగా ఉండిపోతుంది.

రూల్ ఆఫ్ లా అంటే చట్టం ముందు అంత సమానమే. కానీ ఇది ఉన్నవాళ్లకు ఒకరకంగా, లేని వాళ్లకు ఇంకో రకంగా అమలుపరుస్తుంటారు. ప్రభుత్వ వ్యవస్థలో తమ స్వార్థం, ప్రయోజనాల కోసం రూల్ ఆఫ్ లా ను ఎలా వాడుకుంటారో ఒక కథలో తెలియ జేశారు. జైల్లో ఉన్న కేసులకే అతీ గతి లేదు. మాసాల కొద్ది తీర్పుల కోసం ఎన్నో కేసులు పెండింగ్ లో ఉన్నాయి. ఇక కొత్తగా కేసు వేస్తే ఎవరు పట్టించుకుంటారు. ఏండ్లు పూండ్లు గడిచిపోయినా న్యాయం దొరకదు. దొంగలు -పోలీసుల మిలాఖత్ గురించి అనేక కథనాలు వ్యాప్తిలో ఉండడం మనకు తెలిసిన విషయమే. కేసు నిలవదని తెలిసినా ఫైలు కింది నుండి పైకి తిరిగి, ముద్దాయిలకు నిద్ర పట్టకుండా చేస్తుంది. న్యాయం జరపడం కోసం కాదు. మనుషులను వంచడం కోసమే కేసులు పెడతారు. కాలానుగుణంగా నేరాలు- చట్టాలు మారిపోతుంటాయని ఇంకో కథలో తెలియ జేస్తారు. హాస్య వ్యంగ్య ధోరణిలో చిత్రీకరిం పబడిన ఈ కథలన్నీ పాఠకుల్ని ఆలోచింప జేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

- కె.పి అశోక్ కుమార్

సాహితీ వార్తలు

పీచర సునీతారావు 2024 సాహిత్య పురస్కారాలకు ఆహ్వానం

పీచరసునీతారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవిత్వం, కథలు, విమర్శ అనే మూడు సాహిత్య విభాగాల నుంచి సంపుటులను ఆహ్వానిస్తున్నది. మార్చి 2021 నుంచి మార్చి 2024 వరకు వెలువడిన రచనలు మాత్రమే పంపించాలి. ఎంపికైన ప్రతి సంపుటికి రూ.15000/- ల బహుమతి ఉంటుంది. ప్రతి విభాగంలో మూడు కాపీలు పంపించాలి. ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి 10, 2025లోగా పీచర సునీతారావు ఫౌండేషన్, కేర్ ఆఫ్ విజయేందర్ రావు, ప్లాట్ నం. 505, బ్లాక్ - డి, భీమా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్, సుచిత్ర సర్కిల్ దగ్గర, జీడిమెట్ల, హైదరాబాద్- 67, తెలంగాణ చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9866043441, 9848698699 నందు సంప్రదించవచ్చు.

సినారె పురస్కారం 2022కు కవితా సంపుటుల ఆహ్వానం

సాహితీగౌతమి ఆధ్వర్యంలో సినారె కవితా పురస్కారం 2022కు గాను ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచన కవితా సంపుటులను ఆహ్వానిస్తున్నారు. 2019, 20, 21 లలో ముద్రితమైన కవితా సంపుటులను 4 కాపీల చొప్పున పంపాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31లోగా కన్వీనర్, డా॥ఎడవల్లి విజయేంద్రరెడ్డి, శివానంద ఆస్పత్రి, ఇం.నం.3-3-181, సవరన్ స్ట్రీట్, కరీంనగర్ -505001 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9490401861, 9395553393 నంబర్‌లలో సంప్రదించవచ్చు.

'కొలకలూరి' పురస్కారాలు - 2025

2025 ఏడాదికిగానూ కవిత్వం, నాటకం, పరిశోధనా గ్రంథాలపై పురస్కారాలను ఇవ్వనున్నారు. వీటిని కొలకలూరి భాగీరథీ కవిత్వం పురస్కారం, కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం, కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారాలుగా ఒక్కొక్క విభాగానికి రూ.15,000/- చొప్పున బహుమతి అందించనున్నారు. ఈ మూడు విభాగాల్లో జనవరి 1, 2023 తర్వాత ముద్రితమైన వాటినే జనవరి 15 2025లోగా పంపించాలి. ఎంపికైన వారి వివరాలను ఫిబ్రవరి 15న ప్రకటిస్తారు. వారికి ఫిబ్రవరి 26న హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీలో నిర్వహించే సభలో పురస్కారాలు ప్రదానం చేస్తారు.

చిరునామాలు

కవిత్వం, నాటకం విభాగాలు :
ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (పూర్వ ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం), తెలుగు శాఖాధ్యక్షులు, పరీక్షా విభాగం డీన్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి, ఆంధ్రప్రదేశ్ - 517502.; సెల్ : 9441923172

పరిశోధనా గ్రంథాలు :
ఆచార్య కొలకలూరి సుమకిరణ్, ఆంగ్లాచార్యులు, అధ్యక్షులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, ఆంధ్రప్రదేశ్ - 517502 .; సెల్ : 9963564664

27న 'నాగస్వరం' ఆవిష్కరణ

కోయి కోటేశ్వరరావు కవితా సంపుటి 'నాగస్వరం' ఆవిష్కరణ సభ సాహితీ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 27న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బుక్ ఫెయిర్‌లో తోపుడు బండి సాధిక్ అలీ వేదికపై నిర్వహించనున్నారు. యం.యం. వినోదిని సభాధ్యక్షతన ముఖ్య అతిథిగా శిఖామణి హాజరై పుస్తకావిష్కరణ చేయనున్నారు. ఆత్మీయ అతిథులుగా యాకూబ్, నక్కా విజయరామరాజు, సంగిశెట్టి శ్రీనివాస్, పసునూరి రవీందర్, జె.నీరజ హాజరు కానున్నారు.

బిజినెస్

2024లో రికార్డ్ ఐపీఓలు

- రూ.1.6 లక్షల కోట్ల నిధుల సమీకరణ
- ఈ వారంలో మరో మూడు ఇష్యూలు



ముంబయి : ప్రస్తుత ఏడాది 2024లో రికార్డ్ స్థాయిలో ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపిఒ)లు నమోదయ్యాయి. నిధుల సమీకరణలో నూతన మైలురాయిని తాకాయి. అనుకూలమైన మార్కెట్ పరిస్థితుల వల్ల రూ.1.6 లక్షల కోట్ల నిధులు సమీకరించాయి. హ్యుందాయ్ మోటార్ ఇండియా దేశ మార్కెట్ల చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో రూ.27,870 కోట్ల ఐపిఒతో రికార్డ్‌ను నమోదు చేసింది. 2023తో పోల్చితే 2024లో ఐపిఒకు వచ్చిన కంపెనీల సగటు నిధుల సమీకరణ రెట్టింపై రూ.1,700 కోట్లకు చేరింది. గతేడాది ఇష్యూల సగటు మొత్తం రూ.867 కోట్లుగా ఉంది. ప్రస్తుత ఒక్క డిసెంబర్‌లోనే 15 కంపెనీలు ఐపిఒకు వచ్చాయి.

స్టాక్ ఎక్స్ఛేంజీల సమాచారం ప్రకారం.. 2024లో 90 తొలి పబ్లిక్ ఇష్యూలు వచ్చాయి. మొత్తంగా రూ. 1.6 లక్షల కోట్లు సమీకరించబడ్డాయి. అదనంగా వొడాఫోన్ ఐడియా ఫాలోఆన్‌ఆఫర్ రూ.18,000 కోట్లు సమీకరించింది. డిసెంబర్ 23-24 తేదీల్లో ముగియనున్న ఎనిమిది ఐపిఒలు కూడా ఇందులో ఉన్నాయి. 2023లో 57 కంపెనీలు ఐపిఒకు వచ్చి రూ.49,436 కోట్ల నిధులు సమీకరించాయి. 2021లో 63 కంపెనీలు రూ. 1.2 లక్షల కోట్లను సమీకరించాయి. "పెరుగుతున్న రిటైల్ భాగస్వామ్యం, బలమైన దేశీయ ఇన్‌ఫ్లోలు, ఎఫ్‌పిఐల క్రియాశీల భాగస్వామ్యం, ప్రయివేటు పెట్టుబడులు పెరుగుదల, మౌలిక సదుపాయాలు, కీలక రంగాలపై ప్రభుత్వ కీలక దృష్టి సమిష్టిగా నిధుల సేకరణకు మద్దతును అందించాయి." అని ఆనంద్ రాఠీ అడ్వైసర్స్ డైరెక్టర్ వి ప్రశాంత్ రావు పేర్కొన్నారు.

ఈ ఏడాది అత్యధికంగా నిధులు సమీకరించిన సంస్థల్లో రూ.27,870 కోట్లతో హ్యుందాయ్ అగ్రస్థానంలో ఉండగా.. స్విగ్గీ రూ.11,327 కోట్లు, ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ రూ.10,000 కోట్లు, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స రూ.6,560 కోట్లు, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ రూ.6,145 కోట్ల చొప్పున నిధులు సమీకరించి.. టాప్‌లో నిలిచాయి. డిసెంబర్ 23 నుంచి ప్రారంభమయ్యే వారంలో మూడు కంపెనీలు ఐపిఒకు రానున్నాయి. ఇందులో బెంగళూరు కంపెనీ యునిమెక్ ఎరోస్పేస్ రూ.500 కోట్ల ఐపిఒకు ప్రకటన చేసింది. ఈ ఇష్యూ డిసెంబర్ 26వరకు తెరిచి ఉంటుంది. ఎస్ఎంఇ సెగ్మెంట్‌లో సోలార్91 క్లీన్‌టెక్, అన్యాపాలిటెక్ కంపెనీలు డిసెంబర్ 24, డిసెంబర్ 26న ఇష్యూకు తెరుచుకోనున్నాయి. "కొత్త సంవత్సరంలో నిధుల సేకరణ ఊపందుకోవడం మరింత వేగవంతం అవుతుందని, 2024 రికార్డు గణాంకాలను అధిగమించే అవకాశం ఉంది. 2025లో రూ.2.5 లక్షల కోట్ల ఇష్యూలు చోటు చేసుకోవచ్చని అంచనా. ఇప్పటికే 75 ఐపిఒ పత్రాలు ఆమోదం పొంది ఉన్నాయని అంచనా." అని ఈక్విరస్‌లోని ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మునీష్ అగర్వాల్ పేర్కొన్నారు.

టాప్ 10 కంపెనీల విలువ భారీ పతనం

- రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబయి : గత వారం స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవి చూడగా.. టాప్ 10 కంపెనీల సంపద లక్షల కోట్లు ఆవిరయ్యింది. బిఎస్ఇలోని అగ్రశ్రేణీ 10 కార్పొరేట్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.4,95,061 కోట్లు హరించుకుపోయింది. బిఎస్ఇ సెన్సెక్స్ 4,092 పాయింట్లు లేదా 4.98 శాతం పతనమయ్యింది. 2022 జూన్ తర్వాత ఒక్క వారంలో జరిగిన అతిపెద్ద నష్టం ఇదే. వచ్చే ఏడాది యుఎస్‌ఫెడ్ నాలుగు సార్లు వడ్డీ రేట్లు తగ్గించొచ్చనే అంచనాలకు చెక్ పెడుతూ.. ఆ రెగ్యూలేటరీ సంస్థ కేవలం రెండు సార్లకే అవకాశం ఉందని ప్రకటించింది. దీంతో మదుపర్లు స్టాక్ మార్కెట్లపై విశ్వాసాన్ని కోల్పోయారు. ఎఫ్‌ఐఐలు భారీగా తరలిపోయాయి. దేశీయంగా భారత జిడిపి బలహీనంగా చోటు చేసుకోవడం మార్కెట్లలో ఒత్తిడిని పెంచింది. ఈ పరిణామాల మధ్య గడిచిన వారంలో దేశంలోనే అతిపెద్ద టెక్ కంపెనీ టిసిఎస్ మార్కెట్ కాపిటలైజేషన్ ఏకంగా రూ.1.10 లక్షల కోట్లు తుడుచుకుపెట్టుకుపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ.91,140 కోట్ల పతనాన్ని చవి చూసింది. ఆ తర్వాత హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎం క్యాప్ రూ.76,448 కోట్లు కోల్పోయింది. భారతీ ఎయిర్‌టెల్ రూ.59,055 కోట్లు, ఎస్‌బిఐ రూ.43,909 కోట్లు, ఐసిఐసిఐ బ్యాంక్ రూ.41,857 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.32,300 కోట్లు చొప్పున మార్కెట్ విలువను నష్టపోయాయి. తర్వాత స్థానల్లో ఎల్‌ఐసి, హెచ్‌యుఎల్, ఐటిసి కంపెనీలు అధిక విలువ కోల్పోయిన వాటిలో ఉన్నాయి. వచ్చే వారం కూడా మార్కెట్లలో ఒడిదుడుకులు ఉండొచ్చని.. రిటైల్ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

భారత వృద్ధి 6.5 శాతంగా ఉండొచ్చు

- కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అంచనా

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ అంచనా వేసింది. వచ్చే 2025-26లో 6.7 శాతంగా నమోదు కావొచ్చని పేర్కొంది. ప్రపంచ అనిశ్చితి ఉన్నప్పటికీ భారత్‌లో సుస్థిర వృద్ధి కొనసాగనుందని తన 2025కి సంబంధించి సెక్టార్ ఔట్‌లుక్-2025లో విశ్లేషించింది. "అంతర్జాతీయ అనిశ్చిత వాతావరణం మధ్య ప్రయివేటు మూలధన వ్యయంలో ఊహించిన స్థాయిలో కార్యరూపం దాల్చనందున దీర్ఘకాలిక పెట్టుబడుల్లో సంకోచం ఉంటుంది. అయినప్పటికీ ద్రవ్య విధాన సడలింపు మద్దతుతో 2025లో ప్రైవేట్ పెట్టుబడిలో మెరుగుదలని ఉండొచ్చు." అని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సచిన్ గుప్తా పేర్కొన్నారు.

జెట్‌వర్క్‌కు రూ.760 కోట్ల నిధులు

- రూ.2633 కోట్లకు చేరిన విలువ

న్యూఢిల్లీ: జెట్‌వర్క్ మానుఫాక్చరింగ్ బిజినెస్ ఇటీవల 90 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.760 కోట్లు) నిధులు సమీకరించినట్లు వెల్లడించింది. దీంతో కంపెనీ మొత్తం విలువ 3.1 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.2,633) కోట్లకు చేరిందని తెలిపింది. ఇటీవల సంస్థలకు నిధులు సమకూర్చిన వాటిలో రాకేష్ గంగ్‌వాల్, కోస్లా వెంచర్స్ సహా కొత్త ఇన్వెస్టర్లు బెయిలీ గిఫోర్డ్, అవెనిర్ గ్రోత్ తదితర సంస్థలున్నాయి. 2023-24లో సంస్థ స్థూల సరుకుల విలువ (జిఎంవి) రూ.17,564 కోట్లుగా ఉందని తెలిపింది. తమ సంస్థ పునరుత్పాదన ఇంధనం, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఎరోస్పేస్ రంగాల్లో విస్తరణ, పెట్టుబడులు పెట్టాలని యోచిస్తోందని తెలిపింది. 2024 సెప్టెంబర్ 30 నాటికి కంపెనీ ఆర్డర్లు రూ.12,839 కోట్లుగా నమోదయ్యాయని పేర్కొంది.

పెంపుడు జంతువులపై యువత మక్కువ

- మార్స్ పెట్‌కేర్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : దేశ యువతలో పెంపుడు జంతువులపై మక్కువ పెరుగుతోందని పెట్ కేర్, న్యూట్రిషన్ లో గ్లోబల్ లీడర్ అయిన మార్స్ పెట్ కేర్ తన గ్లోబల్ పెట్ పేరెంట్ సర్వే వెల్లడించింది. ఈ సర్వేలో 1000 మందిని భాగస్వాములను చేసినట్లు పేర్కొంది. పెంపుడు జంతువుల యజమానుల్లో ప్రతీ ముగ్గురులో ఇద్దరు తమ కుక్క లేదా పిల్లిని వారి జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయంగా చూస్తున్నారు. పెంపుడు జంతువుల దత్తతలో 67 శాతం కుక్క పిల్లలు, 70 శాతం పిల్లులకు కనీసం 3 నెలలు లేదా అంతకంటే తక్కువ వయస్సు వాటిని ఎంచుకుంటున్నారు. 6 శాతం కుక్కపిల్లలు, 4 శాతం పిల్లులనే షెల్టర్ల నుంచి దత్తత తీసుకుంటున్నారు. 17 శాతం కుక్కపిల్లలు, 10 శాతం పిల్లిపిల్లలు పెంపకందారుల ద్వారాను, 23 శాతం కుక్కపిల్లలు, 19శాతం పిల్లులను దుకాణాల్లో తీసుకుంటున్నారని మార్స్ పెట్‌కేర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ మూర్తి పేర్కొన్నారు. భారతీయ యువత రికార్డు సంఖ్యలో పెంపుడు జంతువులను దత్తత తీసుకోవడమే కాకుండా, ఈ సంబంధాలు తీసుకువచ్చే భావోద్వేగ, మానసిక ప్రయోజనాలకూ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

వాట్సాప్‌పై దాడులకు ఇజ్రాయిల్ కంపెనీయే కారణం

అమెరికా న్యాయస్థానం నిర్ధారణ

- పెగాసస్ స్పైవేర్‌ను విక్రయించింది ఆ సంస్థే





వాషింగ్టన్ : వాట్సాప్‌పై దాడులకు పాల్పడింది పెగాసస్ స్పైవేర్‌ను విక్రయించిన ఇజ్రాయిల్ ఎన్ఎస్ఓ గ్రూపేనని అమెరికా జిల్లా కోర్టు నిర్ధారించింది. 2019లో వాట్సాప్ యాప్ వేసిన దావాను పురస్కరించుకొని న్యాయస్థానం ఈ మేరకు తీర్పు చెప్పింది. యాప్‌కు చెందిన 1,400 పరికరాలలో (డివైస్‌లు) ఉల్లంఘనలు జరిగాయని వాట్సాప్ ఫిర్యాదు చేసింది. అమెరికా కంప్యూటర్ ఫ్రాడ్ అండ్ అబ్యూస్ యాక్ట్ (సీఎఫ్ఏఏ)ను, వాట్సాప్‌నకు చెందిన సొంత సర్వీసు నిబంధనలను ఎన్ఎస్ఓ ఉల్లంఘించిందని న్యాయమూర్తి ఫిలిస్ హామిల్టన్ తేల్చారు.

న్యాయమూర్తి ఏమన్నారు?

'తన క్లయింట్లు వాట్సాప్ అప్లికేషన్ ఆధునిక వెర్షన్‌ను ఉపయోగించుకునేందుకు ఎన్ఎస్ఓకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు (పెగాసస్) అనుమతించాయి. ఈ ఆధునిక వెర్షన్‌ను వాట్సాప్ ఇన్‌స్టాలేషన్ సర్వర్ లేదా డబ్ల్యుఐఎస్ అని పిలుస్తారు. ఎన్ఎస్ఓ క్లయింట్లు సిఫర్ ఫైల్స్‌ను పంపేందుకు ఈ సర్వర్ ఉపకరిస్తుంది. సిఫర్ ఫైల్స్ సాయంతో క్లయింట్లు తాము ఎంచుకున్న వినియోగదారులపై నిఘా పెట్టవచ్చు. ఇది సీఎఫ్ఏఏను, కాంట్రాక్ట్‌ను ఎన్ఎస్ఓ ఉల్లంఘించడమే అవుతుందని వాట్సాప్ ఫిర్యాదు చేసింది' అని న్యాయమూర్తి వివరించారు. కోర్టు ఆదేశాలను పాటించడంలో ఎన్ఎస్ఓ విఫలమైందని కూడా ఆయన తెలిపారు. పెగాసస్ సోర్స్ కోడ్ కేవలం ఇజ్రాయిల్‌లో నివసిస్తున్న ఆ దేశ పౌరులకు మాత్రమే అందుబాటులో ఉంటుందంటూ ఎన్ఎస్ఓ చేసిన వాదన ఆచరణ సాధ్యం కాదని న్యాయస్థానం అభిప్రాయపడింది.

గోప్యతకు లభించిన భారీ విజయం : వాట్సాప్

కోర్టు తీర్పుపై వాట్సాప్ అధినేత విల్ కాథ్‌కార్ట్ హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పు గోప్యతకు లభించిన భారీ విజయమని ఆయన అభివర్ణించారు. 'మా వాదనలు వినిపించేందుకు ఐదు సంవత్సరాల సమయం తీసుకున్నాము. ఎందుకంటే స్పైవేర్ కంపెనీలు తమ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నుంచి ఎలాంటి రక్షణ పొందలేరు. వాటికి జవాబుదారీతనం ఉండదు. అక్రమ గూఢచర్యాన్ని సహించరాదన్న వాస్తవాన్ని నిఘా కంపెనీలు గుర్తుంచుకోవాలి. ప్రజల ప్రైవేటు సంభాషణలకు రక్షణ కల్పించే విషయంలో వాట్సాప్ ఎప్పుడూ వెనకడుగు వేయదు' అని ఆయన తెలిపారు. కాగా ఈ వ్యవహారంలో జరిగిన నష్టానికి సంబంధించిన కేసు విచారణ వచ్చే సంవత్సరం ప్రారంభమవుతుందని న్యాయమూర్తి చెప్పారు.

పెగాసస్‌పై దేశంలో దుమారం

మన దేశంలో పెగాసస్ వినియోగంపై 'ది వైర్' పోర్టల్ సహా పలు అంతర్జాతీయ వార్తా సంస్థలు కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఎన్ఎస్ఓ గ్రూప్ తన స్పైవేర్‌ను కొన్ని ప్రభుత్వాలకు మాత్రమే అందజేసిందని వార్తా సంస్థల అంతర్జాతీయ కన్సార్టియం తెలిపింది. దేశ భద్రతకు సంబంధించిన కేసులు, నేరాలపై పరిశోధనలు జరుపుతున్న క్లయింట్లు మాత్రమే పెగాసస్‌ను ఉపయోగిస్తున్నారని, కాబట్టి తమను బాధ్యులను చేయరాదని ఎన్ఎస్ఓ కంపెనీ అమెరికా కోర్టులో విచారణ సందర్భంగా వాదించింది. అయితే ఈ వాదనను జడ్జి తోసిపుచ్చారు.

2021లో మీడియా సంస్థలు పరిశోధనలు జరిపినప్పుడు తన వినియోగదారుల జాబితాను బయటపెట్టేందుకు ఎన్ఎస్ఓ నిరాకరించింది. అయితే పెగాసస్ స్పైవేర్ సాయంతో ప్రతిపక్ష నేతలు, పాత్రికేయులు, న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్న విషయం విదితమే. మీడియా సంస్థలు బయటపెట్టిన అంశాలపై విచారణ జరపాలని 2021లో సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై ఏర్పడిన సాంకేతిక కమిటీ ఐదు ఫోన్లలో మాల్‌వేర్‌ను గుర్తించింది. అయితే అది పెగాసస్ అవునా కాదా అనేది చెప్పలేదు. పెగాసస్ స్పైవేర్‌ను కొనుగోలు చేసి దానిని వినియోగించానా లేదా అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ధృవీకరించలేదు. అలాగే తోసిపుచ్చనూ లేదు.

శాంతికి, ప్రేమకు ప్రతిరూపం ప్రఖ్యాత మెదక్ చర్చి

రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ వర్మ

మెదక్ చర్చి వజ్రోత్సవ వేడుకలు



నవతెలంగాణ-మెదక్

శాంతికి ప్రేమకు మారుపేరుగా మెదక్ చర్చి నిలిచిపోయిందని రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ వర్మ తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి నిర్మించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చర్చి నిర్వాహకులు, పాస్టర్లు ఆదివారం ఏర్పాటు చేసిన వజ్రోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. మొదట రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవవర్మకు ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుతో పాటు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయకుమార్ రెడ్డి మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొని తన సందేశాన్ని అందించారు. మెదక్ కాథెడ్రల్ పునాదిని 20వ శతాబ్దం ప్రారంభంలో మహా కష్టకాలంలో, కరువు వేధించిన సమయంలో నిర్మించారన్నారు. రేవరెండ్ చార్లెస్ వాకర్ తమ అపారమైన విశ్వాసంతో.. భవిష్యత్తు తరాల కోసం శక్తి సౌధంగా నిలిచే చర్చిని నిర్మించడం మెదక్ జిల్లా ప్రజల అదృష్టమని తెలిపారు. గోతిక్ రివైవల్ శైలిలో నిర్మించబడిన ఈ కాథెడ్రల్, ఆసియా ఖండంలోని అతిపెద్ద చర్చిల్లో ఒకటిగా నిలుస్తోందన్నారు. 5,000 మందికి పైగా కూర్చునే సామర్థ్యం గల చర్చి, దాని అద్భుతమైన మినార్‌లు, అందమైన స్టెయిన్డ్ గ్లాస్ విండోలు, స్ఫూర్తిదాయకమైన రూపకల్పనతో, కేవలం శిల్పకళ ఆకట్టుకునేలా తీర్చిదిద్దారని తెలిపారు. మెదక్ కాథెడ్రల్ కేవలం ఒక నిర్మాణం కాదని, ఇది క్రీస్తు బోధనలకు జీవమిచ్చే ప్రతీక అని అన్నారు. గత శతాబ్దంగా ఈ చర్చి అనేక మందికి విద్య, వైద్యం అందించిందని, లోకానికి ఆధ్యాత్మిక మార్గ నిర్దేశనం అందించిందని చెప్పారు. "నేను మిమ్మల్ని ప్రేమించినట్టే, మీరు ఒకరిని మరొకరు ప్రేమించండి" అనే క్రీస్తు బోధనకు ఈ కాథెడ్రల్ ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ శతాబ్ది ఉత్సవం, మరొక శతాబ్దపు సేవ, విశ్వాసం, పరివర్తనకర ప్రభావానికి నాంది కావాలని కోరుకుంటున్నానని తెలిపారు. అందరి జీవితాల్లో శాంతి, అభివృద్ధి, విజయాలు ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి దానకిషోర్, అదనపు కలెక్టర్ నగేష్, ప్రెస్ బ్రీటర్ ఇన్‌చార్జి శాంతయ్య, చర్చి కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మానికొండ చలపతి రావు నేటి తరాలకు ఆదర్శప్రాయ జర్నలిస్ట్

నవతెలంగాణ-కల్చరర్

నేడు జర్నలిజంలో సామాజిక బాధ్యత విలువలు తగ్గుతున్న నేపథ్యంలో మానికొండ చలపతి రావు నేటితరాలకు ఆదర్శ ప్రాయులని మేఘాలయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కొట్టు శేఖర్ అన్నారు. ఆయన జీవిత విశేషాలు సంపుటి అమరయ్య సహా రచయితల వ్యాసాలతో వెలుగులోకి తెచ్చారని అభినందించారు. హైదరాబాద్ యూసఫ్‌గూడలోని మహ్మద్ ఫంక్షన్ హాల్‌లో మిర్యాల వెంకట రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్ట్ అమరయ్య సంపాదకత్వం వహించిన "భారతీయ జర్నలిజం ధ్రువ తార మానికొండ చలపతి రావు" వ్యాస సంపుటిని ఆచార్య శేఖర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మరుగుపడిపోతున్న నిష్కల జర్నలిస్ట్ చలపతిరావు జీవితాన్ని అక్షరీకరించే ప్రయత్నంలో సహా రచయితల వ్యాసాలను చేర్చి చలపతిరావు జీవితాన్ని సమగ్రంగా అమరయ్య ఆవిష్కరించారని అన్నారు. జర్నలిస్టు అమరయ్య మాట్లాడుతూ.. నాటి తరంలో జర్నలిస్టులు నైతిక విలువలు నిబద్ధతతో విధి నిర్వహణ పాటించే వారిలో చలపతి రావు అగ్రగణ్యులని వివరించారు. ఆయన కేంద్ర ప్రభుత్వ పద్మ భూషణ్ అవార్డును తిరస్కరించిన సందర్భాన్ని గుర్తు చేశారు. సహా రచయితలు చందు జనార్ధన్, రామ మోహన్ నాయుడు, సమ్మెట నాగ మల్లేశ్వర రావు, తదితరులు మాట్లాడుతూ.. సంపుటిలోని ముప్పై వ్యాసాలు చలపతి రావు ఉన్నత వ్యక్తిత్వ అవగాహనకు దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సామాజిక న్యాయ విశ్లేషకులు కటారి అప్పారావు, ఆరవ రామకృష్ణ, తోట గోపాలకృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, రామ మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌ను వైద్య సేవల హబ్‌గా తీర్చిదిద్దాలి

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

- పీహెచ్‌సీ, ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ యూనిట్లకు ప్రారంభోత్సవాలు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష



నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ నిజామాబాద్ జిల్లాను వైద్య సేవల హబ్‌గా తీర్చిదిద్దాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యాధికారులకు సూచించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రూ.38.75 కోట్ల వ్యయంతో నూతనం గా నిర్మించిన ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ యూనిట్లను మంత్రి ప్రారంభించారు. అందుబాటులోకి వచ్చిన నూతన వైద్య సేవలను పరిశీలించి, వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిజామాబాద్‌లోని జిల్లా జనరల్ ఆస్పత్రిని సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. రోగులను పలకరించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అంతకుముందు రూ.కోటి 56 లక్షల వ్యయంతో రెంజల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో వైద్య సేవల స్థితిగతులపై వివిధ విభాగాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో విభాగం వారీగా జీజీహెచ్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఇంకా అవసరమైన సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది ఖాళీలు, వైద్య పరికరాల ఆవశ్యకత గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ మంత్రి దృష్టికి తెచ్చారు. సదుపాయాలను మెరుగుపరుస్తూ, ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సమీక్షలో పాల్గొన్న జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, రాకేష్‌రెడ్డి తదితరులు కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు.

మంత్రిదామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. వైద్య సేవల విషయంలో నిజామాబాద్ జిల్లాకు ఇదివరకు ఎంతో మంచి పేరు ఉండేదని, ప్రస్తుతం కూడా వైద్యులు, సిబ్బంది అందరూ అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ పూర్వ ప్రతిష్టను పునరుద్ధరింపజేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్యులు విధులకు ఎగనామం పెట్టి ప్రయివేటు క్లినిక్‌లు, ప్రయివేటు ప్రాక్టీస్‌లకు పరిమితమైతే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహణపరమైన లోపాలను సరిదిద్దుకుని, వచ్చే ఉగాది నాటికి వంద రోజుల్లోపు పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించేలా అంకితభావంతో పని చేయాలని సూచించారు.

సబ్ సెంటర్ మొదలుకుని జిల్లా ఆస్పత్రులు, జీజీహెచ్ హాస్పిటల్‌కు అవసరమైన అన్ని సదుపాయాలు తక్షణమే సమకూరుస్తామని, వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేసి అధునాతన వైద్య పరికరాలను మంజూరు చేస్తామని అన్నారు. నిజామాబాద్ జిల్లాకు వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్, ట్రామా కేర్ యూనిట్, క్యాన్సర్ చికిత్స కేంద్రాన్ని వచ్చే మూడు, నాలుగు నెలల వ్యవధిలోనే మంజూరు చేసేందుకు చొరవ చూపుతానని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, డీఎంఈ డాక్టర్ వాణి, అదనపు కలెక్టర్ అంకిత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మెన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మెన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు చనిపోతే.. పౌర హక్కుల సంఘాల నిజ నిర్ధారణ ఎందుకు?

- మావోయిస్టుల చేతుల్లో బలైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆదివాసీల నిరసన



నవతెలంగాణ-ఏటూరు నాగారం ఐటీడీఏ

అమాయక ఆదివాసీలు మావోయిస్టుల చేతిలో బలైనప్పుడు లేని నిజనిర్ధారణ.. మావోయిస్టులు చనిపోయినప్పుడు పౌర హక్కుల సంఘాలు ఎందుకు నిజ నిర్ధారణ చేస్తున్నాయో తెలపాలని బాధిత ఆదివాసీ కుటుంబాలు డిమాండ్ చేశాయి. ఆదివారం ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ ఎదుట జాతీయ రహదారిపై సుమారు గంటపాటు బ్యానర్లు చేత పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వాజేడు మండలంలోని బాల లక్ష్మీపురం పెనుగోలు, వెంకటాపురం మండలంలోని వీఆర్‌పురం గ్రామాల నుంచి బాధిత కుటుంబాలు, వారి బంధువులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గత నవంబర్‌లో బాలలక్ష్మీపురం గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఓయిక రమేష్, అతని తమ్ముడు ఉయక అర్జున్‌ను మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో నరికి చంపిన విషయం తెలిసిందే. అనంతరం ఏటూరునాగారం మండలంలోని చల్పాక అడవుల్లో ఏడుగురు మావోయిస్టులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన సంఘటన తెలిసిందే. అప్పటినుంచి పౌరహక్కుల సంఘాల నేతలు ఎన్‌కౌంటర్ బూటకమని పలుమార్లు వెల్లడించారు. ఇదే క్రమంలో ఆదివారం పౌరహక్కుల సంఘాలు మండల కేంద్రానికి వస్తున్నాయనే సమాచారం మేరకు ఆయా గ్రామాల నుంచి ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జాతీయ రహదారిపై బైటాయించి పౌరహక్కుల సంఘాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఆదివాసీ గిరిజన బిడ్డలు చనిపోతే ఒక న్యాయం.. మావోయిస్టులు చనిపోతే మరొక న్యాయం అంటూ ఆదివాసీ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్ పురానికి చెందిన ఇల్లందుల ఏసు.. జూన్ నెలలో నల్లగుట్ట అడవుల్లో కట్టెలకు పోతున్న క్రమంలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర్లకు బలై చనిపోయాడని గుర్తు చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వం కూడా తమకు న్యాయం చేయలేదని అతని కోడలు రాధిక తెలిపింది. ఇదే బాంబు బ్లాస్ట్‌లో తాను కాలు కోల్పోయి విగతజీవిగా మారానని, తన ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారని, తనకు పోషణ కరువైందని సునీత తెలిపింది. ప్రభుత్వం ఇప్పటికీ బాధిత కుటుంబాలకు ఎలాంటి న్యాయం చేయలేదని వాపోయారు. మావోయిస్టుల చేతిలోని గొడ్డళ్లకు బలైన రమేష్ తల్లి శాంత, అర్జున్ భార్య సావిత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఇప్పటివరకు తమ కుటుంబాలకు న్యాయం చేయలేదని విలపించారు. తమ కుటుంబాలకు మావోయిస్టులు అన్యాయాన్ని తలపెట్టినప్పుడు ఈ పౌర హక్కుల సంఘాలు ఏం చేశాయంటూ నిలదీశారు. ముందు తమ కుటుంబాలకు న్యాయం చేసి, ఆ తర్వాత మృతి చెందిన మావోయిస్టుల కోసం పోరాడాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి తమ కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా రహదారి పొడవునా ఇరువైపులా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఆదివాసీలను శాంతింపజేశారు.

తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ దాడి

- బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ఊహించలేం : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి ఎన్నారై విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసి మహిళలను, పండుగలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమ తెలంగాణ తల్లి కోసం మరో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

పాఠశాలలో రేలింగ్‌పై స్కేటింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి విద్యార్థిని మృతి

జహీరాబాద్ మండలంలోని మైనార్టీ గురుకులంలో ఘటన




నవతెలంగాణ- జహీరాబాద్

రేలింగ్‌పై స్కేటింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి 9వ తరగతి విద్యార్థిని మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం బూచనేల్లి గ్రామ పరిధిలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో జరిగింది. చిరాక్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైనార్టీ గురుకుల పాఠశాలలో సాదియా(14) 9వ తరగతి చదువుతున్నది. శనివారం రాత్రి 9 గంటల సమయంలో మెట్లకు ఉన్న రేలింగ్‌పై సాదియా స్కేటింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడింది. తీవ్ర గాయాలు కావడంతో పాఠశాల సిబ్బంది హుటాహుటిన స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి.. వెంటనే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె.. పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా, సాదియా తండ్రి ఆసిఫ్.. కూరగాయల వ్యాపారం చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నాడు. మంచి విద్యను అందించాలని సాదియాను మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్‌లో చేర్పించినట్టు ఆసిఫ్ తెలిపారు. సాదియాతో పాటు ఆమె చెల్లి కూడా అదే పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. అధ్యాపకులు, అక్కడున్న సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమ చిన్నారి మృతి చెందిందని బోరున విలపిస్తున్నారు. రాత్రి 9 గంటలకు ఘటన జరిగితే పదిన్నర వరకు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని, 108 వాహనం వచ్చేవరకు అక్కడే ఉంచడంతోనే తమ కూతురు మృతి చెందిందని ఆరోపించారు. సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా విద్యార్థినుల పట్ల సరైన సంరక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

- గజ్వేల్ ఇంద్ర పార్క్ చౌరస్తా వద్ద ఘటన



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్త వల్ల నిండు ప్రాణం బలైన ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ పట్టణంలో ఆదివారం జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన చామంతి బుచ్చవ్వ(60) కొంతకాలంగా కీళ్ల నొప్పులతో బాధపడుతుండగా.. ఆస్పత్రిలో చూపించుకునేందుకు గజ్వేల్‌కు వచ్చింది. ఆస్పత్రిలో డాక్టర్లను సంప్రదించి తిరిగి తన గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు క్రాస్ చేస్తుంది. అదే సమయంలో అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు.. వృద్ధురాలిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మృతురాలి కాళ్లు నుజ్జునుజ్జయింది. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన గజ్వేల్ సీఐ బి. సైదా పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుచ్చవ్వ మతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కొడుకు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఢిల్లీ శకటానికి నో ఛాన్స్

- ఆమోదించని నిపుణుల కమిటీ


(ఫైల్)

న్యూఢిల్లీ : రిపబ్లిక్ డే-2025 వేడుకల్లో ప్రదర్శించటం కోసం ఢిల్లీ ప్రభుత్వం ప్రతిపాదించిన శకటాన్ని నిపుణుల కమిటీ ఆమోదించలేదు. దీంతో ఈ సారి రిపబ్లిక్ వేడుకల్లో ఢిల్లీ శకటం కనబడే అవకాశాలు లేవు. ఇక మిజోరాం, సిక్కింలు ఈ సారి వేడుకల్లో పాల్గొనలేమని చెప్పాయి. వచ్చే ఏడాది జనవరి 26న జరగనున్న గణతంత్ర వేడుకలకు రోస్టర్‌లో మొదట ఎంపిక చేసిన 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)ల నిపుణుల కమిటీ సమావేశానికి లక్షద్వీప్‌తో పాటు అండమాన్ నికోబార్ దీవుల అధికారులు రాలేదని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. 'నిపుణుల కమిటీ థీమ్, కాన్సెప్ట్, డిజైన్‌లు, విజువల్ ఎలిమెంట్స్‌లోని పలు అంశాలను పరిశీలిస్తుంది. రోస్టర్‌లోని 15 రాష్ట్రాలు, యూటీలలో, నిపుణుల కమిటీ ఢిల్లీ శకటం ప్రతిపాదనను ఆమోదించలేదు" అని వివరించాయి. అయితే, ఢిల్లీ ప్రభుత్వ ప్రతిపాదన వివరాలు, అది ఆమోదింపబడకపోవటానికి గల కారణాలు మాత్రం వెంటనే తెలియరాలేదు. కాగా, గత రెండు దశాబ్దాల్లో ఢిల్లీ ఏడు సార్లు తన శకటాన్ని ప్రదర్శించిందని సదరు వర్గాలు చెప్తున్నాయి. అయితే, శకటం ఎంపికలో వివక్ష చూపుతున్నారనే వాదనలూ ఇప్పటికే ఉన్నాయి. రిపబ్లిక్‌డే-2024 వేడుకలకు ముందు ఢిల్లీ, పంజాబ్, కర్నాటక రాష్ట్రాలు ఇవే ఆరోపణలు చేశాయి. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష కొనసాగుతున్నదనీ, గుజరాత్, యూపీ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలు మాత్రం వరుసగా ఎంపికవుతున్నాయనే వాదనలూ ఉన్నాయి. అయితే, గత రెండు దశాబ్దాల్లో ఈ రెండు రాష్ట్రాల కంటే అనేక రాష్ట్రాలు చాలాసార్లు ఎంపికయ్యాయనీ, ఇందులో జమ్మూకాశ్మీర్, కర్నాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, అసోం వంటి రాష్ట్రాలున్నాయని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి.

ఐరాస కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ లోకుర్

న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి ఇంటర్నల్ జస్టిస్ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకుర్ నియమితులయ్యారు. ఈ నియామకం వెంటనే అమలులోకి వచ్చింది. 2028 నవంబర్ 12వ తేదీ వరకూ జస్టిస్ లోకుర్ ఐరాస పదవిలో కొనసాగుతారు. న్యాయ వ్యవస్థలో లోకుర్ అనుభవాన్ని, నైపుణ్యాన్ని గుర్తించిన ఐరాస ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెరెస్ ఆయనను ఈ పదవిలో నియమించారు. ఐరాస కౌన్సిల్‌లో ప్రపంచ దేశాలకు చెందిన న్యాయ నిపుణులు సభ్యులుగా ఉంటారు. వీరిలో ఉరుగ్వేకు చెందిన కార్మెన్ అర్టిగస్, ఆస్ట్రేలియాకు చెందిన రోసాలీ బాల్కిన్, ఆస్ట్రియాకు చెందిన స్టీఫన్ బ్రెజీనా, అమెరికాకు చెందిన జే పోజెనెల్ వంటి న్యాయ కోవిదులు ఉన్నారు. 1953లో జన్మించిన లోకుర్ 2012 జూన్ 4వ తేదీ నుంచి 2018 డిసెంబర్ 30న పదవీవిరమణ చేసే వరకూ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందించారు. 2019లో ఫిజి సుప్రీంకోర్టు నాన్-రెసిడెంట్ ప్యానల్ జడ్జిగా నియమితులు కావడం గమనార్హం. విదేశానికి చెందిన అత్యున్నత న్యాయస్థానంలో పదవిని పొందిన తొలి భారతీయ న్యాయమూర్తి జస్టిస్ లోకుర్.ఐరాస న్యాయ వ్యవస్థ పాలనలో స్వతంత్రత, వృత్తి నిపుణత, జవాబుదారీతనం ఉండేలా చూడడంలో ఇంటర్నల్ జస్టిస్ కౌన్సిల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఐరాసలో నిష్పాక్షికత, జవాబుదారీతనం పెంపొందించేందుకు కౌన్సిల్ చేస్తున్న ప్రయత్నాలను చైర్‌పర్సన్‌గా జస్టిస్ లోకుర్ పర్యవేక్షిస్తారు.

హోం పాయే..!

- శిండే శివసేనకు నిరాశ
- ఆశించిన పోర్ట్‌ఫోలియో దక్కని వైనం
- 'మహా' సీఎం ఫడ్నవీస్ వద్దే ఆ శాఖ


(ఫైల్)

ముంబయి : మహారాష్ట్రలో అధికార కూటమి మహాయుతిలో భాగస్వామిగా ఉన్న శిండే శివసేనకు నిరాశే ఎదురైంది . కీలకమైన హోం శాఖ కోసం ఎంతో గట్టిగా పట్టుబట్టిన ఆ పార్టీ చీఫ్ ఏక్‌నాథ్ శిండేకు అది దక్కలేదు. సీఎం ఎంపిక నుంచి అసంతృప్తిగా ఉన్న ఆయనకు కోరుకున్న శాఖ కూడా దక్కకపోవటంతో ఆ పార్టీ వర్గాలు నిరాశను వ్యక్తం చేస్తున్నాయి. శిండే కోరిన హోం పోర్ట్‌ఫోలియోతో పాటు విద్యుత్, న్యాయ శాఖలను రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తన వద్దే ఉంచుకున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ఏక్‌నాథ్ శిండేకు పట్టణాభివృద్ధి, హౌజింగ్ అండ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ శాఖలను సీఎం కేటాయించారు. మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు వారాలకు పైగా గడిచింది. అయితే, శనివారం రాత్రి మంత్రులకు శాఖల కేటాయింపులు జరిగాయి. మరొక డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్.. కీలకమైన ఆర్థిక, ప్లానింగ్ పోర్ట్‌ఫోలియోలను తిరిగి పొందారు. సీఎం ఎంపిక విషయంలోనూ ఏక్‌నాథ్ షిండే అంసతృప్తిగానే ఉన్నారు. కీలకమైన హోం శాఖ దక్కుతుందనుకున్నప్పటికీ.. అది ఆయనకు రాలేదు. ఇటీవలే శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్.. ఫడ్నవీస్‌ను కలిశారు. ఆయన తిరిగి బీజేపీ దగ్గరవుతున్నారన్న వార్తలూ వెలువడ్డాయి. దీంతో కూటమిలో తనకు తగిన గౌరవం దక్కటంలేదని శిండే అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తున్నది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలుగా ఫడ్నవీస్, ఏక్‌నాథ్ శిండే, అజిత్ పవార్‌లు ఈనెల 5న ప్రమాణస్వీకారం చేయగా.. 15న మంత్రివర్గ విస్తరణ జరిగిన విషయం విదితమే.

అల్లు అర్జున్‌పై సీఎం తీరు సరిగాదు

- సినీపరిశ్రమపై కక్షసాధింపు చర్యల్లో రేవంత్‌రెడ్డి
- హైకోర్టు బెయిల్ ఇచ్చినా జైల్లో ఉంచడం దారుణం : కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాతీయ అవార్డు గ్రహీత, పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు ఆయన స్థాయికి ఏ మాత్రం సరిగాదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా అల్లు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా, తెలుగు సినీ పరిశ్రమను దెబ్బతీసేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని అభ్యంతరం తెలిపారు. చట్టం చేతుల్లో ఉందని ఇష్టమొచ్చినట్టుగా వినియోగించాలని చూస్తే కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే రేవంత్ రెడ్డి సర్కార్‌కూ పడుతుందని హెచ్చరించారు. ప్రజా సమస్యలను దారి మళ్లించేందుకు కావాలనే సీఎం దీన్ని రాజకీయం చేస్తుండటం దారుణమని పేర్కొన్నారు. రాజకీయ విలువలు లేని ఎంఐఎం వాళ్లతో శాసనసభలో ప్రశ్న అడిగించుకుని మరీ సమాధానం ఇవ్వడం సిగ్గు చేటని తెలిపారు. ఆర్థిక ప్రయోజనాల కోసం ఓవైసీ సోదరులు బీఆర్ఎస్ పంచన చేరి నిండా ముంచారనీ, ఇప్పుడు కాంగ్రెస్‌కూ అదే గతి పట్టిస్తారని విమర్శించారు. సినిమా ఓపెనింగ్ రోజు అగ్ర హీరోలంతా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌కు వెళ్తారనీ, పాన్ ఇండియా సినిమా బెన్ ఫిట్ షోకు భారీ ఎత్తున ప్రేక్షకులు వస్తారని తెలిసి కూడా పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేననీ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అమాయక మహిళ బలై, ఆమె కుమారుడు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని పేర్కొన్నారు. పగబట్టినట్టుగా అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడంతోపాటు హైకోర్టు బెయిల్ ఇచ్చినా ఒక రాత్రంతా జైల్లోనే ఉంచడం కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమని తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులు కల్తీ ఆహారం తిని, పాముకాటులతో చనిపోతుంటే మీరెందుకు బాధ్యత వహించడం లేదని ప్రశ్నించారు.

నగరంలో 40శాతం పెరిగిన నేరాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్‌లో గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 40శాతం నేరాలు పెరిగాయని, అందులో సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ల చోరీలు అధిక సంఖ్యలో ఉన్నాయని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో హైదరాబాద్ వార్షిక నేర నివేదికపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మీడియా సమావేశంలో మాట్లాడారు. గతేడాది 25,488 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఈ ఏడాది 35,944 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. చెదురుమదురు సంఘటనలు మినహా 2024 వ సంవత్సరం చాలా ప్రశాంతంగా గడిచిందన్నారు. హోంగార్డు నుంచి సీపీ వరకు అందరూ కష్టపడటంతో నగరంలో అన్ని పండుగలు, ర్యాలీలు, సభలు, సమావేశాలతోపాటు పార్లమెంట్ ఎన్నికలూ ప్రశాంత వాతావరణంలో ముగిసాయని తెలిపారు. నగరం ప్రశాంతంగా ఉందని, క్రైమ్ జరిగిన సమయంలో పోలీసులు ఏడు నిమిషాలకన్నా తక్కువ సమయానికే చేరుకుంటున్నారని అన్నారు.

కమిషనరేట్ పరిధిలో 129 పెట్రోలింగ్ కార్లు ఉండగా, 210 బ్లూకోల్ట్స్ వాహనాలతోపాటు ఇంటర్ సెప్టర్ వాహనాలు విజిబుల్ పోలీసింగ్‌లో భాగస్వామ్యం చేశామన్నారు. ఈ ఏడాది సౌండ్ పొల్యూషన్‌ను తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని, డీజేలను నిషేధించామని, దాంతో ప్రజలు హ్యాపీగా ఉన్నారని తెలిపారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి సంఘటన తర్వాత నిరాశ్రయులను షెల్టర్ హోమ్‌లకు తరలించామన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌పై ఉన్న వాళ్లపై అన్ని స్టేషన్ పరిధిలో చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆపరేషన్ రోప్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. ట్రై కమిషనరేట్ పరిధిలో 85 లక్షలకు వాహనాల సంఖ్య పెరిగిందన్నారు. సుప్రీంకోర్టు ఆర్డర్స్ ప్రకారం టౌన్ వెండింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని, ప్రజా ప్రతినిధులను ఈ కమిటీల్లో భాగస్వామ్యం చేసి ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తామన్నారు. ఆర్గనైజ్డ్ క్రైమ్స్ కట్టడి చేయడంలో టాస్క్‌ఫోర్స్ ముందుందని, రౌడీలపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోందన్నారు. నేరాలు గుర్తించడంలో సీసీటీవీల పాత్ర ముఖ్యమైందని, వచ్చే సంవత్సరం పాడైన సీసీటీవీల స్థానంలో కొత్తవి పెడతామన్నారు.

ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ మేనేజ్‌మెంట్ కోసం డ్రోన్స్ వినియోగిస్తామని తెలిపారు. రియల్ ఎస్టేట్ మోసాల్లో డిపాజిట్ పేర్లతో జరిగే మోసాల్లో ప్రాపర్టీ అటాచ్‌మెంట్ చాలా త్వరగా చేస్తున్నామన్నారు. ధన్వంతరి కేసులో 88 ప్రాపర్టీలను అటాచ్ చేశామన్నారు. ఈ ఏడాది ఏసీబీ కేసులో 35 మంది పోలీసులు వివిధ విభాగాల్లో సస్పెండ్ అయ్యారన్నారు. గతేడాది 327 రోడ్డు ప్రమాదాలు జరగ్గా ఈ ఏడాది 215కి తగ్గాయన్నారు.

సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతాం

సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతామని సీపీ తెలిపారు. తాజాగా 36 రకాల సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. ఈ సంవత్సరం రూ.297 కోట్ల సైబర్ మోసాలు జరిగాయని, 4047 కేసులు నమోదయ్యాయని తెలిపారు. డిజిటల్ అరెస్టులు, పెట్టుబడుల మోసాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రూ. 42 కోట్లు రికవరీ చేశామని, 500లకు పైగా సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశామని తెలిపారు. గుజరాత్, రాజస్థాన్, సౌత్ ఇండియాకి చెందిన సైబర్ నేరగాళ్ళు ఎక్కువగా ఉన్నారని, బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారానే సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాల్లో బ్యాంకు అధికారుల పాత్ర కూడా ఉందన్నారు.

రెడ్ కార్నర్ నోటీసులో చాలా ప్రాసెస్ ఉంటుంది..

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ జరుగుతుందని, ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావుని ఇండియాకు రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు.

రెడ్ కార్నర్ నోటీసులో చాలా ప్రాసెస్ ఉంటుందని, ఢిల్లీలో సీబీఐని కలిసి రెడ్ కార్నర్ నోటీసులు త్వరగా జరిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

- గతేడాది 25488 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 35944 నమోదు
- అన్ని మతాల పండుగలు ప్రశాంతం
- పార్లమెంట్ ఎన్నికలూ ప్రశాంతం : హైదరాబాద్ వార్షిక నేర నివేదికపై సీపీ సీవీ ఆనంద్

ప్రభాకర్ రావు రాజకీయ శరణార్థిగా గుర్తించాలని అమెరికా ప్రభుత్వానికి పెట్టుకొన్నాడని తెలిసింది.

మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత..

నగరంలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సీపీ తెలిపారు. మహిళా భద్రత విభాగంలో మొత్తం 7 ఉమెన్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. పోకిరీలు, ఆకతాయిలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ఈ ఏడాది 1465 కేసులు నమోదు చేయగా, 2208 మందిని షీటీమ్స్ పట్టుకున్నాయని వివరించారు. ఈ కేసుల్లో 33 మందికి శిక్ష పడిందన్నారు.

నాడు అసెంబ్లీ.. నేడు పార్లమెంటు

- అప్పుడు విధ్వంసక ఆందోళనకారుడు
- ఇప్పుడు బాధితుడిగా రోదన
- ఇదీ.. ఒడిశా బీజేపీ ఎంపీ ప్రతాప్‌చంద్ర సారంగి టైమ్‌లైన్



న్యూఢిల్లీ : పార్లమెంటు ప్రధాన ద్వారం (మకర ద్వారం) వద్ద కొన్నిరోజుల క్రితం చెలరేగిన రచ్చ దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ, ఎంపీలకు గాయాలు కావటం, వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటం ఈ ఘటనలోని అంశాలు. అయితే, బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు గాయపడ్డారు. ఇందులో కేంద్ర మాజీ మంత్రి ప్రతాప్‌చంద్ర సారంగి ఒకరు. ఎన్డీఏ-2 పాలనలో కేంద్ర మంత్రి వర్గంలో స్థానం పొందినపుడు ఒడిశా మోడీగా పిలవబడిన ఈయన తీరు పార్లమెంటు ఘటనతో చర్చనీయాంశంగా మారింది. రెండు దశాబ్దాల క్రితం ఆయన తన స్వంత రాష్ట్రం ఒడిశా అసెంబ్లీలో పాల్గొన్న హింసాత్మక ఆందోళనను, ఇప్పటి పార్లమెంటు ఘర్షణను కొందరు విశ్లేషకులు పోల్చి చూస్తున్నారు. ఆ సమయంలో ఒక విధ్వంసక ఆందోళనలో భాగమైన ఆయన.. నేడు పార్లమెంటు ప్రాంగణంలో బాధితుడిగా మారిన తీరును వారు విశ్లేషిస్తున్నారు.

ఒడిశాలోని బాలాసోర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఎంపీ.. 2002 మార్చిలో రామజన్మభూమి అంశంలో భువనేశ్వర్‌లో జరిగిన ఒక హింసాత్మక నిరసనలో పాల్గొన్నారు. ఒడిశా అసెంబ్లీలోకి దూసుకెళ్లి, ఆస్తిని ధ్వంసం చేసి, అప్పటి సీఎం నవీన్ పట్నాయక్‌తో పాటు మంత్రుల ఛాంబర్లను ధ్వంసం చేశారు. భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగారు. దీంతో ఈ హింసాత్మక ఆందోళనలో భాగమైన వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌తో పాటు ఇతర హిందూ సంఘాలు, సంస్థలకు చెందిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో ప్రతాప్‌చంద్ర సారంగి కూడా ఉన్నారు. ఒడిశాలో నవీన్ పట్నాయక్ బీజేడీతో బీజేపీ.. అధికార కూటమిలో భాగంగా ఉన్న సమయంలోనే జరగటం గమనార్హం.ప్రస్తుతం ఈయన పార్లమెంటు ప్రాంగణంలో జరిగిన ఎంపీల ఘర్షణలో గాయపడటంతో ప్రధానంగా కనిపించారు. తలకు తగిలిన గాయంతో, దానికి రుమాలును అడ్డుపెట్టుకుంటూ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఆరోపణలు చేశారు. రాహుల్ ఒక ఎంపీని తోయటంతో, ఆయన తనపై పడ్డాడనీ, దీనితో గాయమైందని ప్రతాప్‌చంద్ర సారంగి అన్నారు. వీటికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు మీడియాలో ప్రచారమయ్యాయి. ఒకప్పుడు, రాష్ట్ర అసెంబ్లీలో హింసాత్మక ఆందోళనలో భాగమైన ఆయన.. ఇప్పుడు పార్లమెంటులో బాధితుడిగా మారి ఆరోపణలు చేస్తున్న విధానాన్ని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు. బజరంగ్‌దళ్, ఆరెస్సెస్ వంటి హిందుత్వ సంస్థలలో పని చేసిన ఆయన ఆ సమయంలో ఇలాంటి హింసాత్మక ఆందోళనల్లో భాగమయ్యారని అంటున్నారు.

ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్

- ప్రధాని మోడీకి కువైట్ అత్యున్నత పురస్కారం



కువైట్ సిటీ : ప్రధాని మోడీ కి కువైట్ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'తో సత్కరించింది. కువైట్ ఎమిర్ షేక్ మిశాల్ అల్-అహ్మద్ అల్-జాబెర్ అల్-సబా ఈ అవార్డును మోడీకి అందజేశారు. వివిధ దేశాల నుంచి ప్రధాని మోడీకి లభించిన 20వ అంతర్జాతీయ అవార్డు ఇది. స్నేహానికి చిహ్నంగా దేశాధినేతలకు, రాజకుటుంబ సభ్యులకు కువైట్ ఈ పురస్కారం అందజేస్తుంది. గతంలో అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, జార్జ్ బుష్ తదితరులు దీన్ని అందుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.కువైట్ పర్యటన ముగించుకుని ప్రధాని ఢిల్లీకి చేరుకున్నారు.

మానవత్వం మరచిన అల్లు అర్జున్

- ఆత్మపరిశీలన చేసుకోవాలి : ఎంపీ చామల, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్


(ఫైల్)

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సినీనటుడు అల్లు అర్జున్ మానవత్వం మరిచినట్టు ఉన్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ వ్యాఖ్యానించారు. ఆయన తన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం వారు వేర్వేరు ప్రకటనల్లో అల్లు అర్జున్ తీరుపై స్పందించారు. 'అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెడుతున్నారంటే పశ్చాత్తాపం ప్రకటిస్తారనుకున్నాం. ఆయన సినిమా హాల్‌లో ఎంత సేపు ఉన్నారో, వెళ్లేటప్పుడు ఎలా వెళ్లారో ఫుటేజ్ ఉంది. అల్లు అర్జున్ ఆత్మ పరిశీలన చేసుకోవాలి. తెలుగువాడి సత్తా చాటడం అంటే ప్రాణాలు పోయినా పట్టించుకోకపోవడమా? రేవతి చనిపోయిన మరుసటి రోజు ఆయన ఇంటి వద్ద టపాసులు కాల్చారు. ఆయన థియేటర్ వద్ద ఎలా ప్రవర్తించారు. తర్వాత రోజు వారి ఇంటి వద్ద ఎలా వ్యవహరించారో వీడియో ఫుటేజ్‌లో ప్రజలు అంతా చూశారు. రేవతి మృతికి సానుభూతి ప్రకటించి, బాధిత కుటుంబానికి అండగా ఉండాలి. ప్రజా ప్రభుత్వం ప్రజలకు అండదండగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెబితే... అల్లు అర్జున్ మీడియా సమావేశం పెట్టడం సరికాదు. ఎవరు తప్పు చేసినా ప్రభుత్వంలో చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సీఎం ప్రజలకు ధైర్యం, భరోసా కల్పించారు. దీనికి ఆయన ప్రెస్ మీట్ పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇప్పటికైనా జరిగిన ఘటనపై ఆత్మ పరిశీలన చేసుకోవాలి' అని సూచించారు. 'ఎవరో రాసిన నోట్‌ను అల్లు అర్జున్ ప్రెస్ మీట్‌లో చదివారు. అలా చదవడం విడ్డూరంగా ఉంది. నిజ జీవితంలోనూ ఆయన నటిస్తున్నట్లే ఉంది. 'పుష్ప2' సినిమాకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అండగా ఉండి రేట్లు పెంచారు. అసెంబ్లీలో సీఎం వాస్తవాలు చెప్పారు. సినిమాల్లోనే కాదు.. నిజజీవితంలోనూ బాధ్యతగా ఉండాలి' అని సూచించారు.

చట్ట విరుద్ధంగా మందుల నిల్వ, అమ్మకాలు

- ఏడాదిలో 135 మందిపై కేసులు నమోదు : డ్రగ్ కంట్రోల్ అథారిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏడాది కాలంలో చట్ట విరుద్ధంగా ఔషధాలను నిల్వ ఉంచడం, అమ్ముతున్న 135 మందిపై కేసులు నమోదు చేసినట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) తెలిపింది. ఈ మేరకు ఆదివారం డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి వాటిని సహించేది లేదని స్పష్టం చేశారు. ఏదైనా అనుమానిత తయారీ కార్యకలాపాలు అనిపిస్తే, మందులు, నార్కొటిక్ డ్రగ్స్, సైకోట్రాపిక్ సబ్ స్టాన్సెస్‌తో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. చట్ట విరుద్ధంగా ఔషధాలతో నిర్వహించే ఎలాంటి కార్యకలాపాలనైనా పూర్తిగా నిర్మూలించే వరకు తమ డీసీఏ దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 6969కు పని రోజుల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాల్ చేయొచ్చని సూచించారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ముదుచింతలపల్లి గ్రామంలో అక్రమంగా ఔషధాలను నిల్వ ఉంచిన నకిలీ క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేశారు. డోర్ నెంబర్ 49లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎ.నవీన్‌రెడ్డి ఈ నకిలీ క్లినిక్‌ను నిర్వహిస్తున్నారు. అవసరమైన అర్హతలు లేకుండానే స్వప్న క్లినిక్ పేరుతో నడిపిస్తున్నట్టు గుర్తించారు. యాంటీ బయాటిక్స్, యాంటీ డయాబెటిక్, యాంటీహైపర్ టెన్షన్ తదితర 38 రకాల డ్రగ్స్‌ను ఎలాంటి డ్రగ్ లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ఎ.నవీన్ రెడ్డి భార్య వద్ద నుంచి ఫిజిషియన్ శాంపిల్స్‌ను తీసుకుని సీజ్ చేశారు. వీటి విలువ రూ.14,600 అని అధికారులు తెలిపారు. వీరి వద్ద దొరికిన మందులు కేవలం అర్హత కలిగిన వైద్యులు అవసరమైన వారిని గుర్తించి ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఎలాంటి అర్హత లేకుండా వీటిని ఇష్టానుసారంగా వాడితే ప్రజారోగ్యానికే ప్రమాదమని హెచ్చరించారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరిపిస్తున్నారు. అర్హత లేని వారికి మందులను సరఫరా చేస్తున్న హోల్ సేలర్స్, డీలర్లు కూడా డ్రగ్స్ అండ్ కాస్మొటిక్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులని స్పష్టం చేశారు. అలాంటి హోల్ సేలర్స్, డీలర్లపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందులను సరఫరా చేసే ముందు సంబంధింత వ్యక్తి అవసరమైన డ్రగ్ లైసెన్స్ కలిగి ఉన్నారో, లేదో సరి చూసుకోవాలని సూచించారు. ఈ చట్టంలోని నిబంధనల మేరకు డీసీఏ ఔషధాల నిల్వకు, అమ్మకాలకు డ్రగ్ లైసెన్సులను జారీ చేస్తున్నదని చెప్పారు. ఈ చట్టం కింద అత్యధికంగా ఐదేండ్లు జైలు శిక్ష విధించేందుకు అవకాశముందని తెలిపారు. అల్సర్స్, బహిష్టు సమయంలో అధిక రక్తస్రావానికి చికిత్స అంటూ తప్పుడు ప్రకటనలతో అమ్ముతున్న నకిలీ ఔషధాలను డ్రగ్ కంట్రోల్ అధికారులు సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఉత్తరాఖండ్, డెహ్రాడూన్లోని ఆర్యటెక్ ఫార్మా లిమిటెడ్ తయారు చేసిన సక్రెమ్‌డ్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ అల్సర్లను నయం చేస్తున్నదని తప్పుడు ప్రచారం లేబుళ్లపై ముద్రించి అమ్ముతున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో హర్యానా అల్ట్రా గ్రీన్ (యూనిట్ 1) తయారు చేసి లేబుళ్లపై బహిష్టు సమయంలో అధిక రక్తస్రావానికి చికిత్స అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నట్టు గుర్తించి సీజ్ చేశారు. ఇలా లేబుళ్లపై ఫలానా చికిత్సకంటూ ముద్రించడం డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్ మెంట్స్) యాక్ట్, 1954 ప్రకారం నిషేధం విధించారని అధికారులు స్పష్టం చేశారు. వీటిపై కేసులు నమోదు చేసి విచారణ జరిపిస్తున్నారు.



వ్యవసాయం స్థిరీకరణ కావాలి

- ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దండ రాజిరెడ్డి
- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టు రైతుల రాష్ట్ర సమ్మేళనం



నవతెలంగాణ - ముషీరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయం స్థిరీకరణ కావాలని, వివిధ వైవిధ్యం కలిగిన పంటలు ఉండాల్సిన అవసరం ఉందనిఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దండ రాజిరెడ్డి అన్నారు. నేలను సంరక్షించుకోవాలన్నా వాతావరణ కాలుష్యం ఉండకుండా ఉండాలన్నా, రైతు తన కాళ్ళ మీద తను నిలబడాలన్నా, ప్రభుత్వాలు నిలకడగా ఉండాలన్నా.. వ్యవసాయంలో ఉద్యానవన పంటలు, పశు పోషణ, పట్టు పరిశ్రమ లాంటి సెక్టార్లు కలిసి పని చేసినప్పుడే వ్యవసాయం గిట్టుబాటు అవుతుందని తెలిపారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టు రైతుల రాష్ట్ర సమ్మేళనంను ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. తెలంగాణ పట్టు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మూడ్ శోభన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాజిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు పండిస్తున్నామని అన్నారు. కోటి 20 లక్షల ఎకరాల్లో వరి, 80 లక్షల ఎకరాల్లో పత్తిని పండిస్తున్నామని, మిగిలినది 20 లక్షల ఎకరాలేనని తెలిపారు. రైతులకు నెలవారీ ఆదాయం దేశ సగటున రూ.13,600, రాష్ట్రంలో రూ.13,800 మాత్రమే ఉందని అన్నారు. వ్యవసాయ పంటలతో పాటు ఉద్యానవన పంటలు ఉన్న ప్రాంతాల్లో ఆదాయం ఎక్కువగా ఉందని తెలిపారు. మోనోక్రాపింగ్ తగ్గించి హార్టికల్చర్‌ను పెంచాలని అన్నారు. రాష్ట్రంలో ఉద్యానవన పంటలు 12.4 లక్షల ఎకరాలు నుంచి 25 లక్షల ఎకరాలకు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 30 నుంచి 40 శాతానికి ఉద్యానవన పంటలను పెంచుకోవచ్చని అన్నారు. వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయని, దానికి అనుగుణంగా పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. రైతులు పంటలను పండించడమే కాదు, ప్రాసెసింగ్ చేసి అమ్మాలని సూచించారు. పాత దాన్ని పట్టుకొని వేలాడకుండా కొత్త టెక్నాలజీని రైతులు అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రతి కుటుంబ అవసరాలు తీర్చేలా రాష్ట్రంలో తగినంత కూరగాయలు అందుబాటులో లేవని, అందుకే కూరగాయలు పండించే రైతులకు సబ్సిడీలు అందించాలని తెలిపారు. రైతుల పొలాల్లోనే పరిశోధనలు చేయాలని అన్నారు. విపరీతమైన పురుగుమందులు పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్ వాడటం వల్ల నష్టం జరుగుతుందని, వాటిని తక్కువ మోతాదులో వేయాలని కోరారు. సమగ్ర సస్యరక్షణ, సస్య పోషణ విధానాలను పాటించాలని, దాంతో కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ తగ్గుతుందని అన్నారు. రాష్ట్రంలో పట్టు పరిశ్రమలో మంచి అవకాశాలు ఉన్నాయని, వాతావరణం కూడా అనుకూలంగా ఉందని తెలిపారు. ఎకరాకి రెండు నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుందని అన్నారు. ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పట్టుపంట అశ్రద్ధ చేయడం వల్ల నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు. సిరికల్చర్‌లో రాష్ట్ర విడిపోయే ముందు రూ.16 కోట్లు ఖర్చు చేస్తే ఇప్పుడు రూ.394 కోట్లు ఖర్చు పెడుతున్నామని అన్నారు. ప్రభుత్వ డిపార్ట్‌మెంట్, రైతు సంఘాలు, యూనివర్సిటీ కలిసి పనిచేస్తే రాష్ట్రం ముందుకు పోతుందని తెలిపారు. అనంతరం రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోమటిరెడ్డి అభిమన్యు రెడ్డి, బి. ప్రసాద్, ఎల్ బాలకృష్ణ, ఉడత రవీందర్, నరసింహ, సైదులు, ఆశన్న, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

డిపో మేనేజర్ టి. సమత

నవతెలంగాణ-ఎల్బీనగర్

నేడు (సోమవారం) డయల్ యువర్ డీఎం నిర్వహించనున్నట్టు దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ టి.సమత తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులను డిపో మేనేజర్‌కు తెలియజేయాలని కోరారు. ప్రయాణికులకు మరిన్ని సేవలు అందించడం కోసం 9959226137 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు.

ఘనంగా సెమి క్రిస్మస్

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 29వ డివిజన్ సబితా ఇంద్రారెడ్డి కాలనీలోని బడంగ్‌పేట్ కమ్యూనిటీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేపట్టిన క్రీస్తు జననం నాటిక పలువురిని అలరించింది. చిన్నారులు ఆట, పాటలతో సంబరాలు చేశారు. అనంతరం పాస్టర్ జికె రూపస్ క్రీస్తు పుట్టుక



సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో రాందాస్, ఓనేసి ఫర్ సంఘ పెద్దలు జీకే క్రిస్టఫర్ రామచంద్రయ్య, బాలే డానియల్, కుమార్, చందు, డేవిడ్, కిరణ్ యూత్ సభ్యులు బబ్లు, ప్రశాంత్, జోయల్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి



నవతెలంగాణ - మీర్‌పేట్

రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చేవ్వ శ్రవణ్, మీర్‌పేట్ బీజేపీ ప్రధాన కార్యదర్శి గాజుల మధు కోరారు. ఈ మేరకు ఆదివారం వారు మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్ ప్రధాన రహదారి గుంతలతో రాళ్లు తేలి ఉందన్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు సుమారు 6 వార్డులకు ప్రధాన రహదారి అని చెప్పారు. ప్రజలు ఎక్కువగా ఇదే రోడ్డు పై వెళ్తుంటారని గుర్తుచేశారు. ఈ గుంతల రోడ్డుతో స్థానిక ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్పందించి మాట్లాడారు. నిధులు కేటాయించి..రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గొలుసు కట్టు చెరువులను కాపాడండి

- సీపీఐ(ఎం) డిమాండ్
- బాలాపూర్ మండల సీపీఐ(ఎం) నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ - మీర్ పేట్

గొలుసు కట్టు చెరువులను కబ్జాదారుల నుండి కాపాడి..సుందరీకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు బోడ సామిల్, డి. జగదీష్ డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) బాలాపూర్ మండల 2వ మహాసభను మీర్‌పేట చౌరస్తాలోని ప్రైవేటు పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిలుగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామేల్, డి జగదీష్ హాజరై మాట్లాడారు. మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని గొలుసు కట్టు చెరువులను కబ్జా నుండి కాపాడాలని కోరారు. వెంటనే సుందరీకరణ పనులను కూడా



పూర్తి చేయాలన్నారు. అర్హులైన దరఖాస్తు దారులకు కొత్త రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని, అన్ని ప్రాంతాలకు రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా చేయాలని, రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో తగినంత పారిశుధ్య కార్మికులను నియమించాలని, ప్రస్తుతం ఉన్న కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం బాలాపూర్ మండలం సీపీఐ(ఎం) నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన మండల కార్యదర్శిగా ఎం. యాదయ్య మరో సారి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా బి ప్రకాష్ రెడ్డి, దాసరి బాబు, కె శ్రీనివాస్, టి ఏలీషా, శశిపాల్ గౌడ్, శేఖర్ యాదవ్, భాగ్య లక్ష్మిలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ యాదగిరి చారి, ఏలీషా తోపాటు 40 మంది పార్టీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కార్మికుల తరపున

పోరాడేది సీఐటీయూ ఒక్కటే'



నవతెలంగాణ- చంపాపేట్

కార్మికుల తరపున పోరాడేది సీఐటీయూ ఒక్కటేనని సీఐటీయూ సీనియర్ నాయకులు ఎండీ అబ్బాస్ అన్నారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో యాకుత్‌పురా జోన్ చంద్రయ్య హాట్స్ బస్తీలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల తరపున పోరాడే సంఘం సీఐటీయూ ఒక్కటేనని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను ప్రభుత్వం దారి మళ్లిస్తుందని ఆరోపించారు. సంక్షేమ బోర్డును ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడాన్ని ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ నిధులను కార్మికులకు ఉపయోగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా అనేక అడ్డాలపైన సౌకర్యాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి..అడ్డాలపైన వసతులు కల్పించాలని కోరారు. నిరంతరం కార్మిక సమస్యలపై పోరాడే సంఘం సీఐటీయూ అని అన్నారు. కావున సీఐటీయూలో కార్మికులు పెద్ద ఎత్తున సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.కిషన్, కె. జంగయ్య, ఎల్కోటయ్య, లింగయ్య, నాగరాజు, యాదయ్య, చారి, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా



రాఘవేందర్ రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

కాలనీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లోని శ్రీహిల్స్ కాలనీలో ఉన్న డ్రైనేజీ సమస్యను మేయర్ పారిజాత నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అంతేకాదు డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేయడం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ ఏర్పడి ఎన్నో సంవత్సరాలు అవుతోందని, ఆ కాలనీలో డ్రైనేజీ లేకపోవడం వలన కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ వెంకటేష్ గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'అన్ని సబ్జెక్టులకు టాలెంట్ టెస్ట్‌లు అవసరం'



నవతెలంగాణ-హయత్‌నగర్

అన్ని సబ్జెక్టులకు టాలెంట్ టెస్ట్‌లు అవసరం అని ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, SCERT డైరెక్టర్ జి.రమేష్‌లు అన్నారు. తెలంగాణ గణిత ఫోరం తెలంగాణ రాష్ట్రం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి గణిత ప్రతిభా పరీక్షను ఆదివారం రంగారెడ్డి జిల్లాలోని హయత్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, SCERT డైరెక్టర్ జి.రమేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం గణితంలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టుల మాదిరిగా మిగిలిన అన్ని సబ్జెక్టులలోనూ టెస్టులను నిర్వహించాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గణితంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మిగిలిన అన్ని సబ్జెక్టులలోనూ ప్రతిభ చూపే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కందికొండ శ్రీనివాస్, రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి సతీష్ కుమార్, పరీక్షల కన్వీనర్ జి. శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే యాదగిరి రెడ్డి, కే శ్రీనివాస్, సేవారత్న అవార్డు గ్రహీత శ్రీ నక్క శ్రీనివాస్ యాదవ్, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన గణిత ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐ శతజయంతి

ఉత్సవాలను జయప్రదం చేయాలి'

సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్

భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డిలు కోరారు. హయత్‌నగర్ మండలంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి ఆధ్వర్యంలో ఆదివారం శత జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశంలో 100 సంవత్సరాలు పేద ప్రజల కోసం, వాళ్ళ హక్కుల కోసం, సమ సమాజ నిర్మాణం కోసం, సోషలిజం రావాలని, సమాన హక్కులు కలగాలని, ప్రతి పేదవాడు అన్ని రంగాలలో రాణించాలని, ప్రతి పేదవాడికి కూడు, గూడు కల్పించే విధంగా పోరాడిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని వివరించారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్రం రావాలని పోరాటం చేసిన ఘనత కూడా మన భారత కమ్యూనిస్టు పార్టీదే అని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో ఎర్రకోట పైన ఎర్ర జెండా ఎగిరే విధంగా నేటి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి శోభన్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి రమావత్ సక్రు, ఎ.ఐ.ఎస్.ఎఫ్. జిల్లా కార్యదర్శి సామిడి, వంశీ వర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షులు నాగరాజు, చెంది వెంకట్, పారిజాత, అనిత, సౌజన్య, జ్యోతి, సుమతి, శ్రీదర్ రెడ్డి, రాములు, వేణు, సుజాత, రమేష్, పద్మ, రేణుక, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నూతన వరుడికి అరుదైన చికిత్స



నవతెలంగాణ-హయత్ నగర్

పక్కటెముకలు విరిగి ఊపిరితిత్తులకు పంక్చర్ కావడంతో బతకడని చెప్పిన ఓ నూతన వరుడికి కామినేని ఆస్పత్రిలోని వైద్యులు అరుదైన చికిత్స చేశారు. దీంతో ఆ వ్యక్తి పూర్తిగా కోలుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. పెళ్లయిన 15రోజులకు ఆ యువకుడికి ఘోర ప్రమాదం జరిగింది. వృత్తిరీత్యా ఈవెంట్ మేనేజర్ అయిన నరసింహ... హయత్‌నగర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు వేగంగా అతడిని ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని సమీపంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి, తర్వాత అక్కడినుంచి మరో కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దాదాపుగా వైద్యులందరూ అతడు బతకడని, బతికినా లేచి నడవలేడని చెప్పేశారు. దీంతో అక్కడినుంచి కామినేని ఆస్పత్రికి తీసుకొచ్చారు. కామినేని ఆస్పత్రిలో దాదాపు ఆరు నెలలు సమగ్రంగా చికిత్సలు అందించిన తర్వాత మనిషి పూర్తిగా కోలుకుని, తన కాళ్ల మీద తాను నడవడంతో పాటు, మళ్లీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ పనులు కూడా చేసుకుంటున్నాడు. అత్యంత సంక్లిష్టమైన ఈ కేసులో న్యూరోసర్జరీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, క్రిటికల్ కేర్ విభాగాల వైద్యులు, ఫిజియోథెరపీ విభాగం అందరూ కలిసి కృషిచేసి అతడిని మామూలు మనిషిగా చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ క్రిటికల్ కేర్, ఎక్మో సర్వీసెస్ నిపుణుడు డాక్టర్ బి. కిషన్ సింగ్ తెలిపారు. దాదాపుగా బతకడమే కష్టం అనుకున్న యువకుడు ఇలా కోలుకున్నాడు అని డాక్టర్ కిషన్ సింగ్ వివరించారు. ఈ చికిత్సలలో కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రాజేష్ దేశ్‌ముఖ్, కన్సల్టెంట్ న్యూరోసర్జన్లు డాక్టర్ జలీల్, డాక్టర్ ఎస్.రమేష్, ఇతర బృందం పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు

నవతెలంగాణ-హయత్‌నగర్

భారత రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా హోం మంత్రి పదవిలో కొనసాగుతున్న అమిత్ షా.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అగ్రకుల ఆధిపత్య అహంకార ధోరణిలో అవహేళన చేశారని, ఇది యావత్ భారత ప్రజాస్వామ్య వాదానికి విరుద్ధమని అన్నారు. తక్షణమే కేంద్ర హోం మంత్రిగా అమిత్ షాను తొలగించకపోతే దేశవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలంతా కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి కేవీగౌడ్, జాతీయ స్పోక్స్ పర్సన్ వేముల కొండల్ గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాలస్వామి, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గోర శ్యాంసుందర్ గౌడ్, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

శ్రీ సీతారామ కాలనీ సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతి అందజేత

నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 30వ డివిజన్‌లోని శ్రీ సీతారామ కాలనీలోని డ్రైనేజీ, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కాలనీ అధ్యక్షులు సతీష్ జనార్ధన్ కోరారు. ఈ మేరకు ఆదివారం కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అధ్యక్షులు సతీష్ జనార్ధన్ వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాలనీలో



నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు రాజా వంశీ కిరణ్, వీరభద్రరావు, గౌతమ్ రావు, వెంకటేష్, శ్రీనివాస్, రాఘవాచారి, పనింద్ర తదితరులు ఉన్నారు.

36 సంవత్సరాలుగా పార్టీ కోసం స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా రాష్ట్ర నాయకులు, సింగల్ విండో మాజీ చైర్మెన్ కొలన్ శంకర్ రెడ్డిని ఆదివారం భారత జాగృతి సంస్థ బాలాపూర్ మండలం కమిటీ



సభ్యులు ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.మధు, కృష్ణారెడ్డి, మాధవి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రభుత్వం



మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాలనీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్టు మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని మారుతి నగర్‌లో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్, స్థానిక కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలో ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాల కృష్ణ, బొల్లపల్లి కుమార్, నయనా చారి, నరేష్, వెంకటేష్, ప్రదీప్, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ పరిధిలోని తులసి నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ అనారోగ్యాలతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న 24 మందికి సుమారు రూ.8 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడంలో దాని మించిన మరొకటి లేదని పేదవారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని భవిష్యత్తులో కూడా వారికి అన్ని రకాల అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అనిల్, కాలేరు రాజు, బుచ్చిరెడ్డి, అంబటి రవి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా పి.వి నిరంజన్‌రెడ్డి



నవతెలంగాణ-ముషీరాబాద్

వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ (సుందరయ్యపార్కు) 2025 అధ్యక్షుడిగా పి.వి. నిరంజన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సుందరయ్య పార్కులో జరిగిన సర్వ సభ్య సమావేశంలో క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, పాస్ట్ ఇంటర్నేషన్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రాం నాదం నిరంజన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వందలాది మంది వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొని మద్దతు తెలపడంతో ఈ ఎన్నిక అనివార్యం అయ్యింది. అనంతరం నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత కమిటీలో వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేయడం జరిగిందని, క్లబ్ అభివృద్ధి కోసం అందరి సహకారంతో తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు పి. రాజేంద్రప్రసాద్ గౌడ్, ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి. నాగభూషణం, కందూరి కృష్ణ, గడ్డమీది విజయ్ కుమార్ గౌడ్, మురళీకృష్ణ, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో అందరూ కలిసి ఉంటేనే అభివృద్ధి

● బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

కాలనీలు అభివృద్ధి జరగాలంటే కాలనీ వాసులందరూ ఐకమత్యంతో ఉండాలని బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్ అన్నారు. ఈ మేరకు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ పరిధిలోని సాయి మారుతి నగర్ రోడ్ నెంబర్ బోర్డ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ బోడుప్పల్ కార్పొరేషన్ ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని దీనికి ప్రజా ప్రతినిధులతో పాటు ప్రజల కూడా సహకరిసున్నారని అందరి సహకారంతోనే బోడుప్పలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాలనీలలోని ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలను సంబంధిత అధికారులకు చెప్పి పరిష్కారమయ్యే దిశగా ప్రయత్నాలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, ఫెడరేషన్ అధ్యక్షులు రాపోలు రాములు, రాష్ట్ర కాంగ్రెస్ యూత్ ఉప అధ్యక్షులు తరుణ్ గౌడ్, 7వ వార్డు డివిజన్ ఇన్‌చార్జి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ రెడ్డి, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఫెడరేషన్ అధ్యక్షులు లింకన్, సాయి మారుతి నగర్ అధ్యక్షులు రాంబాబు, జనరల్ సెక్రెటరీ చందు, ట్రెజరర్ మల్లేష్, గాయత్రీ నగర్ కాలనీ ఫేస్ వన్ అధ్యక్షులు లింగరాజు, జనరల్ సెక్రెటరీ మధు యాదవ్, న్యూ సాయి మారుతి నగర్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ, మాజీ అధ్యక్షులు నర్సింగ్ రావు, సాయి మారుతి నగర్ కాలనీవాసులు శ్యామ్, సోమన్న, నర్సిరెడ్డి, సంతోష్‌రెడ్డి, మల్లేష్, యాదగిరి, మహిళా సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ కళాకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

● తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ కళాకారులకు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూజేఏసీ) ఛైర్మెన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. టీయూజేసీ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్‌లో కళాకారుల హక్కుల సాధనకై ఆట పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డిలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కళాకారులది కీలకమైన పాత్ర అని అన్నారు. కళాకారులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. కళాకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చిన అమలు చేయాలని కోరారు. రూ.30వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన కళాకారుల ఆట, పాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కోశాధికారి చంద్ర శేఖర్, గంటి చంద్రుడు, షేక్ షావలి, మోహన్ బైరాగి, ఇంద్రి తదితరులు హాజరయ్యారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చి సముచిత స్థానం కల్పించాలి

● ముదిరాజ్ సంక్షేమ సమితి అల్లదుర్గం సురేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చి సామాజిక, రాజకీయ, విద్యారంగాల్లో సముచిత స్థానం కల్పించాలని ముదిరాజ్ సంక్షేమసమితి అల్లదుర్గం సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ముదిరాజ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో అణచి వేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ముదిరాజ్లను బీసీ-ఏ లోకి మారుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరికాదన్నారు. హైకోర్టు న్యాయవాది చిల్లా రమేష్, సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు బి. నర్సింహులు ప్రభుత్వం వెంటనే రిజర్వేషన్ల శాతాన్ని పెంచుతూ ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమార్, ఉపాధ్యక్షుడు తోట సంజయ్, నేతలు బి.నారాయణ, కె. శ్రీహణి, మురళీమనోహర్, రమేష్, శ్రీనివాస్, విజయలక్ష్మి, రాజేశ్వరి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

కీహోల్ సర్జరీతో క్యాన్సర్ కణితి తీసివేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలోని కొంపల్లి ప్రాంతానికి చెందిన 45 ఏండ్ల మహిళకు పుట్టుకతోనే రెండు కిడ్నీలు కలిసి పోయి ఉండటంతో పాటు, కిడ్నీలు పాన్‌కేక్ మాదిరిగా ఉన్నాయి. తాజా గా ఆ రెండింటికీ మధ్యలో క్యాన్సర్ కణితి వచ్చింది. దీంతో నగరంలోని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్ యూ) వైద్యులు సీటీ స్కాన్ చేసి, దాన్ని ఒక సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానించడం ద్వారా 3-డి ఇమేజ్ సృష్టించారు. దాని సాయంతో అసలు కిడ్నీలు ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటికి రక్తసరఫరా ఎటు నుంచి జరుగుతోంది, కణితి ఎక్కడుందన్న విషయాలను గుర్తించారు. ఈ వివరాలను ఆస్పత్రికి చెందిన రోబోటిక్ అండ్ యూరో ఆంకాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం గౌస్ వివరించారు. మహిళ వచ్చినప్పుడు పరీక్షలు చేస్తే క్యాన్సర్ ఉన్నట్టు తెలిసింది. 3-డి మోడల్ సృష్టించి దాన్ని పరిశీలించగా.. రెండు కిడ్నీలు కలిసిపోయి ఉండటం, కుడివైపు కిడ్నీ ఉండాల్సిన చోట కాకుండా కింద కటిప్రాంతంలో ఉండటం, ఒక కిడ్నీ ఉండాల్సిన ఆకారంలో కాకుండా పాన్‌కేక్‌లా ఉండటం లాంటి సమస్యలు ఉన్నాయి. ఆ రెండింటి మధ్యలో కణితి ఏర్పడ టం గుర్తించాం. ఇలాంటి కేసుల్లో కిడ్నీలో కొంత భాగం గానీ, పూర్తి కిడ్నీని గానీ తొలగించాల్సింటుంది. అయితే ఈ కేసులో సంక్లిష్టత చూసుకుంటే.. ఇది పాన్‌కేక్ కిడ్నీ కావడం, రక్తసరఫరా కూడా ఇబ్బందికరంగా ఉండటంతో ఓపెన్ శస్త్రచికిత్స చేయడం కుదరని పని. దాంతో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి కీహోల్ శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించాం. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సి.మల్లికార్జున నాయకత్వంలో మా బృందం ఈ శస్త్రచికిత్సను ప్రారంభించింది. మా ఆస్పత్రిలోని ప్రముఖ యూరో ఆంకాలజిస్టు డాక్టర్ రాజేష్ కూడా ఈ శస్త్రచికిత్సలో కీలక పాత్ర పోషించారు. కేవలం రెండు చిన్న రంధ్రాలు చేసి వాటి ద్వారా మొత్తం కణితిని అత్యంత కచ్చితత్వంతో తొలగించాం. కీహోల్ శస్త్రచికిత్స కావడంతో రక్తస్రావం కూడా చాలా తక్కువగానే జరిగింది. రోగి కోలుకోవడంతో మూడో రోజునే డిశ్చార్జి చేశామని తెలిపారు.

ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

● టీయుసీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని టీయుసీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం డిమాండ్ చేశారు. టీయుసీఐ అనుబంధ తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభ సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమరయ్య నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన టీయుసీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు సంక్షేమ బోర్డు, ఆటో మెయింటెనెన్స్ కోసం రూ.12 వేల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్ల ఆదుకోవాలని, హైదరాబాద్ నగరంలో ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, కొత్త ఆటో పర్మిట్లు జారీ చేయాలని, ఓలా, ఉబర్, రాపిడో సంస్థలను నిషేధించి ప్రభుత్వమే ఉచిత యాప్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం.హన్మేష్ మాట్లాడుతూ పాలకవర్గాలు ప్రభుత్వం అనేక సంవత్సరాల నుంచి కార్మిక వర్గ హక్కులను అరించి వేస్తుందని, ఆటో మోటార్ కార్మికుల ందరూ టీయుసీఐ జెండా కింద సమీకృతం కావాలని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలుగుతారని పిలుపునిచ్చారు. టీయుసీఐ రాష్ట్ర నాయకులు సి.వెంకటేష్, కే.రాజన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ కార్మికులను ఇబ్బంది గురిచేసే చట్టాలు తేవడం అన్యాయమన్నారు. 2019 సెంట్రల్ మోటార్ వెహికల్ (సవరణ) చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల సందర్భంగా 21మందితో నూతన కమిటీ ఎన్నికయింది. తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే గుమ్మ డి నరసయ్య, రాష్ట్ర అధ్యక్షులుగా వీ.ప్రవీణ్ (హైదరాబాద్), పాయం వెంకన్న ప్రధాన కార్యదర్శి (భద్రాద్రి కొత్తగూడెం), ఎస్.కె లాల్ మియా ఉపాధ్యక్షుడిగా (ఖమ్మం), జి.లింగం గౌడ్, సహాయ కార్యదర్శి (రంగారెడ్డి జిల్లా), కోశాధికారి ఎ.శ్రీనివాస్ కోశాధికారి (మహబూబ్ నగర్), కమిటీ సభ్య లుగా మహమ్మద్ అఫ్జల్ (మేడ్చల్) టి.నారాయణ (హైదరాబాద్), మహమ్మద్ కాజా మియా (మే డ్చల్), ఎస్.రవీందర్ (సికింద్రాబాద్), బి.ప్రభాకర్ (సైబరాబాద్), దళిత్ (ఆదిలా బాద్), కే.సాయన్న (నిర్మల్), వి.బాలరాజ్ (మహబూబ్‌గర్), అబ్దుల్లా (నారాయణపేట), వై.ఉపేందర్ (ఖమ్మం), ఎండి చాంద్ పాషా (గద్వాల), కే.శ్రీనివాస్ (ఖమ్మం) ఎన్నికయ్యారు. మరో నాలుగు కో ఆప్షన్ పెట్టడం జరిగింది.

జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో బ్లాక్ బెల్టుల ప్రధానోత్సవం



నవతెలంగాణ-అంబర్‌పేట

జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 8 మంది కరాటే విద్యార్థులకు బ్లాక్ బెల్ట్‌లు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్, నిరంజన్ రావు ఉపలోకాయుక్త హాజరయ్యారు. జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ విభాగంలో వి. సుధాకర్, బ్లాక్ బెల్ట్ విభాగంలో శాన్వి, లాస్య, అస్మిత్ శ్రీవాస్తవ, నభరున్, సృజన్, ప్రతీక్, హర్షవర్ధన్ బెల్ట్‌లు పొందారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. 'యువతతో పాటు బాలికలు కూడా బ్లాక్ బెల్ట్ సాధించడం ఎంతో ప్రేరణాత్మకమైనది. కరాటే విద్య నైపుణ్యం మాత్రమే కాకుండా, మన ఆరోగ్యానికి, ఆత్మవిశ్వాసానికి కూడా మేలు చేస్తుంది. ప్రతి ఒక్కరు శారీరకంగా దృఢంగా ఉండటంతోపాటు మానసికంగా స్థిరంగా ఉండడం చాలా ముఖ్యం' ఈ విద్య వయసుతో నిమిత్తం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సీనియర్ మాస్టర్లు నర్సింగరావు, కరీం, మహిత, అమృత రెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, విద్యార్థులు వారి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'షీరోస్' ధీర వనితలు - స్ఫూర్తి కాంతుల పుస్తక ఆవిష్కరణ



● డాక్టర్ జాస్తి శివరామకృష్ణ

నవతెలంగాణ-అంబర్‌పేట

భారత దేశంలో వివిధ రంగాలలో పని చేసిన మహిళలను పరిచయం చేస్తూ వెలువరించిన ఇంగ్లీష్ పుస్తకాన్ని 'షీరోస్' పేరుతో 256 మంది ధీర వనితలు-స్ఫూర్తి కాంతులు పేరుతో తెలుగులోకి అనువదించి పిల్లలకు చేరువ చేయాలనే లక్ష్యంతో తీసుకువచ్చిన ఈ పుస్తకాన్ని ఆదివారం హిమాయత్ నగర్ లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ లో డాక్టర్ జాస్తి శివరామకృష్ణ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ వైస్ ఛైర్మెన్ మణికొండ ప్రార్థన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ తరం పిల్లలకు ధీర వనితలను పరిచయం చేయాలని, వారు చూపిన దారుల చైతన్యం ఈ తరం ఆడపిల్లలు అందిపుచ్చుకోవాలని, తిరిగి మరింత మంది షీరోస్‌గా ఎదగాలని ప్రయత్నం భవిష్యత్తు తరాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యల సోమయాజులు, దుంద్రపెల్లి బాబు, పందిరి శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ప్రభాకర్ తదితరులున్నారు.

ఎస్ఈఏ 7వ వార్షిక వ్యవస్థాపకత, యువజన సదస్సు



● 2025 డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

సనాతన ఎంట్రప్రెన్యూర్స్ అసోసియేషన్ 7వ వార్షిక వ్యవస్థాపకత అండ్ యువజన సదస్సు, 2025 డైరీ ఆవిష్కరణ తెలంగాణ గవర్నమెంట్ సలహాదారులు హర్కర వేణు గోపాల్‌రావుతో కలిసి మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచంద్రరావు, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి చేతుల మీద జరిగింది. ఎస్ఈఏ ఛైర్మెన్ నరేంద్రకుమార్ కామరాజు మాట్లాడుతూ '2018లో స్థాపించిన మా బ్రాహ్మణ అసోసియేషన్ వ్యాపార నిపుణులు, వ్యాపారవేత్తలను ఒకచోట చేర్చేందుకు ఏకీకత వేదికను రూపొందించే దక్పథంతో పుట్టింది. మా ప్రాథమిక లక్ష్యం సహకారాన్ని ప్రోత్సహించడానికి, వృద్ధికి అవకాశాలను అందించడానికి, మనలోని బంధాలను బలోపేతం చేయడానికి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఏ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ దంటు అనంతరాయశర్మ ప్రదీప్ కుమార్, జాతీయ అధ్యక్షుడు సత్యం శ్రీరంగం, ఎస్ఈఏ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.సీ. మూర్తి, ఉపాధ్యక్షులు జి.రవి కుమార్, కోశాధికారి ఆదిరాజు మురళీధర్, వి.రామసుబ్రహ్మణ్యం, వెల్లాల అను రాధ, జాతీయ ప్రధాన కార్యదర్శి మహిళా విభాగం, ఉమా పెరిగారు, ఉపాధ్యక్షులు, మహిళా విభాగం, శిరీషా పుల్లె, ప్రధాన కార్యదర్శి టీఎస్ మహిళా విభాగం పాల్గొన్నారు.

అంజాద్ హబీబ్ సెలూన్, శిక్షణా అకాడమీ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ ప్రఖ్యాత హెయిర్ స్టైలిస్ట్ జావిద్ హబీబ్ కుటుంబం నుంచి వచ్చిన అంజాద్ హబీబ్ సెలూన్ అండ్ ట్రైనింగ్ అకాడమీ కూకట్‌పల్లిలో ప్రారంభమైంది. ఈ సెలూన్‌ను లాంఛనంగా ఇక్కడ ప్రారంభించారు. హెయిర్ స్టైలిస్ట్ బ్యూటీషియన్లుగా శిక్షణ పొందేందుకు అధునాతనమైన శిక్షణను ఇక్కడ అందించనున్నారు. ఈ కార్యక్రమానికి అంజద్ హబీబ్‌తో పాటు ప్రముఖ సినీనటి ఫరియా అబుల్లా, మహమ్మద్ షాజహాన్ బాషా, మదనపల్లె ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ అందాల రంగానికి ఇప్పుడు మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జావిద్ హబీబ్ కుటుంబ సభ్యుడైన అంజాద్ హబీబ్ ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంతోమంది ఔత్సాహికులకు ఈ కేంద్రం శిక్షణనిచ్చేందుకు ముందుకు వస్తుందన్నారు. సినిమా రంగానికి అందాల రంగానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. అంజాద్ హబీబ్ మాట్లాడుతూ సెట్ ఆఫ్ టు అంటే హెయిర్ స్టైల్, బ్యూటీషియన్ రంగంలో మరింత మంది నిపుణులను తీర్చిదిద్దేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. జుత్తు, చర్మం, గోర్లకు సంబంధించిన రంగాల్లో అతి తక్కువ ధరతో ఇక్కడ శిక్షణను ఇస్తున్నామన్నారు. దీనికి తోడు 100శాతం జాబ్ అసిస్టెంట్స్ కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్ర సహభాగస్వాములు షా బుద్దీన్, శ్రీధర్, బ్రాండ్ హెడ్ మహేష్‌రెడ్డి, తదితరులున్నారు.

జనవరి 26న ఆమరణ నిరాహార దీక్ష చేస్తా..

● ప్రజాపక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి వెనక్కి తీసుకోవాలని ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గౌలిగూడలోని కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును విశ్వవిద్యాలయానికి కొనసాగించాలని డిమాండ్ చేశారు. పొట్టి శ్రీరాములు పేరు మారిస్తే దానికి నిరసనగా జనవరి 26 తేదీన జెండా ఎగరవేసి ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభిస్తానని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

5జీ స్మార్ట్‌ఫోన్-ఎం-7 ప్రో 5జీ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఓసీఓ భారతదేశపు అత్యంత డైనమిక్ కన్స్యూమర్ టెక్ బ్రాండ్‌లలో ఒకటి, ఇప్పుడు పీఓసీఓ ఎం-7 ప్రో 5జీ, పీఓసీఓ సీ-75 5జీ అనే రెండు సంచలనాత్మక స్మార్ట్ ఫోన్‌లను లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించింది. "ప్రతి ఒక్కరినీ శక్తి వంతం చేసే సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడాన్ని మేం ఎల్లప్పుడూ విశ్వసిస్తాం. ఈ ఆవిష్కరణలతో పీఓసీఓ మా అభిమానులకు మరిన్ని ఆవిష్కరణలు, మరింత విలువను అందించాలనే దాని లక్ష్యానికి కట్టుబడి ఉంటుంది" అని పీఓసీఓ ఇండియా కంట్రీ హెడ్ హిమాన్షు టాండన్" అన్నారు.

'10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదే'

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నిరుపేదలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకే ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజానాట్య మండలి, అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎన్. సత్య నారాయణరెడ్డి భవన్‌లో రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాడ వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సీపీఐ శత వసంతాల సందర్భంగా పార్టీ అవనిగత్యాన్ని కొడియార్తు పాటలను, నూతన కళారూపాలు, జానపద గీతాలు, నాటకాలు, ఒగ్గు కథ, పల్లె సుద్దులు నృత్య కళారూపాలను తయారు చేయాలని సూచించారు. ఈ నెల 30న నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సీపీఐ శత వసంతాల సంబరాల సందర్భంగా నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సీపీఐ శాసనసభ పక్ష నేతగా ఉన్న సమయంలో కోనేరు రంగారావు కమిటీతో కలిసి ఢిల్లీకి వెళ్లడం జరిగిందని తెలిపారు. సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు దేశవ్యాప్తంగా వర్గీకరణకు మద్దతుగా ప్రత్యక్షంగా పరోక్షంగా సీపీఐ మద్దతు తెలిపిందని, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉందన్నారు. వెయ్యి డబ్బులు లక్ష గొంతుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏపూరి సోమన్న బృందం, చాడ వెంకటరెడ్డిని కలిసి బహిరంగ సభలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేని శంకర్, ఎం.బాలనరసింహ, ఈ.టి.నరసింహ, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న, గిద్దె రామ నరసయ్య మచ్చ దేవేందర్, శివ, భరత్, చక్రాల రఘు, లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, చంద్రశేఖర్, కొండల రావు, ఆరెల్లి రవి, అరసం రాష్ట్ర అధ్యక్షులు పల్లేరు వీరస్వామి, అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కెవిఎల్, కమలరెడ్డి, వేణుగోపాల చారి, సుధాకర్, గణేష్, వాసు, శ్యామల, సైదులు తదితరులున్నారు.

ఢిల్లీ, హర్యానా మద్యం పట్టివేత..



నవతెలంగాణ-చర్లపల్లి

ఢిల్లీ, హర్యానా రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తుల ను ఎస్‌టీఎఫ్ టీం సభ్యులు అరెస్ట్ చేశారు. నాచారం ఉప్పల్ ప్రాంతంలోని కార్తికేయ నగర్‌లో ఒక ఇంట్లో మద్యం బాటిల్లు అమ్ముతున్నారని సమాచారం మేరకు ఎస్టిఎఫ్ టీం శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో హర్యానా, ఢిల్లీ ప్రాంతాలకు చెందినటువంటి 17 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వీటి విలువ రూ. లక్షన్నర ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్స్‌ను అక్షిత్ అనే వ్యక్తి ఇంట్లో పట్టుకున్నారు. ఈ మద్యం బాటిల్లను శశాంక్ అనే వ్యక్తి ఢిల్లీ, హర్యానా ప్రాంతాల నుంచి తీసుకువచ్చినట్లు నిందితుడు విచారణలో వెల్లడించారు. ఎస్‌టీఎఫ్ టీంలో సీఐ భిక్షారెడ్డి, ఎస్ఐ బాలరాజు, కానిస్టేబుల్ యాదగిరి, కౌశిక్, సాయికిరణ్, నితిన్‌లు ఉన్నారు. మద్యం బాటిల్స్‌ను పట్టుకున్నటువంటి ఎస్‌టీఎఫ్ టీములను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి, లీడర్ ప్రదీప్ రావులు అభినందించారు.

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ కామర్స్, హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ పోలీస్ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ ఛైర్మెన్ కోలేటి దామోదర్ గుప్త హాజరై సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో 200 మంది బాలింత మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సరాఫు లక్ష్మణ్ గుప్త మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు గత పది సంవత్సరాల నుంచి చేస్తున్నామని తెలియజేశారు. దాతలు 100, రఘువీర్ 100 దుప్పట్లను అందజేశారని తెలిపారు. అనంతరం ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపల్ కూర రఘువీర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శీతాకాలంలో వివిధ ప్రాంతాల్లో కళాశాల ఎన్ ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్ల ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ తిరుమల రావు, ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు యూనిట్ 1,2 సత్యనారాయణ, ఇ. రామకృష్ణ , ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వసంత్ కుమార్, బి.శ్యాం సుందర్, 15 మంది ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు, 15 మంది ఎన్‌సీసీ కాడెట్స్ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమం కోసం కరపత్రాలతో ప్రచారం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కార్మికుల సంక్షేమం కోసం, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి కూకట్ పల్లి టీపీసీసీ లేబర్ సెల్ నాయకులు కరపత్రాలతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా.. ఆదివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నర్సింహ స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్టలో ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి, కార్మిక సంక్షేమం కోసం కర పత్రాలతో ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ నాయకులు రాంబాగ్ ప్రకాష్ గౌడ్, ఎస్.జీవన్ రెడ్డి, సప్పిడి భాస్కర్, పి.రాజ్ రెడ్డి, ఏ.సిద్దయ్య, గోకర్ల లక్ష్మి నారాయణ, ఆయిల శ్రీధర్ గౌడ్, పెంటయ్య పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని గణేష్ నగర్‌లో డ్రయినేజీ వాటర్ పొంగి, రోడ్ల మీదకు వచ్చి సమస్యగా ఉందని, కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురావడం వచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కాలనీలో పర్యటించారు. డ్రయినేజీ సమస్య గురించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, సంతోష్ ముదిరాజ్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మ్యాక్స్ కార్మికులకు అండగా ఉంటా..



● మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జీడిమెట్ల పారిశ్రామికవాడలోని సూపర్ మ్యాక్స్ కార్మికులకు అన్ని విధాలుగా అండగా ఉండి న్యాయం చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం గాజులరామారం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్మికులు వారి కష్టాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు కార్మి కులు మాట్లాడుతూ పరిశ్రమలో 1050 మంది కార్మికులకు గత రెండు సంవత్సరాల నుంచి తమకు రావలసిన బకాయిలు చెల్లించడం లేదని.. ఆర్థిక ఇబ్బందులు తట్టు కోలేక 40 మంది కార్మికులు మాసినక, ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్య పాలై చనిపోయారు. పీఎఫ్ (ప్రావిడెం ట్ ఫండ్) అంతరాయం వల్ల మరోక పరిశ్రమలో ఉద్యోగం చేరలేక పోవడం వల్ల మా కుటుంబాలుక రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని వారి గోసను కూనతో చెప్పారు. దీంతో ఆయన స్పందించి.. మాట్లాడుతూ త్వరలో మిమల్ని (కార్మికుల ను)రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలిపించి మీ సమస్యలకు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు భరద్వాజ్, రామచంద్ర రెడ్డి, గోపాల్ రెడ్డి, దయాకర్, సూర్యనారాయణ, రవి కుమార్, రఘుపతిరెడ్డి, జనార్ధన్, సి.హెచ్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రావలసిన బకాయిలు రాబట్టాల్సిందే : కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజవర్గం పరిధిలో ఐడిఏ జీడిమెట్ల సూపర్ మాక్స్ ఫ్యాక్టరీలో సుమారు 1050 మంది కార్మికులకు గత రెండు సంవత్సరాల నుంచి వారి కి రావలసిన బకాయిలు చెల్లించడం లేదని.. 40 మంది కార్మికులు ఆత్మహత్య



లు చేసుకున్నారు. పిఎఫ్ అంతరా యం వల్ల మరోక ఫ్యాక్టరీలో చేరలేకపోవడం వల్ల మా కుటుంబలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని వారి యొ క్క గోసను మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్‌తో చెప్పారు. మాజీ ఎమ్మెల్యే త్వరలో మిమల్ని ముఖ్య మంత్రి తో కలిపించి మీ సమస్యలకు పరిష్కారం చేస్తానని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా సూపర్ మాక్స్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షులు సూర్యనారాయణ దయాకర్, కవిత, శ్రీను రామచంద్ర రెడ్డి, భారత్ రాజు, గణపతి, రాజు పాల్గొన్నారు.

పేదవారికి అందుబాటులో ఉర్దూ ఘర్, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి కృషి చేస్తా: కూన శ్రీశైలం

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నియోజకవర్గంలోని ముస్లిం పేదవారికి అందుబాటులో ఉర్దూఘర్, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని ప్రకాశం పంతులు నగర్, గాజులరామారంలో 15 వేల ముస్లిం కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, శుభాకార్యాలకు చాలా ఇబ్బంది కరంగా మారుతుందని ముస్లిం సోదరులు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. గతంలో తమకు 1999 సంవత్సరంలో 20 గుంటల భూమిని కేటాయించిన స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి కృషి చెయ్యాలని ఆదివారం గాజులరామారంలోని కార్యాలయంలో కలిసి వారు కోరారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే కూన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉండి త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సయ్యద్ రషీద్, ఉపాధ్యక్షులు సయ్యద్ జహీరుద్దీన్, సభ్యులు లాల్ మొహమ్మద్, హాసన్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మిర్జా రషీద్ బేగ్, సంయుక్త కార్యదర్శి నుస్రత్, ఇబ్రహీం ఖాన్, సలీం, ఖలీల్ అహ్మద్, సయ్యద్ సాదిక్ తదితరులు ఉన్నారు.



అభివృద్ధిలో యువకు పాత్ర కీలకం



● ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అభివృద్ధిలో యువకుల పాత్ర కీలకం అని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. 131-కుత్బుల్లాపూర్ డివిజన్ అంబేద్కర్ నగర్ నూతన వెల్ఫేర్ అసోసి యేషన్ నూతన కమిటీ సభ్యులు ఆదివారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముందుగా నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధిలో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో పాటు యువతరం అభివృద్ధి భాగస్వామ్యులైతేనే కాలనీ వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అంబేద్కర్ నగర్ కాలనీ అభివృద్ధికి గతంలో ఎన్నో నిధులు వెచ్చించి అభివృద్ధి పరచామన్నారు. రాబోయే రోజుల్లో కూడా కాలనీ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు సారా శివ కుమార్ గౌడ్ (దిలీప్), ప్రధాన కార్యదర్శి కురుమ రాజేష్ ముదిరాజ్, కమిటీ సభ్యులు నరేష్, సయ్యద్ అన్వర్, నరసింహ చారి, అంబారాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా...అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తా : ఎమ్మెల్యే

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలు సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని కలిసి ఆహ్వాన పత్రికలు, వినతి పత్రాలు అందజేయగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా పద్మా నగర్ ఫేస్ -1, మాణిక్య నగర్, బాల్ రెడ్డి నగర్, ఎన్.ఎల్.బి నగర్, శ్రీకృష్ణ నగర్ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేని కలిసి మౌలిక సదుపాయాలైన సిసి రోడ్డు ప్యాచ్ వర్క్, భూగర్భ డ్రయినేజీ, విద్యుత్ పోల్స్ మార్పు, మంజీరా నీటి పైపు లైన్ మరమ్మత్తు పనులు వంటి మౌళిక వసతుల పనులపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయల నిధులతో ఎంతో అభివృద్ధి చేశామని, జరుగుతున్న జనాభాకు అనుగుణంగా చేపడుతున్న మరమ్మత్తు పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘాల నాయకులు, సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



నివాసాల మధ్యఉన్న ఓయో రూమ్స్‌ని తొలగించాలి



నవతెలంగాణ-బాలానగర్/ కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీ న్యూ హెచ్ఐజీ వెల్ఫేర్ సంక్షేమ సంఘ ప్రతినిధులు, స్థానిక నివాసితులతో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సమావేశం అయ్యారు. డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీ న్యూ హెచ్ఐజీలో నివాసాల మధ్య ఓయో రూమ్స్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాల వల్ల కాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఓయో రూమ్స్ ను ఎలాగైనా కాలనీల నుంచి తరలించాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కార్పొరేటర్ దృష్టికి తీసుకు వచ్చారు. కార్పొరేటర్ ఆదివారం సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించి.. ఓయో రూమ్స్ యజమానిని పిలిపించి, ప్రజలు ఇబ్బంది పడుతున్నరని తెలిపారు. ఈ నేపథ్యంలో 15 రోజుల్లో ఓయో రూమ్స్ నివాస ప్రాంతాల నుంచి మరోచోటికి తరలించాలని యజమానులకు తెలిపారు. అందుకు భవన యజమాని స్పందిస్తూ.. ప్రజలకు ఇబ్బంది జరుగుతుంది కాబట్టి తీసేస్తానని రాతపూర్వకంగా హామీ పత్రం రాసిచ్చారు. సంక్షేమ సంఘ ప్రతినిధులకు అందరి సమక్షంలో ఇచ్చారు. ఈ మేరకు భరత్ నగర్ కాలనీ, న్యూ హెచ్ఐజీ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, విజయ్ కుమార్, శివ కుమార్, సత్యనారాయణ, అన్నపూర్ణయ్య, పాండురంగ రావు, సుదర్శన్ రెడ్డి, వేణుగోపాల్, సాంబశివారెడ్డి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం





● కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-బాలానగర్

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం అని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేస్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీ ప్రాంతానికి చెందిన పి.మంజుల, రవికృష్ణ అనారోగ్య కారణాల వల్ల హాస్పిటల్‌లో చేరింది. చికిత్స అనంతరం కూకట్‌పల్లి కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నేత గోట్టిముక్కల వెంకటేశ్వర రావును బాధిత కుటుంబ సభ్యులు కలిశారు. ఈ మేరకు ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 33 వేలు బాధితులకు మంజూరైయ్యాయి. ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత సభ్యులకు సహాయ నిధి మంజూరైన చెక్కులను అందజేశారు. బాలా నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చెకును అందుకున్న బాధితులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, సీనియర్ నేత వెంకటేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగి రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ లక్ష్మయ్య ప్రవీణ్, మధు, సలీం, రమణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారిని అధిష్టానం తప్పకుండా గుర్తిస్తుంది : బండి రమేష్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నియోజకవర్గ డివిజన్ స్థాయి ఎన్నికల్లో గెలిచిన యూత్ కాంగ్రెస్ నాయకులను కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ వారిని అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీని ముందుండి నడిపించిన యూత్ కాంగ్రెస్ నాయకుల భుజస్కంధాలపై అమూల్యమైన బాధ్యతను ఉంచిందని బండి రమేష్ తెలిపారు. పార్టీ క్రమ శిక్షణకు కట్టుబడి పార్టీకి చేసిన సేవలకు గుర్తించి బాధ్యతలు అప్పగించారని తెలిపారు. పదవులు పొందడంలోనే కాదు ప్రజలకు సేవ చేయడంలోనూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందుండాలని ఆయన కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఇటీవల జరిగిన మేడ్చల్ జిల్లా కూకట్ పల్లి నియోజకవర్గం డివిజన్ స్థాయి యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన నాయకులతో ఆదివారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో బండి రమేష్ సమావేశమయ్యారు. ప్రజా సమస్యల పరిష్కరించడం ద్వారా సమాజంలో నాయకులుగా గుర్తింపు పొందవచ్చు అన్నారు. గెలుపొందిన నాయకులకు కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ఎ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, సీనియర్ నేత గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాదు ప్రతాప్ రెడ్డి, మాజీ వైస్ చైర్మెన్‌లక్ష్మయ్య, డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్, మేకల రమేష్, మధు గౌడ్, బ్లాక్ అధ్యక్షురాలు రమాదేవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అంతమే.. పివి.రావుకు నిజమైన నివాళులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి దయర్ గూడాలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో అంబేద్కరిస్ట్ సింగూరు పాండు ఆధ్వర్యంలో.. మాలల ఆరాధ్య వీరుడు స్వర్గీయ పొత్తుల విగ్నేశ్వరరావు 19వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు మేకల రమేష్ పాల్గొని, మహనీయులు బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జై భీమ్ నినాదాలు చేస్తూ.. కీర్తి శేషులు పొత్తుల విగ్నేశ్వర రావు వర్ధంతి పురస్కరించుకొని వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేకల రమేష్ మాట్లాడుతూ మాలల ముద్దు బిడ్డా, ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ.. సుప్రీమ్ కోర్టులో పోరాడి గెలిచి, మాలల సత్తాను చాటిన మహోన్నతుడు స్వర్గీయ రావు అని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు సింగూరు పాండు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలను హెచ్చరిస్తూ.. ఎస్సీల ఐక్యతను దెబతిస్తే సహించేది లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్దామని దళితుల న్యాయమైన హక్కులను నాశనం చేసేందుకు కొందరు, ఆధిపత్య దారుల కుట్ర అన్నారు. అంతేకాకుండా నాడు స్వర్గీయ పి వి రావు చెప్పినట్టు, ఐక్యతతోనే ఏదైనా సాధించగలం అనే మాటలను గుర్తుచేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘము సభ్యులు బేగరి నర్సింహ, గుణగుంట యాదగిరి, కొండల్, హరిబాబు, కార్య నిర్వాహకులు రాజేష్ పాశ్వాన్, పసులది రాములు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎస్. భరత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి సుమారు (25-30) ని సూరారం సిగ్నల్ నుండి షాపూర్ నగర్ వైపుకు వెళుతున్న కార్ నం ఏపీ10బిఎఫ్9392 గల డ్రైవర్ అతివేగంగా నడిపాడు. పడుకున్న వ్యక్తిని ఢీకొని, కొంత దూరం వరకు ఈడ్చుకొని వెళ్లి.. కారు డ్రైవర్ కారును ఆపకుండానే వెళ్లిపోయాడు. కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో శ్రీ రామాంజనేయ యువజన సంఘం, శ్రీ అన్నపూర్ణ అన్నదాన ఆధ్వర్యంలో.. సోమవారం ఉదయం 9:45 నిమిషాలకు శ్రీ వేణుగోపాల స్వామి వారి పుష్కరిణి (కోనేరు) పునరుద్ధరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.ఎం.ప్రతాప్‌ని, యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కెపి విశాల్ గౌడ్‌ని విచ్చేయమని శ్రీ అన్నపూర్ణ అన్నదాన నిధి వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీ వేణుగోపాలస్వామి, ప్రధాన అర్చకులు శ్రీ తిరుమల మధుసూదనాచార్యులు, శ్రీ ఆచార్య తిరుమల కృష్ణ చైతన్య, శ్రీ తిరుమల రామానుజాచార్యులు ఆహ్వానించారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మోడికేర్ వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం , 132 జీడిమెట్ల డివిజన్ పరిధి శ్రీ వెంకటేశ్వర కాలనీ(వెస్ట్) లో హనుమాన్ టెంపుల్ వద్ద ఎం.కమరపు రవీందర్ నూతనంగా ఏర్పాటు చేసిన మోడికేర్ వెల్నెస్ సెంటర్(ఇండియన్ మేడ్ ప్రొడక్ట్స్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి మోడికేర్ వెల్నెస్ సెంటర్‌ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సింహ రెడ్డి, సతీష్ చక్రవర్తి, నాగరాజు, మారుతీ, గుప్తా, కూన మహేష్ గౌడ్, మహేష్, శ్రవణ్, దత్తు, శివ పాల్గొన్నారు.

" స్నాక్స్ తంత్ర " రెస్టారెంట్ ప్రారంభించిన చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పైప్ లైన్ రోడ్డులో కేశవ్ యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన "స్నాక్స్ తంత్ర" రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి " స్నాక్స్ తంత్ర " రెస్టారెంట్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. భోజనం ప్రియులకు విభిన్న రకాల వంటకాల రుచులను అందించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగదీప్ గౌడ్, భాను, సుదర్శన్, అంజి రెడ్డి, మురళి, వికాస్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌వైకే ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నెహ్రూ యువ కేంద్ర భారత ప్రభుత్వం రంగారెడ్డి శాఖ, శేరిలింగంపల్లి బ్లాక్, వివేకానంద యూత్ అసోసియేషన్ సంయుక్తంగా, బాలకృష్ణ హైస్కూల్ మైదానంలో ఎన్‌వైకే సభ్యులు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో.. క్రీడా పోటీలు నిర్వహించిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక జగద్గిరిగుట్ట సర్కిల్ ఇన్ స్పెక్టర్ నర్సింహ, జిల్లా ఎన్‌వైకే ఆఫీసర్ ఐజయ్య, ఎస్ఎస్‌డి స్కూల్ చైర్మెన్ రవీందర్ రావులు హాజరయ్యారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను ప్రోత్సహించారు. గెలుపొందిన క్రీడాకారులకు, బాలకృష్ణ హైస్కూల్ కరెస్పాండెంట్ బాలకృష్ణ చేతుల మీదుగా.. బహుమతుల ప్రధానోత్సవం జరపడం జరిగింది. అడ్వకేట్ నరేందర్ రెడ్డి, నర్సింగ్ యాదవ్, నర్సింహచారి, ఆంజనేయులు, సురేష్, చాంద్ పాషా, రాజు సాయి, యువజన సంఘాల సభ్యులు, పాఠశాలల యాజమాన్యాలు, తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | డిసెంబర్ 23, 2024 | www.navatelangana.com

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నవ తెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆదివారము తన క్యాంపు కార్యాలయంలో 15 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవాళ్లందరికి ఆరోగ్యం, చికిత్స అందుబాటులో ఉండేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తు ఒదని అన్నారు. ప్రయివేట్ ఆస్పత్రులలో ఖరీదైన వైద్యం చేయించుకునే స్తోమత లేని పేదవానికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద ప్రభుత్వం వారికి ఆర్థిక సాయం చేస్తుందని భరోసా ఇచ్చారు.

నీటి బిల్లులు మాఫీ జరిగేలా కృషి చేస్తాం



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్‌లోని పేద ప్రజలు భయపడవలసిన అవసరం లేదని, నల్లా బిల్లులు మాఫీ చేసేందుకు కృషి చేస్తామని కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు న్యావుల రామకృష్ణ అన్నారు. ఆదివారం ఐదోవార్డ్, కాక గూడలోని బాలాజీ కాలనిలో స్థానికులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్థానికులు తెలిపిన సమస్యలపై మాట్లాడుతూ.. మంచినీటి బిల్లులు మాఫీ చేయించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బోర్డు ప్రాంతానికి సరిపోయినన్ని నీళ్లు ఇవ్వడం లేదని, రాష్ట్రప్రభుత్వం ద్వంద వైఖరితో కంటోన్మెంట్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటా



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల మోండా మార్కెట్‌లో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు షాపులు దగ్ధమైనాయి. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెంకన్న స్వామి దర్శనానికి వెళ్లారు. దీంతో ప్రమాదస్థలికి వెళ్లలేకపోయారు. కాగా బాధితులు ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన బాధితులను పరామర్శించారు. ఈ ఘటన చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సోమవారం అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శిస్తామని చెప్పారు. బాధితులతో పాటు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, మహేష్ యాదవ్, మహేందర్, మధు తదితరులు ఉన్నారు.

ఓయూలో గడ్డం వెంకటస్వామి పదోవ వర్ధంతి



నవతెలంగాణ-ఓయూ

ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా)ఓయూ అధ్యక్షులు నామ సైదులు ఆధ్వర్యంలో ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట వెంకట స్వామి వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నామ సైదులు మాట్లాడుతూ.. మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వెంకట స్వామి అని దేశం గర్వించదగ్గ నాయకుడిగా ఎదిగారని తెలిపారు. బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి అన్నారు. హైదరాబాదులో వేలాది మంది పేద ప్రజల కోసం భూ పోరాటాలు చేసి ఇంటి స్థలాలు ఇప్పిచ్చిన ఘనత ఆయనకే దక్కుదన్నారు. అందుకే గుడిసెల వెంకటస్వామిగా పిలుస్తారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కాక పాత్ర మరువలేనిది. భవిష్యత్తులో ఆయన ఆశయాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు గడ్డం శ్రీను, నూక మల్ల వీరస్వామి, మంచాల శంకర్, రాహుల్, విజయ నాయక్, వికాస్ యాదవ్, కృష్ణ, ధనుంజయ, ప్రేమ్, కిషోర్, రాజు, అంబేద్కర్, పాల్గొన్నారు.

అల్లు అర్జున్ దిష్టిబొమ్మ దహనం

- సీఎంకి అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలి : బాబా ఫసియుద్దీన్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

హీరో అల్లు అర్జున్ నిన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, బోరబండ వీకర్ సెక్షన్లలోని చౌరస్తాలో అల్లు అర్జున్ దిష్టి బొమ్మని మాజీ డిప్యూటి మేయర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహనికి పూలమాలు వేశారు. కార్పొరేటర్, మాజీ డిప్యూటి మేయర్ బాబా ఫసియుద్దిన్ మాట్లడుతూ.. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన విధానం, కేటీఆర్ అందించిన స్క్రిప్ట్ లాగా ఉన్నదన్నారు. అల్లు అర్జున్ జైలు నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి కేటీ ఆర్ ప్రతి రోజు అల్లు అర్జున్ కలిసినట్టు ఆధారాలు ఉన్నాయన్నారు. కేటీఆర్ రాసి ఇచ్చిన స్క్రిప్ట్ అల్లు అర్జున్ మీడియా ముందు చెప్పాడని, ఇలాంటి చీప్ ట్రిక్స్ కేటీఆర్ మానుకోవాలని హెచ్చరించారు. వెంటనే అల్లు అర్జున్ సీఎం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో ఖయ్యూమ్, ఖలీమ్, గోపాల్ రెడ్డి, కవిత, నర్స, లక్ష్మి నాయక్, రాజి, చెన్నయ్య రాము, లక్ష్మమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున్న పాల్గొన్నారు.



కాప్రా మండల్ జమ్మిగడ్డ ప్రాంత, బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో 134వ వారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డా బి.ఆర్. అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు 134 వ వారం పూలమాలలతో జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్ సభ్యులు ఎస్.ఏ.రహీమ్, నర్సింహ్మ చారి, వెంకటయ్య, సూరిబాబు, నగేష్ పాల్గొన్నారు. నవతెలంగాణ- కాప్రా

బీఎస్పీ ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసనలు

- అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి, రాజీనామా చేయాలి



నవతెలంగాణ-బంజారా హిల్స్

బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ప్రపంచ దేశాలు ఆయన విద్యాబుద్దులు, ప్రజలకు చేసిన సేవలు రచించిన రాజ్యాంగం పట్ల ఎంతో ఆసక్తి చూపడంతోపాటు ఆయన ఆశయాలు కొనసాగాలంటూ కోరుకుంటున్నాయి. అంబేద్కర్ సామాజిక స్పృహతో ఏర్పాటుచేసిన అనేక అంశాలు పరిగణంలోకి తీసుకొని ముందుకు సాగుతే భారతదేశంలోని బీజేపీ సర్కార్ మాత్రం అందుకు విరుద్ధంగా సాగుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వాక్యాలకు నిరసనగా 24న బీఎస్పీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా మండల కేంద్రాలలో శాంతియుత నిరసనలు ర్యాలీలు నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ కోఆర్డినేటర్లు ఈశ్వర్, ఇబ్రహీం శేఖర్, ఉప అధ్యక్షులు శ్రీరామ్ కృష్ణతో కలిసి మాట్లాడారు. పాలక ప్రతిపక్ష పార్టీలు రెండు కులతత్వ సంకుచిత మనస్తత్వంతో దళితులు బడుగు బలహీన వర్గాలు ఇతర సామాజిక వర్గాలపై పైచేయి సాధించాలని ధోరణితో రాజకీయ కక్ష సాధింపు సాధిస్తున్నారని అన్నారు. ఈ వర్గాల అభివృద్ధి అటుంచితే విద్య, వైద్యంతో పాటు ఆర్థిక రాజకీయ రంగాలలో వారిని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ వారి ఆత్మ అభిమానాలను తుంగలో తొక్కి ఇష్టనుసారంగా మాట్లాడుతూ కనీసం పశ్చాత్తాప పడకుండా క్షమాపణ కోరుకొండ ముందుకు వెళుతున్నారంటే దేశ ప్రజలపై వారికి ఉన్న అభిమానం అంబేద్కర్‌పై ఆయన రచించిన రాజ్యాంగంపై వారికున్న గౌరవం తెలిసిపోతుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు ధర్మేందర్, చంద్రశేఖర్, ముదిరాజ్, సంజీవ్ కుమార్, జగన్, దయాకరన్ మౌర్య, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎలివేటెడ్ కారిడార్ బాధితులు

- న్యాయం జరిగేలా చూస్తానని హామీల ఇచ్చిన ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా నేషనల్ హైవే 44 విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న దాదాపు 120 మంది బాధితులు ఆదివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కలిసారు. తమకి న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. బోయిన్‌పల్లి ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షతన ఎమ్మెల్యేను కలిసి తగిన విధంగా న్యాయం చేయాలంటూ వినతి పత్రం సమర్పించారు. సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. 1970 ఏండ్లలో అప్పటి కాంగ్రెస్ నాయకులు దామోదరం సంజీవయ్య కృషి వలన తమకు ఈ ఇండ్లు వచ్చాయిని అప్పటి నుంచి మూడు తరాలుగా తాము ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇప్పుడు ఎలివేటెడ్ కారిడార్ వలన తమ ఇండ్లు పోతున్నాయని తమను వేరే ప్రాంతానికి తరలిస్తే తమ ఉద్యోగాలు, పిల్లల చదువులు, జీవనాధారం అన్ని దెబ్బతింటాయని బాధితులు వారి బాధ వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇండ్లు కోల్పోతున్న వారికి ఎట్టి పరిస్థితులలోనూ నష్టం కలగకుండా తాను స్వయంగా ముఖ్యమంత్రితో మాట్లాడి తగిన నష్టపరిహారం ఇప్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే ప్రత్యామ్నాయంగా మరో చోట ఇండ్లు కూడా కట్టించి ఇచ్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, కలెక్టర్ కూడా వారి బాధను వివరించి బాధితులకు న్యాయం జరిగిన తరువాతనే ప్రాజెక్ట్ ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. ఈ లోగా ఎవరైనా తప్పుడు సమాచారం ఇస్తే నమ్మి ఆందోళన చెందోద్దని భరోసా ఇచ్చారు. క్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్‌తో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

కుట్టు యంత్రాల ఆన్‌లైన్ దరఖాస్తు



- కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి కోట నీలిమ

నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పటిగడ్డ, ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో మైనారిటీ సముదాయాల కోసం ఉచిత కుట్టు యంత్రాల శిబిరం నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో ఏర్పాటు చేసిన ఈ శిబిరం, ఉచిత కుట్టు యంత్రాలు పొందడానికి అవసరమైన ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు పూరించడంలో పాల్గొనేవారికి సహాయపడుతుంది. ఈ ఫారాలు డిసెంబర్ 31వ తేదీ వరకు పూర్తి చేసుకోవాలని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ తెలిపారు. ఆదివారం బేగంపేట, పాటిగడ్డ ఓల్డ్ కస్టమ్స్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్తీలో మహిళలను స్వయం ఉపాధి ద్వారా సాధికారత కల్పించడం ఎంత ముఖ్యమో వివరించారు. అర్హత ఉన్న మహిళలకు ఉచిత కుట్టు యంత్రాలు అందించేందుకు పూర్తి సహకారం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, విశాల్ సుదాం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మైనారిటీల అభ్యున్నతికి, మహిళల ఆత్మనిర్భరతకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమగ్ర అభివృద్ధిపై మా అంకితభావాన్ని ప్రతిబింబిస్తాయాని తెలిపారు.

ఘనంగా త్రిపుర ట్రింగ్ ఫెస్టివల్ వేడుకలు



- ముఖ్యఅతిథిగా తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

యూసుఫ్‌గూడాలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో శనివారం రాత్రి త్రిపుర ట్రింగ్ ఫెస్టివల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆయన సతీమణితో కలిసి పాల్గొన్నారు. అదేవిధంగా గవర్నర్, సతీమణితో కలిసి కేక్ కటింగ్ చేశారు. సుమారు 800 మంది త్రిపుర నుంచి అతిథులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి అనేకమంది పాల్గొన్నారు. త్రిపుర నుండి వచ్చిన వంట వారితో సుమారు వెయ్యి మందికి అనేక రుచికరమైన వంటకాలను తయారు చేశారు. యూసుఫ్‌గూడా సర్కిల్ 19 అధికారులు డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, ఏఎంహెచ్‌ఓ, అన్ని శాఖల అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు శనివారం ఉదయం నుండి స్టేడియం పరిసరాలలో శుభ్రం చేసి అన్ని ఏర్పాట్లు చేశారు. వెస్ట్ జోన్ పరిధిలోని పోలీసు అధికారులు పూర్తి భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఇతర ప్రముఖులు కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో త్రిపుర ట్రింగ్ వేడుకల్లో పాల్గొన్నారు.

సాంకేతిక మార్పులకు సిద్ధంగా ఉండాలి



- ప్రముఖ సినీతారలు

నవతెలంగాణ-బంజారాహిల్స్

వ్యాపార రంగంలో సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా పరుగులు తీయాలని ప్రముఖ సినీ సెలబ్రిటీలు అన్నారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మనడ ఎంబ్రాయిడరీ మెషిన్ సోలుషన్స్ టీవీసీని టాలీవుడ్ సీనియర్ నటులు అన్నపూర్ణమ్మ, కవిత, యాడ్ ఫిల్మ్ డైరెక్టర్ యుమున కిషోర్, టెలివిజన్ నటులు కౌషిక్, సెల్వరాజ్, గిరీష్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నటి కవిత మాట్లాడుతూ.. ప్రతి రంగం సాంకేతికంగా పరుగులు తీస్తుందన్నారు. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. మగువ ఫ్యాషన్ తగ్గా విభిన్న రకాల కట్టింగ్స్, ఎంబ్రాయడరీ డిజైన్స్‌ను అందించే సాంకేతిక స్మార్ట్ యంత్రాలు ఎంతో సమయాన్ని ఆదా చేస్తాయన్నారు. నటుడు కౌషిక్ మాట్లాడుతూ.. యాడ్ ఫిల్మ్ మెకర్ డాక్టర్ సుధీర్ నటి ఆమనితో చిత్రీకరించిన టీవీసీ అద్భుతంగా ఉందని అన్నారు. మనడ ఎంబ్రాయడరీ యం.డి మనోజ్, జి.యం తనుజా తదితరులు ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు అవార్డులను అందజేశారు

మత్తు వదలాలి మార్పు రావాలి

- నార్త్ జోన్ డీసీపీ బాలస్వామి
- ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డ్రగ్ నివారణకై ర్యాలీ



నవతెలంగాణ-ఓయూ

సమాజంలో ప్రతి ఒక్కరు సామజిక భాద్యతతో డ్రగ్ నివారణకు కృషి చేయాలని నార్త్ జోన్ డీసీపీ బాలస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఓయూలో యాంటి డ్రగ్ అవర్నెస్ ప్రోగ్రామ్‌ను స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డ్రగ్ మహమ్మరి పట్టణాల నుంచి పల్లెలకు కూడా పాకుతోందని దీనిని సమూలంగా నిర్మూలించాలంటే మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన జీవనంపై అవగాహన కల్పించేందుకు, డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఓయూలో 3కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌పై పోలీసులు ఎప్పటికప్పుడు నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటునట్టుగా చెప్పారు. ఎవరైనా చుట్టుపక్కల డ్రగ్స్ అలవాటు పడిన, అమ్ముతున్న వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా 3కే రన్ నిర్వహించిన స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాజేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ చైర్మెన్ రేపాక ప్రదీప్ రెడ్డి, ఫెడరేషన్ చీఫ్ అడ్వైజర్ కాటం సునీల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య, ఓయూ సీఐ రాజేందర్ నాయక్, చిలకలగూడ సిఐ అనుదీప్, ఓయు ఎస్ఐలు నరేష్, కాశి ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్, స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి జక్కుల వెంకటేష్, స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషను ఫెడరేషన్ యాక్టివ్ వింగ్ సభ్యులైన వెంకట్, అవినాష్ ప్రసాద్ లెనిన్ చందన్ రెడ్డి, నిజాం కాలేజ్, సైఫాబాద్ కళాశాల, ఎన్సీసీ విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేతకారులను ప్రోత్సాహించాలి

- శ్రీదేవి విజయదాస్



నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని కళింగ కల్చరల్ హాలులో ఆదివారం జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను జయేష్ గుప్తా నిర్వాహించారు. ఈ కార్యక్రమాన్ని హస్తకళా, ఆర్టిషన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీదేవి విజయదాస్ ప్రారంభించారు. అనంతరం హాలులో కొలువుదీరిన చేనేతకారులు వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కారులతో విభిన్న రకాల హ్యాండ్ లూమ్ చీరల తయారీ విధానం, ప్రత్యేకత అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలెదన్నారు. నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని, ప్రతి ఒక్కరు చేనేత కారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 29వ తేది వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.



మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్స్‌లో బీజేపీ మహిళా మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి భీమ్సేన్ మూర్తి దంపతుల కొడుకు సౌరబ్ రోషినిల వివాహ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, లక్ష్మణ్, నగేష్ తదితరులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి, నాయకులు శోభారాణి, వివిధ ప్రాంతంలోని నాయకులు హాజరయ్యారు. నవతెలంగాణ-చర్లపల్లి

కాంట్రాక్టర్లకు బిల్లులు కాదు.. ముందు ఫీజు బకాయిలు ఇవ్వండి

- బీసీ విద్యార్థుల ఫీజులు ఇవ్వకపోతే సచివాలయాన్ని దిగ్బంధిస్తాం
- ఫీజుల విషయంలో బీఆర్ఎస్ చేసిన అన్యాయం కాంగ్రెస్ చేయొద్దు
- ఫీజుల బకాయిల విడుదల కోసం జనవరి 8న బీసీల సమర శంఖారావం
- బీసీ విద్యార్థి సంఘం పోస్టర్ ఆవిష్కరణలో లింగంగౌడ్ వెల్లడి



నవతెలంగాణ-ఓయూ

గత నాలుగేండ్లుగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబ ర్స్‌మెంట్ బకాయిల నిధులు విడుదల వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హెచ్చరించారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులు ఆపి ముందుగా పేద విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయా లని లేదంటే వేలాదిమంది విద్యార్థులతో కలిసి వచ్చి రాష్ట్ర సచివాలయాన్ని దిగ్బంధిస్తా మన్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో జనవరి 8న జరిగే బీసీల సమర శంఖారావం గోడ పత్రికలను బీసీ విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ, పీజీ ఇంజనీరింగ్ ఇతర వృత్తివిద్య కోర్సులు చదువుతున్న 12 లక్షల మంది విద్యార్థులకు గత నాలుగేండ్లుగా ఫీజుల రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ప్రతి ఏడాది జరిగే వార్షిక పరీక్షలు రాయలేకపోతున్నారని పేర్కొ న్నారు. కోర్సు పూర్తి అయిన ఒరిజినల్ సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని తెలియాజే శారు. ఒకవైపు ప్రభుత్వం ఫీజుల బకాయిలు విడుదల చేయకుండా ఇంకొక వైపు ప్రయివేట్ కళాశాల యజమాన్యాలు ఫీజు కట్టాలని విద్యార్థులు వేధిస్తున్నాడంతో విద్యార్థుల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకల తయారైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు ఏండ్లుగా ఫీజులు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టిందని కాంగ్రెస్ ప్రభుత్వం అలా కాకుండా విద్యార్థులందరికీ న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాలకూర కిరణ్, సూర్య తేజ, సాయి ముదిరాజ్, చింతకింది స్వామి, అర్జున్, సాయి గౌడ్, భరత్, నగేష్, మధు, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
సోమవారం | డిసెంబర్ 23, 2024 | www.navatelangana.com

అనంత్యం కళా ఆర్ట్ గ్యాలరీ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-బేగంపేట

అనంత్యం కళా ఆర్ట్ గ్యాలరీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సనత్‌నగర్ ఇన్‌చార్జి ఏఐసీసీ సభ్యురాలు డా.కోట నీలిమ, జోష్న హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళారంగానికి సంబంధించిన ప్రముఖులు, యువ కళాకారులు, మరియు సాంస్కృతిక ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన డా. కోట నీలిమ, కళలను ప్రోత్సహించడం, యువతకు కొత్త అవకాశాలు కల్పించడం వంటి అంశాలను పునరుద్ఘాటించారు. అనంత్యం కళా ఆర్ట్ గ్యాలరీ, సృజనాత్మకతకు ప్రాధాన్యమిచ్చే వేదికగా నిలుస్తుందన్నారు. ఇది యువ కళాకారులకు ప్రేరణగా మారుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది, జోష్న, కళా గ్యాలరీ ఆవిష్కరణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ డా. నీలిమ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

అన్న సంపాదన చూసి ఈర్ష్యపడ్డ తమ్ముడు

- పాతనేరస్తులతో కలిసి దోపిడీ
- రాబరీ కేసులను ఛేదించిన దోమలగూడ పోలీసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

వ్యాపారంలో అన్న బాగా సంపాదిస్తున్నాడని ఈర్ష్యపడ్డ తమ్ముడు అన్న ఇంట్లోనే దోపిడీ చేయాలని పథకం వేశాడు. స్నేహితులు, పాత నేరస్తులతో కలిసి అన్న ఇంట్లోనే దోపిడీ చేశారు. కేసునమోదు చేసుకున్న దోమలగూడ పోలీసులు 12 మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ బంజారాహిల్స్‌లోని సీసీసీలో మీడియాకు వివరాలను వెల్లడించారు. దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 12వ తేదీన రాబరీ జరిగిందన్నారు. కేసును దోమలగూడ పోలీసులతోపాటు టాస్క్‌ఫోర్సు పోలీసులు సంయుక్తంగా ఛేదించారని తెలిపారు. ఈ కేసులో ఎలాంటి ఎవిడెన్స్ లేకున్నా టెక్నికల్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి 12 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. నిందితుల నుండి కోటి 20 లక్షలు విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు కత్తులు తుపాకులతో బెదిరించి దొంగతనానికి పాల్పడ్డారని, ఈ కేసులో ప్రధాన నిందితుడు ఇంద్రజిత్ ఘోరాయ్, బాధితుడు రంజిత్‌కు సోదరుడని, వీరు వ్యాపారం కోసం కొన్నేండ్ల క్రితమై హైదరాబాద్‌కు వలస వచ్చారని తెలిపారు. అయితే నిందితుడు ఇంద్రజీత్ ఘోరాయ్‌కు ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్లకు అలవాటు పడి, వ్యాపారంలో నష్టపోయాడని, అన్నదమ్ముల మధ్య కొన్ని వివాదాలు ఉన్నాయన్నారు. అన్న రంజిత్ బంగారం ఆభరణాల వ్యాపారంలో బాగా సంపాదిస్తున్నాడన్న కారణంతో అతన్ని ఆర్థికంగా దెబ్బతియ్యాలని కక్ష పెంచుకున్న తమ్ముడు అన్న ఇంద్రజిత్తు ఇంట్లో దోపిడీకి స్కెచ్ వేశాడన్నారు. ఇంద్రజిత్తు ఆన్లైన్ బెట్టింగ్ ద్వారా పరిచయమైన అల్తాఫ్ మహ్మద్, సయ్యద్ ఇర్ఫాన్ అహ్మద్ ద్వారా దోపిడీకి ప్లాన్ చేశాడు. ఇంద్రజిత్తు సూచన మేరకు సయ్యద్ ఇర్ఫాన్ ఖాన్, తన తమ్ముడు హబీబ్ హుస్సేన్‌తో ఒక బృందాన్ని ఏర్పాటు చేశాడు. పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు నూరు ఉల్లా అనే న్యాయవాది సలహా తీసుకున్నారు. మైలార్దేవపల్లికి చెందిన రౌడీషీటర్ మహమ్మద్ అర్బాజ్, హబిబ్ హుసేన్ గ్యాంగ్‌తో కలిసి రెక్కీ నిర్వహించారు. డిసెంబర్ 10వ తేదీన మొదటిసారి దోపిడీకి యత్నించారు. అయితే ఇంట్లో బంగారు ఆభరణాలు తయారు చేసే కార్మికులు ఉండడంతో ఆరోజు దోపిడీ యత్నాన్ని విరమించుకున్నారు. తిరిగి రెండు రోజుల తర్వాత ఇంద్రజీత్ పథకం ప్రకారం, మొహద్ అర్బాజ్ నేతత్వంలోని బందం రంజీత్ ఘోరాయ్ ఇంటికి చేరుకుంది. 12వ తేదీ తెల్లవారుజామున పథకం ప్రకారం కుటుంబ సభ్యులను గాయపరిచి బంగారం దోచుకెళ్ళారు. దొంగతనానికి ముందు ప్లాన్ అమలు కోసం నిందితులు కత్తులు, లైటర్ గన్ కొనుగోలు చేశారు. కారును ఏర్పాటు చేసుకుని దానికి నెంబర్ ప్లేట్లు తొలగించారు. రాబరీ అనంతరం అదే కారులో నిందితులు పరారయ్యారు. చోరీ చేసిన సొత్తును ఆరంఘర్ ఫ్లైఓవర్ పై అల్తాఫ్ మొహమ్మద్ ఖాన్ లకు అప్పగించారు. కేసునమోదు చేసుకున్న సెంట్రల్ టాస్క్‌ఫోర్స్, దోమలగూడ పోలీసులు బందాలుగా ఏర్పడి దర్యాప్తు కొనసాగించారు. ఎట్టకేలకు 12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో సెంట్రల్‌జోన్ డీసీపీ అక్షంష్ యాదవ్ ఏసీపీ మోఘులయ్య, దోమలగూడ డీ.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తక్కువ సమయంలో సంచలనమైన కేసును ఛేదించినందుకు వారిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి



- సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల నాయకులు దేవదానం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి అని సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో జీడిమెట్ల బస్ డిపో అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అవమానించారని, అందుకు క్షమాపణ చెప్పాలన్నారు. తక్షణమే కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో.. జీడిమెట్ల బస్సు డిపో దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల నాయకులు ఈ దేవదానం పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశాన్ని మతోన్మాదుల నుంచి కాపాడుకోవాలని భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై పార్లమెంటులో అమిత్ షా చేసిన అహంకారపూరితమైన మాటలు తమ నిజ స్వరూపాన్ని బయట పెట్టిందన్నారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కనపెట్టి మతం అనే ఉన్మాదంతో ప్రజలను చీల్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచి దేశంలో ఉన్న ప్రజాస్వామ్యాన్ని కాలరాయాలని చూస్తున్నారని తెలిపారు. అలాంటి ప్రయత్నాలు చేస్తే దేశంలో ఉన్న వామపక్ష లౌకిక శక్తులు ఐక్యంగా తిప్పికొడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య, బి.సత్యం, సీఐటీయూ నాయకులు కే.శీను, తిమ్మప్ప, భాష, మల్లారెడ్డి, దుర్గా, నాయక్, సాయి, నర్సింలు, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్ అడ్వన్స్ ఫిజియోథెరపీ క్లినిక్ వార్షికోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- ఉచిత ఫిజియోథెరపీ వైద్యం అందించిన డాక్టర్ ఇమ్మడి రమేష్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీర్జాదిగూడ, బోడుప్పల్ జంట కార్పొరేషన్ల పరిధిలోని మెయిన్ రోడ్డులో ఉన్న గౌతమ్ అడ్వాన్స్ డ్ ఫిజియోథెరపీ క్లినిక్ 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సామాజిక సేవ దక్పథంతో డాక్టర్ ఇమ్మడి రమేష్ సామాన్య ప్రజలకు ఉచిత వైద్యం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరై రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ రమేష్ సేవలు అభినందనీయమని, అన్ని అధునాతనమైన సదుపాయాలతో పేషెంట్స్‌కు అన్ని వేళలో అందుబాటులో ఉంటూ మెరుగైన ఫిజియోథెరపీ వైద్యం అందిస్తూ అందరి ప్రశంసలు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ చుట్టు ప్రక్కల ఉన్నటువంటి ప్రజలు అడ్వాన్స్డ్ గౌతమ్ ఫిజియోథెరపీ క్లినిక్‌కు వచ్చి డాక్టర్ రమేష్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ డాక్టర్స్ ఏపీ, తెలంగాణ అధ్యక్షులు డాక్టర్ ఎస్. పి.చంద్రశేఖర్, డాక్టర్ సాయి భార్గవ్, డాక్టర్ మధు, డాక్టర్ రెడ్ సన్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సంతోష్, డాక్టర్ అర్చన, డాక్టర్ సుష్మ డాక్టర్ శ్రావణి,పారా ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వీరయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కే రవీందర్ హాస్పిటల్ వైద్యులు,సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

విఖ్యాత నాట్య గురువు స్వప్న సుందరి రచన ఆగమ భారతం ఆవిష్కరణ



నవతెలంగాణ-కల్చరర్

ప్రముఖ నత్య గురువు , పద్మభూషణ్ స్వప్న సుందరి రచించిన 'ఆగమ భారతం' పుస్తకావిష్కరణ సభ సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్, పరంపర డాన్స్ మ్యూజిక్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్ర భారతి లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల ముఖ్య కార్యదర్శి ఐఏఎస్ జయేష్ రంజన్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.భారతదేశపు పురాతన ఆలయ నత్య, సంగీత వ్యవస్థకు విశిష్ట స్థానం ఉందని ఆగమ భారతం గ్రంథంలో సోదాహరణంగా వివరించారు అని అన్నారు. సాంస్కతిక చరిత్రపై స్వప్న సుందరి విశేష పరిశోధన చేసి ఆలయ నత్య ప్రయాణాన్ని పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేసి పరిశోధనాత్మక గ్రంథాలు వెలువరించాని సూచించారు. చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్ మాట్లాడుతూ.. స్వప్న సుందరి ఆగమ శాస్త్రంలో విద్యాపరమైన విలువను ఆలయ నత్య సంప్రదాయలను తెలియజేశారని పేర్కొన్నారు. అగమ భారతం గ్రంథం పరిశోధకులకు ఎంతో ఉపయోగకరం అన్నారు. కార్యక్రమంలో సంచలన స్కూల్ ఆఫ్ డాన్స్ డైరెక్టర్ పద్మ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.





నగరంలో (యూసీసీ) యూనైటెడ్ క్రిస్టమస్ సెలబ్రెషన్స్ అధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్టమస్‌ను ఘనంగా నిర్వహించారు. ఎల్బీస్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ పీజేడీ కుమార్ నేతృత్వంలో దాదాపు 280 మంది సభ్యులు పాటలతో అలరించారు. ఈ పాటలు హాజరైన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేటి నుంచి విధుల్లోకి ట్రాన్స్ జెండర్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ట్రాఫిక్ విభాగంలో నూతనంగా ఎంపిక చేసిన ట్రాన్స్ జెండర్స్ నేటి నుంచి (సోమవారం) విధులు నిర్వహించనున్నారు. సమాజంలో వివక్షను ఎదుర్కొం టున్న ట్రాన్స్ జెండర్లకు హెూంగార్డులుగా సీఎం రేవంత్ రెడ్డి అవకాశం కల్పించారు.. ఇందులో భాగంగా 39 మంది ట్రాన్స్ జెండర్స్‌ను ఎంపిక చేసిన విషయం తెలి సిందే. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. దేశంలో మొదటి సారీగా ముఖ్యమంత్రి ట్రాన్స్ జెండర్స్‌కు ప్రభుత్వ రంగంలో ఉపాధికల్పించడం సంతోషకరమైన విషయం అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ట్రాన్స్ జెండా ర్స్ సోమవారం నుంచి విధుల్లో ఉంటారని తెలిపారు. ట్రాన్స్ జెండార్స్‌ని అండగా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక జీఓ తీసుకొచ్చిందన్నారు. అన్ని రకాలుగా ఫిజికల్ స్టాండర్డ్స్ చూసుకొని ట్రాన్స్ జెండర్స్‌ని సెలెక్ట్ చేశామ న్నారు. ట్రాన్స్ జెండార్స్‌కి ఇది సువర్ణ అవకాశమని, మీరు చేసే పనిద్వారానే మీ తోటివారికి అన్ని ప్రభుత్వ శాఖలో ఉద్యోగావకాలు కల్పిస్తారని తెలిపారు. దేశం మొత్తం హైదరాబాద్ వైపే చూస్తోందని, మీరు విధుల్లో విజయవంతంగా ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా విధుల్లో చేరిన ట్రాన్స్ జెండార్స్‌కి సీపీ అల్ ది బెస్ట్ చెప్పారు.

ఓయూ గణిత శాస్త్ర ప్రొపెసర్ ప్రొ. రమేష్ బాబుకు సత్కారం



నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వనపర్తి 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం (1974- 2024) ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథులుగా, తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్ డాక్టర్ జి. చిన్నా రెడ్డి, వనపర్తి శాసన సభ్యులు మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెం ట్ సభ్యులు డాక్టర్ మల్లురవి విచ్చేసినారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యా యులు, పాల్గొని ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి అయిన డాక్ట ర్ కె. రమేష్ బాబును కళాశాల ప్రాంగణంలో ముఖ్య అతిథులచే సన్మానం చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం రమేష్ బాబు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజ నీరింగ్ ఉస్మానియా యూనివర్సిటీ లో గణిత శాస్త్రం లో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.గతంలో పలు అవార్డ్స్ కైవసం చేసుకున్నారు. పలువురు అయినకి శుభాకాంక్షలు తెలియజేశారు. రమేష్ బాబుకి జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ వేళా సత్కారం చేయడం విశేషం.

ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొ. పైడిమర్రి చంద్రశేఖర్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ECE), విభాగం ప్రొఫెసర్ పైడిమర్రి చంద్రశేఖర్ ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గా నియమితులయ్యారు. ఓయూ వీసీ ప్రొ. కుమార్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అయిన ప్రస్తుతం గత కొన్ని నెలల నుంచి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. గతం ప్రతిష్టాత్మక అవార్డ్‌కు ఎంపిక ఇనిస్ట్యూట్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (IETE - న్యూ ఢిల్లీ), వారు ప్రదానం చేసే ప్రొ.కె.శ్రీనివాసన్ మెమోరియల్ అవార్డ్ 2023 కు ఎంపిక చేశారు. ఓయూలో అయిన ఈ అవార్డ్ తీసుకున్న వారిలో రెండవ వారు. ఈ అవార్డ్స్ ఐఐటి,ఎన్ఐటి లాంటి సంస్థల్లో పనిచేసే ప్రొఫెసర్స్‌కు వచ్చేవి అలాంటి అవార్డ్ ప్రొ. చంద్రశేఖర్‌కు వరించింది. అయిన గత ఐదు సంవత్సరాలు బోధన పరిశోధన రంగాల్లో అందిస్తున్న విశేష సేవాలకు గాను అవార్డ్‌కు ఎంపిక అయ్యారు. అయిన గతంలో విభాగం హెడ్,బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, డైరెక్టర్ ఆఫ్ ఈవ్యాలువేషన్‌గా పని చేశారు. అయిన మూడు ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పూర్తి చేసి మరొక ప్రాజెక్టును చేస్తున్నారు. 15 మంది విద్యార్థులకు పీహెచ్డీ లు పూర్తి చేశారు. ప్రొ. చంద్రశేఖర్ ఓయూ వీసీకి కృతజ్ఞతలు చెప్పారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE, AT: KALWAKURTHY
I.A. No.1005 OF 2022
in
O.S. No. 168 OF 2021

Between:-
Kudumula Bharathi and others ...Petitioner/plaintiff
AND
Kudumula Jangamma and others ...Respondents/defendants

To,
Pala Prabhakar S/o Madaiah. Age: 48 years, Occ: Private Service, R/o H.No.2-36-64/B/B, Jaiswal Garden, Amberpet, Hyd-500013

WHEREAS, the above named petitioners have filed the above petition against you to implead you from alienating the suit schedule land. The said petition stands posted to on 08-01-2025 for your appearance and your are hereby directed to appear before the above court by 10-30 A.M. on the said date in person or through advocate, otherwise the matter will be decided ex-parte on the material available on records.

//BY ORDER OF THE COURT//
A.Venkateshwar Rao
ADVOCATE
1-71/A, Near S.8.1,
Kalwakurthy-509324,
Cell 9440867579
Counsel for petitioner

IN THE COURT OF THE HON'BLE XXII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O. S. No. 2311 OF 2014

Between
Mohammed Abrar Ahmed and Others ...Plaintiffs
And
M. Sanjiva Reddy and Others ...Defendants

To,
1. Mr. M. Keshav Reddy S/o. Late. M. Sudershan Reddy,
2. Mr. M. Srinivas Reddy S/o. Late. M. Sudershan Reddy,
3. Mr. M. Ranga Reddy S/o. Late. M. Venkat Reddy,
4. Mrs. M. Vasantha W/o. Late. Bhoopal Reddy,
5. Mr. M. Sandeep Reddy S/o. Late. Bhoopal Reddy,
6. Mrs. R. Roja Reddy W/o. Late. M. Raghavender Reddy, Gudimalkapur, Hyderabad
7. Mr. M. Kalyan Reddy S/o. Late. M. Raghavender Reddy,minor represented by his Natural Guardian and Mother 10 th Respondent,Above all are R/o. H.No.12-2-425,Gudimalkapur, Hyd

Whereas the above-named Plaintiff has instituted the present O.S. 2311 of 2017 against you for perpetual injunction. The said case is posted to 06.01.2024. The notices sent by the Hon'ble court returned unserved. Therefore, the Hon'ble court ordered notice by way of publication. Hence you are hereby called upon to appear before this court in person or through an advocate on **06-01-2025** at 10:30 AM. Otherwise, the O.S. will be heard and determined in your absence.

[The present Notice is being published as substituted service as per the Hon'ble Court order Dt.04/12/2024 in O.S. No.2310/2014.]

// By order of the court//
. Thirupathi Reddy
Advocate
Office at Flat No. 201, Veeru castle Apartments, Near Ganesh Temple,Durga Nagar Colony, Punjagutta,Hyderabad - 500082

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM XIV ADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
MVOP. NO. 643 OF 2022

Between:
Mohammad Adil and Others ...Petitioner
And
Ola Fleet Tech P.Ltd,Rep by its M.D. and Others. ....Respondents

To,
1. Mohammed Ghouse ,S/o.Mohd Iqbal,,Occ:Driver of car bearing no.TS 10 UB 2358,R/o.H.No.9-4-29/B68,Hakeempet,Tolichowki, Hyderabad. ....Respondent 3

Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on **24-1-2025** .at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)
M/s. P. CHANDRA MOULI
SMT. ARUNDATHI
ADVOCATES,
H.NO. 8-1-58/5, BANGARU ENCLAVE,JYOTHINAGAR, KARMANGHAT, HYDERABAD

IN THE COURT OF THE HON'BLE XXII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O. S. No. 2310 OF 2014

Between
R. Dayakar chary and Others ...Plaintiffs
And
M. Sanjiva Reddy and Others ...Defendants

To,
1. Mr. M. Keshav Reddy S/o. Late. M. Sudershan Reddy,
2. Mr. M. Srinivas Reddy S/o. Late. M. Sudershan Reddy,
3. Mr. M. Ranga Reddy S/o. Late. M. Venkat Reddy,
4. Mrs. M. Vasantha W/o. Late. Bhoopal Reddy,
5. Mr. M. Sandeep Reddy S/o. Late. Bhoopal Reddy,
6. Mrs. R. Roja Reddy W/o. Late. M.R aghavender Reddy,
7. Mr. M. Kalyan Reddy S/o. Late. M. Raghavender Reddy, Aged 5 Years Occ: Student, minor represented by his Natural Guardian and Mother 10 th Respondent, Above all are R/o. H.No. 12-2-425, Gudimalkapur, Hyderabad

Whereas the above mentioned Plaintiffs has instituted the present O.S. 2310 of 2017 against you for perpetual injunction. The said case is posted to **06.01.2024.** The notices sent by the Hon'ble court returned unserved. Therefore, the Hon'ble court ordered notice by way of publication. Hence you are hereby called upon to appear before this court in person or through an advocate on **06-01-2025** at 10:30 AM. Otherwise, the O.S. will be heard and determined in your absence.

[The present Notice is being published as substituted service as per the Hon'ble Court order Dt.04/12/2024 in O.S. No.2310/2014.]

// By order of the court//
. Thirupathi Reddy
Advocate
Office at Flat No. 201, Veeru castle Apartments, Near Ganesh Temple,Durga Nagar Colony, Punjagutta,Hyderabad - 500082

IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL DISTRICT JUDGE, AT: L.B.NAGAR, RANGA REDDY
I.A.NO.83 OF 2024
IN
I.A.NO.136 OF 2022
IN
OS NO. 42 OF 2016

Between:
Vanaja @ T.Jayamma & Others ...Petitioners/Plaintiffs
VS
Sangam Gopal & Others ...Respondents/Defendants

NOTICE/SUMMONS

To.
J.Shyam Sunder S/o Ramanatham Jooluri, aged about 58 yrs, Occ: Business, R/o H.No.4-1-122 10/1, Boggulakunta, Abids, Hyd.
Sir,
Please take notice/summons that the above named Petitioners/plaintiffs have filed the Petition U/S 5 of Limitation Act in restoration Petition in I.A.No.136 of 2022 to restoration of the Suit in O.S.No.42 of 2016 suit for partition and separate possession in respect of Petition/plaint schedule described land bearing Sy.No.99, admeasuring Ac.3-24 Gts., situated at Himayathnagar Village, Moinabad Mandal, R.R.Dist.
In the above case you are the Respondent No.11 and the above case is posted to 27-12-2024 for your appearance.
Therefore, make it convenient to present yourself either in person or through authorized agent before the above mentioned court at 10-30 AM on 27-12-2024. Otherwise the matter will be decided in ex-parte.

(By order of the Court)
Sd/-
S.Gnaneshwar Goud,
Advocate
1-36, Himayathnagar, Moinabad Mandal, R.R.Dist. 500075,
Cell No. 6303481425, 9985522509

In the court of the Hon'ble VII Junior Civil Judge City Civil Court at Hyderabad.
I.A No. 107 of 2024
IN
O.S No. 162 of 2021

Between:
Mr.Khaleel Ahmed & another ...Petitioners/Plaintiffs
And
M/s.Fortune Monarch Associates & 7 others ...Respondents/Defendants

To,
M/s.Taruni Clothing Pvt. Ltd 401 & 402, 1-7-347 to 349, Mahamood Chinoy Complex, Park Lane, Secunderabad. (R-8)
Sir's/Madam,
Please take notice that the plaintiff has filed suit in O.S No. 162 of 2021 for Damages and Mandatory Injunction and also filed IA No.107 of 2024 for receive of document petition in the said suit and the same is coming up for your appearance and for filing of counter in IA No.107 of 2024 and the same stands posted on 24.01.2025.
Please make it convenient to present either in person or through your counsel before the above Hon'ble court at 10.30 A.M on 24.01.2025, if you fail to appear on the above date the matter will be heard and decided as exparte.

(By order of the Court)
Sd/-
K. ANKIT RAJ
Advocate
2-3-703/1/L, Tirumala Nagar, Amberpet, Hyderabad.
Con No.9959731448

IN THE COURT OF THE II ADDL.DISTRICT & SESSIONS JUDGE:CUM:I ADDL.FAMILY COURT: AT: MEDCHAL.
F.C.O.P.No.216 of 2023

Between:
Theresa Francis D/o Anthony Paul W/o Theodar Joseph, aged 38 years,occ:Household, R/o Plot No.17, sy.No.686, Navarasa Gardens, Balajinagar, Medchal-Malkajgiri District. ...Petitioner.
and
Theodar Joseph S/o Joseph Benedict, aged 45 years, occ:Business, R/o 3-5-782/54, Kingkoti, Hyderabad. ...Respondent.

To
Theodar Joseph S/o Joseph Benedict, aged 45 years, occ:Business, R/o 3-5-782/54, Kingkoti, Hyderabad. ...Respondent.

Please take notice that the above named petitioner filed the above FCOP against you before the said court seeking relief of Divorce. The above case is posted to 11.1.2025 for your appearance either in person or through your counsel at 10.30A.M. before the said court. Failing which the matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT//
S.Ganapathi Rao,
Advocate,
At: 4-91/65/5, Balajinagar, Jawaharnagar, Kapra Mandal, Medchal Malkajgiri District. 500087.
Cell:9848828732.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE:NAGARKURNOOL DITRICT: AT KALWAKURTHY
O.S.No. 146 OF 2022

Between:
Ramoju Laxmana Chary S/o Lingaiah, Aged About 70 Years, Occ: Agriculture, R/o Kotra Village, Veldanda Mandal, Nagarkurnool District .....Petitioners/Plaintiffs
AND
Tricolour Properties Private Limited ...Respondents/Defendants

NOTICE

To,
M/s Tricolour Properties (P) Ltd, Rep By Its Managing Director Chandan Kumar Jha R/o Kotra Village, Veldanda Mandal, Nagarkurnool District. ..Respondents/Defendants

Please take notice that, the above said suit filed against you others for Perpetual Injection in respect of survey no. 510/A, 510/AA admeasuring Ac. 10-02 gts, which are situated at Kotra Village, Veldanda Mandal, Nagar Kurnool District before the Hon'ble Junior civil judge, court in O.S.No.146 of 2023. The said suit is coming for your appearance on 30-12-2024. Hence you are hereby informed to appear before the above said court on **30-12-2024** at 10.30 A.M., in person or through your counsel, failing which the matter will be decided in your absence according to law.

SCHEDULE OF PROPERTY All that the agriculture land admeasuring Ac.10-02 gts in Survey No. 510/A, 510/AA situated at Kotra Village and Veldanda Mandal Of Nagar Kurnool District, bounded by: **North** : Land Of Ramanachandar Reddy Sy. No. 505. **South :** Kacha Road. **East :** Ramoju Laxmana Chary Sy. No. 510. **West :** Hyderabad-Srishailam Main Road

(By order of the Court)
M/s. RAPOLU BHASKAR,
K. SANTHOSH
Advocate
H.No.16-2-740/7 & 7/1, Road No.1, Kalyan Nagar, Gaddiannaram, Dilsukhnagar, Hyd-60. Ph: 7893556720

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | డిసెంబర్ 23, 2024 | www.navatelangana.com

లబ్దిదారుడికి ఎల్‌వోసీ చెక్కు అందజేత : ఎమ్మెల్యే మర్రి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన ఒక లక్షయాభై వెయ్యిల,(1,50,000) ఎల్‌వోసీ పత్రాన్ని లబ్దిదారుడు ఆర్.కృష్ణకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం పరశురామ్ రెడ్డి, సురేష్, ఫరీద్, కరీమ్, బాలకృష్ణ, సంతోష్, తదితరులు ఉన్నారు.

శ్రీకరి మహాసన పాఠశాలలో ఘనంగా సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్..



నవతెలంగాణ - చర్లపల్లి
మల్లాపూర్ బ్రహపురి కాలనీలోని శ్రీకరి మహాసన పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ సంబరాలు హెచ్ఎం. చైర్మెన్ ఎన్.సాయిబాబా, ఎన్.పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విభిన్న మతాలకు పుట్టినిల్లు భారతదేశమని తెలిపారు. ఏసుక్రీస్తు అందరివాడన్నారు. సమాజ శ్రేయస్సు కోసమే ఏసుక్రీస్తు కృషి చేశాడని తెలిపారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అభినందించారు. పాఠశాలలో అనుభవమైన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందిస్తున్నామని తెలిపారు. ప్రతీ విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.శాంతా క్లాజ్ వేషధారణలో విద్యార్థులు అలరించారు. అనంతరం చక్కని క్రిస్మస్ నత్యాల తో పాఠశాలల విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ రాజన్ చాహన్, నరేష్, సుచిత్ర రేఖ, పద్మజ రేఖ, గిరిజ రమణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నారపల్లిలో ద స్పైసస్ ఆఫ్ ఓరుగల్లు హొటల్

- ప్రారంభించిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



నవతెలంగాణ - పోచారం
పోచారం మున్సిపల్ పరిధిలోని నారపల్లిలో ది ఓరుగల్లు స్పైసస్ హొటల్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హొటర్ నిర్వాహకులు రాఘవేందర్ రెడ్డి, వివేక్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి, వైస్ చైర్మెన్ రెడ్యా నాయక్, కౌన్సిలర్ సుర్వి రవీందర్ గౌడ్, సింగిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు బండారి శ్రీనివాస్, గౌడ్, పాలుగుల మాధవ రెడ్డి, బొక్కా ప్రభాకర్ రెడ్డి, సామల బుచ్చిరెడ్డి, ఆకిటి బాల్ రెడ్డి, అబ్బావతి నర్సింహా, సుర్వి శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్, బండారి ఆంజనేయులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



- మహాలక్ష్మి స్కీం ద్వారా నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ. 4500 నష్టపరిహారం ఇవ్వాలి
- ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్

నవతెలంగాణ-కాప్రా
రావాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఫ్రీ బస్సు మహాలక్ష్మి స్కీం వలన నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ.4500 ఇవ్వాలని, ఏడాదికి ప్రభుత్వం ఇస్తానన్న రూ.12 వేలు వెంటనే ఇవ్వాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా ట్రాన్స్ పోర్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం బంగారు నర్సింగ రావు అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశానికి పుప్పాల శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ.. "కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్స్, రవాణా రంగాన్ని ఇన్కమ్ సోర్స్‌గా చూస్తున్నారని, అందుకే నిత్యం ఏదో ఒక పేరుతో చలానాలు వేయడం, ఫీజులు, టాక్స్‌లు పెంచడం చేస్తున్నారని అన్నారు. డ్రైవర్స్‌పై ఆర్థిక భారాలు వేస్తున్నారని, ఇది మానుకోవాలన్నారు. ఇప్పటికే మోటార్ వెహికల్ యాక్ట్ 2019 తీసుకువచ్చి సెంట్రల్ గవర్నమెంట్ డ్రైవర్స్‌పై జైల్ శిక్షలతో పాటు వివిధ రకాల టాక్స్‌లు, ఫీజులు పెంచడమే కాకుండా ఏదో ఒక సాకు చెప్పి వేల రూపాయలు ఫెనాల్టీ వెస్తున్నారని అన్నారు. దీన్ని భరించడమే కష్టంగా ఉంటే, రాష్ట్రంలో ఫ్రీ బస్ స్కీం తేవడంతో వేలాది మంది ఆటో డ్రైవర్స్ మరింత నష్టపోతున్నారని వాపోయారు. వారికి నష్ట పరిహారం ఇస్తామని వాగ్దానం చేసిన రవాణా శాఖ మంత్రి, అధికారులు ఆ విషయాన్ని విస్మరించడమే కాకుండా స్పెషల్ డ్రైవ్ పేరుతో ఈ వేధింపులు ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్కూల్ పిల్లలను ఆరుగురు వరకు తీసుకువెళ్లొచ్చని జీవో ఉంటే నలుగురు, ఐదుగురున్నా చలానాలు వేస్తున్నారని అన్నారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో ఆటో డ్రైవర్లను వేధించడం ఆపాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ గవర్నమెంట్ తీసుకువచ్చిన భారత న్యాయ సంహిత -2023 హిట్ అండ్ రన్ సెక్షన్స్ డ్రైవర్లని దోషులుగా చూస్తున్నాయని, తక్షణమే వాటిని వెనక్కి తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఈ సెక్షన్స్ అమలు చేయబోని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని, డ్రైవర్లకు వెల్ఫేర్ స్కీమ్స్ కల్పిస్తూ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు శంకర్, మల్లారెడ్డి, శివ, శ్రీకాంత్, దశరథ్, రామాంజనేయులు, స్వామి ఉన్నారు.

పద్మశాలి సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా
మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ హెచ్‌బీ కాలనీ ఫేజ్-2 వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో మార్కండేయ పద్మశాలి సంఘం నూతన క్యాలెండర్‌ను కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, వారి సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు వడిచర్ల గోపాల్, ఉపాధ్యక్షులు మాకం అంజయ్య, కార్యదర్శి అముల శ్రీహరి, సూర్యప్రకాష్, కోశాధికారి గుర్రం సతీష్ కుమార్, సలహాదారులు మామిడాల శ్రీపతి, కొంపల్లి మోహన్‌రెడ్డి, పాండు, దుడుక లక్ష్మీనారాయణ, గంజి విజయ్ కుమార్, సభ్యులు అడేపు పెంటయ్య, వినోద్ కుమార్, పడిగే జగన్నాథం, పుట్ట వెంకటేష్, నల్ల శ్రీధర్, బొద్దుల చంద్రశేఖర్, వెంకన్నగౌడ్ రాంప్రదీప్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాను ప్రారంభించిన కార్పొరేటర్ ప్రభుదాస్



నవతెలంగాణ-కాప్రా
హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఇందిరా నగర్ రోడ్డులో స్వచ్ఛ ఆటో డ్రైవర్ చెక్క శ్రీను సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను కార్పొరేటర్ ప్రభుదాసు ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ ప్రధాన రోడ్డులో కొన్నేండ్లుగా చెత్త కుప్పలు పడుతుండడంతో స్వచ్ఛ ఆటో డ్రైవర్ శ్రీను సహకారంతో సీసీ కెమెరా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.బహిరంగ ప్రదేశాల్లో, ప్రధాన రహదారుల పక్కన ఎవరూ చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ సిబ్బందికి సూచించారు. ప్రజలు ఇంట్లోని చెత్తను స్వచ్ఛ ఆటోలకే వేయాలని కోరారు. అనంతరం తన సొంత ఖర్చులతో సీసీ కెమెరా, మైక్‌ను ఏర్పాటు చేసిన శ్రీనును కార్పొరేటర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ శానిటేషన్ సుపర్వైజర్ సుదర్శన్, జవాన్ యాదగిరి , సాయి గోవర్ధన్ రెడ్డి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్‌లో కాలబైరవ స్వామి బ్రహ్మోత్సవాలు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్
ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే అవుట్‌లోని శ్రీ స్వయంభు కాలభైరవ దేవాలయ బ్రహ్మోత్సవాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఇతర నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. స్వయంభు కాలభైరవ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుపుతున్నారని ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. స్వామివారి ఆశీస్సులు ఉప్పల్ ప్రజలందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రొయ్యల కృష్ణమూర్తికి కాంగ్రెస్ నాయకుల నివాళ్లు..



నవతెలంగాణ-నేరేడ్‌మెట్
సీపీఐ రాష్ట్ర సమితి మాజీ సభ్యులు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి మూడు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించారు. ఆదివారం మౌలాలి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్, నాయకులు వెంకటేష్, మంద భాస్కర్, చందు, ఎల్లం, బీసీ నాయకులు ఐలేష్, నరసింహ గౌడ్, తదితరులు మౌలాలి డివిజన్‌లోని భరత్ నగర్‌లో కృష్ణమూర్తి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కృష్ణమూర్తికి ఎమ్మెల్యే కూనంనేని నివాళి..




రొయ్యల కృష్ణమూర్తికి సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు





సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి రోహిత్



- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

నవ తెలంగాణ-మేడ్చల్
విద్యార్థులకు సంపూర్ణ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. నిబద్ధతను ప్రతిబింబించే ప్రతిభ, సృజనాత్మకత, క్రమశిక్షణ విద్యార్థులు కలిగిఉండాలని, వ్యక్తిగత, సామాజిక అభివృద్ధికి విద్య మూలస్తంభంని తెలిపారు. హైదరాబాద్ శివార్‌లోని దూలపల్లి డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ 22వ వార్షికోత్సవం అభ్యుదయ పేరుతో ఆదివారం నిర్వహించారు. స్కూల్ క్యాంపస్‌లో జరిగిన ఈ వార్షికోత్సవంలో స్కూల్ పూర్వ విద్యార్థి, యువ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర బహుముఖమైనదన్నారు. విద్యార్థులు ఒక దేశం యొక్క భవిష్యత్తు నాయకులు, ఆవిష్కర్తలు, మార్పును సృష్టించేవారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ విద్యార్థులకు అకడమిక్‌తో పాటు కో-కరిక్యులర్ విభాగాల్లో సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసి పలువురు టీచర్లను సన్మానించి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులచే ఆర్కెస్ట్రా, ఫ్యూజన్ డ్యాన్స్, చిన్నారుల అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఉత్రూతలూగించింది.క్యాంపస్ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల పెయింటింగ్ ప్రదర్శన పలువురును ఆకట్టుకుంది.వీరితో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, డీఆర్ఎస్ ఐఎస్ చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్లు అంజనీ కుమార్ అగర్వాల్,సంజయ్ కుమార్ అగర్వాల్, గార్వ్ అగర్వాల్, ప్రిన్సిపాల్ షణ్ముగం పరమశివాన్,వైస్ ప్రిన్సిపాల్ డా.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక సేవలు అభినందనీయం



- సోషల్ వర్కర్ ఏవీఎస్ మూర్తి, ఎన్ఆర్ఐ డి.బి.శాస్త్రీ
- జేవీవీ మెడికల్ క్యాంపు విజయవంతం

నవతెలంగాణ - చర్లపల్లి
సమాజంలో మూఢనమ్మకాలతో పాటు, విద్యార్థుల్లో సృజనాత్మక కార్యక్రమాల నిర్వహిస్తూ, పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక సేవలు అభినందనీయమని సోషల్ వర్కర్ ఏవీఎస్ మూర్తి, ఎన్ఆర్ఐ డి.బి.శాస్త్రీ అన్నారు. జన విజ్ఞాన వేదిక కాప్రా, కీసర, మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో 102వ ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం చక్రిపురంలోని చక్రి విద్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సోషల్ వర్కర్ ఏవీఎస్ మూర్తి, ఎన్ఆర్ఐ డి.బి.శాస్త్రీలు మాట్లాడుతూ.. అనేక మంది పేదలు, బీపీ, షుగర్, వంటి వ్యాధులకు కూడా వేలకు వేలు రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న జనవిజ్ఞాన వేదికకు అభినందనలు అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజానీకంలో శాస్త్ర విజ్ఞాన ప్రచారం, శాస్త్రీయ ఆలోచనా ధృక్పథం పెంపొందించడానికి కృషి చేస్తూ, మూఢ నమ్మకాలు, ఛాందస భావాలను అరికట్టేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక మండల కమిటీల కృషిని కొనియాడారు. అనంతరం డాక్టర్లచే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు, మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్నీ, మెడికల్ క్యాంపు కన్వీనర్ జి.కరుణాకర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, వాలంటీర్లు సోమయ్య చారి, శ్రవణ్ కుమార్, ఎం.ఎల్.చౌదరి, నాగేశ్వర్ రావు, వెంకటరమణ, నవీన్ యాదవ్, రుక్మిణి, వెంకట్రామయ్య డాక్టర్లు జయరాజ్, విద్యాసాగర్, దేవిక వాలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



- మల్లాపూర్ శక్తి సాయినగర్ పార్క్‌లో కన్నెస్వామి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ

నవతెలంగాణ - చర్లపల్లి
మల్లాపూర్ శక్తి సాయినగర్ పార్క్‌లో కన్నె స్వామి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడి పూజ అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో మహా పడిపూజలో పాల్గొని ఎంతో ఉత్సాహంగా పెటేతులై ఆడారు. ఈ సందర్భంగా కన్నె స్వామి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప మాల ధరించడం అంటే జన్మ జన్మల పుణ్యఫలం అని అన్నారు. స్వామివారి ఆజ్ఞ లేనిది ఏది కూడా జరగదన్నారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని సూచించారు. అయ్యప్ప స్వాములు భజన మండలి ఆధ్వర్యంలో పాడిన అయ్యప్ప భక్తి పాటలు మంత్ర ముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరెడ్డి, వసంత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం

- మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్



నవతెలంగాణ-శామీర్‌పేట
ప్రజా పాలనలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ అన్నారు. ఉద్దెమర్రి శ్రీ విష్ణు శివాలయం అభివృద్ధికి దేవాదాయ ధర్మదాయ శాఖ తరపున రూ.50 లక్షలు మంజూరు చేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ కమిటీ తరపున కృతజ్ఞత తెలిపారు. ఆదివారం మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రిలోని శ్రీవిష్ణు శివాలయంలో (అక్కన్న మాదన్న దేవాలయం) ఆయన మాట్లాడుతూ.. శ్రీ విష్ణు శివాలయం ఆలయ కమిటీ నూతన పాలక వర్గం ప్రమాణస్వీకారోత్సవానికి విచ్చేసిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌కు అలయ కమిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం ఇచ్చామని గుర్తు చేశారు. సానుకూలంగా స్పందించిన వజ్రేష్ యాదవ్ సకాలంలో ఆలయానికి రూ.50 లక్షలు మంజూరు చేయడానికి కృషి చేశారని తెలిపారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం దేవస్థాన కమిటీ చైర్మెన్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఆలయానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడానికి కృషి చేసిన తోటకూర వజ్రేష్ యాదవ్ కు రుణపడి ఉంటామన్నారు. ఈ నిధులతో ఆలయ రాజగోపురం నీరాలి మండపం, స్వామి వారి పుష్కరిని, పుష్కరఘాట్ నిర్మాణం చేపడుతామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దోసకాయల వెంకటేష్, పట్టా బాల్ నర్సింహా, ఆలయ కమిటీ సభ్యులు బూడిద రవీందర్ గౌడ్, సామల రాజిరెడ్డి, బురిగళ్ళ రమేష్,పార్టీ నాయకులు విష్ణుగౌడ్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకటగిరిప్రసాద్, తునికి వెంకటేష్, గోపిరెడ్డి, శ్రీధర్ చారి, సత్యనారాయణ, శేఖర్, సుధాకర్, ఆలయ పూజారీ త్రిగుళ్ల వెంకటేశ్వర పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ గురుదత్త పాదుక పూజ



నవతెలంగాణ - చర్లపల్లి
శ్రీ గురు దత్తపాదుక అభిషేకం హెూమము అనఘ వ్రతం పూజ కార్యక్రమం చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ లక్ష్మి నరసింహాస్వామి కాలనీ లోని డా.కె.శ్రీనివాస్ నివాసంలో ఆదివారం మార్గశిర బహుళాష్టమి సందర్భంగా దత్త పాదుక పూజ, దత్త హెూమం, అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. అనంతరం సాయంత్రం సత్యన్నా రాయణ వ్రతం నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరుసటి రోజు నేరుగా శ్రీ క్షేత్ర వల్లభాపురం కురుగడ్డి కర్ణాటకకు వెళ్ళనున్నాయని తెలిపారు. ఈ మార్గశిర మాసంలో ప్రసిద్ధ క్షేత్రమైన గిరినార్ శిల యొక్క దత్త పాదుకలు నేరుగా గాణగాపురం, పితాపురం, అరుణాచలం, మాహుర్గడ్, అనేక ప్రసిద్ధమైన ఆలయాల్లో మరియు దత్త క్షేత్రాలలో దర్శనమిస్తూ నేరుగా శబరి మల అయ్యప్ప క్షేత్రంలో పూజలందుకొని తరువాత కుషాయి గూడలోని డాక్టర్ శ్రీనివాస్ ఇంటికి చేరుకోనున్నాయని, ఇక్కడ అభిషేకాలు పూజలు అందుకని 23 ఉదయం మరల గాణగాపురం తిరిగి వెళ్లి అనేక ప్రసిద్ధ క్షేత్రాలను దర్శనమిస్తూ శ్రీశైలం కదలివనంలో ప్రతిష్ఠింపబడుతాయి అన్నారు.

కత్తి ప్రసన్న కుమారికి అభినందనలు తెలిపిన వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-మేడ్చల్
మేడ్చల్‌కు పట్టణానికి చెందిన కత్తి ప్రసన్నకుమారి ఇండియా తరపున ఇంటర్నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ ఎంపిక కావడం సంతోషకరమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రష్ యాదవ్ అన్నారు. ఆదివారం మేడ్చల్ నియోజకవర్గ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పానుగంటి మహేష్ ఆధ్వర్యంలో మేడ్చల్ తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో కత్తి ప్రసన్నకుమారి త్రోబాల్ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం దేశానికి గర్వకారణం అన్నారు. ఈ నెల డిసెంబర్ 24నుండి 28వరకు జరగబోయే ఇండియా త్రోబాల్ పోటీలో ఆడేందుకు తమిళనాడులోని ఉసురు జిల్లాకు వెళ్తున్నందుకు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రసన్న గతంలో కూడా నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడి ఎన్నో పథకాలు సాధించిందని పానుగంటి మహేష్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ జట్టు కెప్టెన్‌గా కూడా వ్యవహరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దండు శ్రీకాంత్,నాయకులు కుండ భానుచందర్,శ్యామ్ రావు, కుండ ప్రవీణ్ కుమార్, కొమ్ము రాజు, వినయ్, స్టాలిన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

యువత చూపు బిజెపి వైపు: ఎంపీ ఈటల రాజేందర్



నవతెలంగాణ-శామీర్‌పేట
మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై యువత బీజేపీ వైపు చూస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మేడ్చల్ రూరల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ హకింపేట్-సింగాయపల్లి గ్రామ యువత ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో మిద్దే ఆశిష్, ఆకాశ్, మేఘరాజ్, ప్రభంజన్, దీపక్, అక్షయ్, సావన్, విశాల్, రోహిత్, ప్రభాకర్, ప్రణయ్, కళ్యాణ్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్ హైమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుమంత్ పుట్టినరోజు సందర్భంగా దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-కాప్రా,చర్లపల్లి
కుషాయిగూడ వైష్ణవి ఎంక్లేవ్‌కు చెందిన బజరంగ్ దళ్ నాయకుడు, సామాజిక కార్యకర్త సుమంత్ ముప్ప 29వ పుట్టినరోజు సందర్భంగా నగరంలో పెరుగుతున్న చలి, పొగమంచుతో బాధపడుతున్న యాచకులు, అనాథలు, గాంధీ ఆస్పత్రిలోని రోగుల సహాయకులకు ముప్పా సుమంత్ యువసేన సభ్యులు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. రాత్రి 10 నుంచి 2 గంటల వరకు సికింద్రాబాద్, తార్నాక, బన్సీలాల్ పేట్ తదితర ప్రాంతాలలో సంచరిస్తూ రైల్వే స్టేషన్, బస్టాండ్, ఫుట్ పాత్, మార్కెట్, గుడిసెల్లో నివసించే పేదలకు 300కుపైగా రగ్గులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ కండోజు, సంతోష్ ముప్పా, రాహుల్ గౌడ్, అర్జున్, ప్రవీణ్, శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకుంట అంగన్వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు





నవతెలంగాణ - చర్లపల్లి
చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలంటే సంపూర్ణ పౌష్టికాహారం అందించాలని, దీనిపై తల్లిదండ్రులకు సరైన అవగాహన ఉండాలని టీసీడీఎస్ సీడీపీఓ స్వాతి అన్నారు. "ప్రజాపాలన విజయోత్సవలలో భాగంగా" ఎర్రకుంట అంగన్వాడీ కేంద్రంలో ఉప్పల్ సెక్టర్ నాచారం, ఎర్రకుంట అంగన్వాడీ సెంటర్‌లో 20మందికి సామూహిక సీమాంతలు, అన్న ప్రసన్న కార్యక్రమాలను జ్ఞానదీధి సేవట్రస్ట్ సహాయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీసీడీఎస్ సీడీపీఓ స్వాతి సూపర్వైజర్ వెంకటరమణ, అడ్వకేట్ యమున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ స్వాతి మాట్లాడుతూ.. గర్భిణి స్త్రీలకు పోషకాహారం గురించి తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే..



చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లల బరువు గురించి బాధపడుతూ ఉంటారు. 'మా పాప చాలా సన్నగా, బరువు తక్కువగా ఉందండీ.. ఐదేండ్లొచ్చినా రెండేండ్లమ్మాయిలా కనిపిస్తుంది. తన బరువు పెంచాలంటే ఏం చేయాలో తోచట్లేదు.. మీకేమైనా అవగాహన ఉంటే కాస్త చెప్పండీ..' అంటూ ఇరుగుపొరుగు వారిని సలహాలు అడుగుతుంటారు. అయితే కొంతమంది ఇచ్చే అనారోగ్యకర సలహాల వల్ల పిల్లలు బరువు పెరగకపోవడమే కాకుండా, వారి ఆరోగ్యానికీ మంచిది కాదు. కాబట్టి వారిని ఓసారి పోషకాహార నిపుణుల వద్ద చూపించి, బరువు పెరగడానికి నిపుణులు సూచించిన సలహాలను క్రమం తప్పకుండా పాటించాలి. తద్వారా పిల్లలు తక్కువ బరువు నుంచి బయటపడగలిగే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో మరీ తక్కువ బరువున్న పిల్లలు బరువు పెరగాలంటే వారి రోజువారీ అలవాట్లు ఎలా ఉండాలో తెలుసుకుందాం...





కొంతమంది తల్లులు తమ పిల్లలు బరువు తక్కువగా ఉన్నారని టెన్షన్ పడుతూ.. వాళ్లకు ఎలాగైనా ఆహారం తినిపించాలని నిర్ణయించుకుని బలవంతంగా తినిపిస్తుంటారు. ఇలా చేయడం వల్ల తినే ఆహారంపై వారికి ఆసక్తి తగ్గే అవకాశం ఉంటుంది. పైగా ఈ పద్ధతి వల్ల వారు తినకుండా మరింత మొండికేస్తుంటారు. దీనివల్ల వారికి అందాల్సిన పోషకాలు పూర్తిగా అందకుండా పోతాయి. కాబట్టి పిల్లల్ని ఆహారం విషయంలో బలవంతపెట్టకుండా.. వారికోసం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి.. ఏ పదార్థాలు, స్నాక్స్ ఇవ్వాలో ఓ ప్రణాళిక తయారుచేయాలి. దాని ప్రకారం వారికి పోషకాహారం అందించాలి. ఫలితంగా వారికి కావాల్సిన పోషకాలు అంది.. శరీర బరువు పెరిగే అవకాశం ఉంటుంది.



వాటిపైనే ధ్యాసుంటే...

తల్లిదండ్రులు మామూలు సమయాల్లో టీవీ చూడనివ్వట్లేదని, కనీసం తినే సమయంలోనైనా టీవీ చూడచ్చని చాలామంది పిల్లలు ఆనందపడిపోతుంటారు. ఇక ఈ సాకుతో గంటలు గంటలు తినడానికే వృథా చేస్తుంటారు. అయితే ఇలా తినడం వల్ల వారి ధ్యాసంతా ఆహారం మీద కంటే టీవీ మీదే ఎక్కువగా ఉంటుంది. దీంతో ఏం తింటున్నాం? ఎంత తింటున్నాం? అనే విషయాలేవీ వారు పట్టించుకోరు. అందులోని రుచి వారికి తెలియదు. పైగా టీవీలో ఏవైనా ఆవేశపూరిత సన్నివేశాలొస్తే అవి వారి తిండి మీద, మనసు మీద ప్రభావం చూపుతాయి. ఇలాంటి ఆటంకాల వల్ల వారు ఆహారం తీసుకోవడంపై మనసు లగ్నం చేయకపోవడం వల్ల కూడా బరువు తగ్గే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి పిల్లలు తినే సమయంలో టీవీ ఆఫ్ చేసేయడం, మొబైల్స్, కంప్యూటర్, ల్యాప్‌టాప్స్.. వంటి గ్యాడ్జెట్లు వారికి దూరంగా ఉంచడం.. వంటివి చేయాలి. అలాగే వీటిపైకి మనసు మళ్లకుండా ఉండాలంటే తల్లిదండ్రులు పక్కనే కూర్చొని పిల్లలు తినే ఆహార పదార్థాలపై వారికి అవగాహన కల్పించాలి. దానికి తగినట్టుగానే ఆహారం రంగు, రుచి, వాసన ఉండేలా చూసుకోవాలి. తద్వారా వారిలో ఆహారం పట్ల ఆసక్తి కూడా పెరుగుతుంది.

క్యాలరీలూ ఆరోగ్యకరంగానే..

పిల్లలు తక్కువ బరువు నుంచి బయటపడాలంటే.. ముందుగా వారికి ఎక్కువ క్యాలరీలుండే ఆహారపదార్థాలు అందించాలి. అలాగని కేకులు, స్వీట్లు, పిజ్జా, బర్గర్లు.. వంటివి పెట్టమని కాదు దానర్థం. చిక్కటి పాలు, మీగడ పెరుగు, ఆహారంలో భాగంగా నెయ్యి.. వంటి పదార్థాలతో పాటు విటమిన్లు, ఖనిజాలు అధికంగా లభించే పండ్లు, కూరగాయల్ని కూడా వారి రోజువారీ ఆహారంలో భాగం చేయాలి. దీనిపై సరైన అవగాహన లేకపోతే సంబంధిత పోషకాహార నిపుణులను సంప్రదించి వారు సూచించే ఆహారాన్ని పిల్లలకు రోజూ అందివ్వాలి.

ఈ విటమిన్లూ ముఖ్యమే

ఆరు నెలల నుంచి ఐదేండ్ల వయసులో ఉన్న పిల్లలకు పూర్తిస్థాయి పోషకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఎ, సి, డి విటమిన్లను చుక్కల రూపంలో అందిస్తోంది. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా సరిగ్గా ఆహారం తీసుకోని పిల్లలకు ఇవి బాగా ఉపయోగపడతాయి. వీటివల్ల పిల్లల ఎదుగుదల, బరువు పెరగడానికి.. కావాల్సిన విటమిన్లు, ఖనిజాలు వారికి అందుతాయి. కాబట్టి బరువు తక్కువగా ఉన్న పిల్లల శరీర బరువు పెంచేందుకు నిపుణుల సలహా మేరకు వీటిని పిల్లలకు అందించడం శ్రేయస్కరం.

ఎప్పటికప్పుడు..

వయసు, ఎత్తు.. వంటి ఆధారంగా బరువును నిర్ణయిస్తారు. కాబట్టి ముందుగా నిపుణులను సంప్రదించి వారి ఎత్తు, వయసు ప్రకారం వారు ఎంత బరువుండాలో తెలుసుకోవాలి. తర్వాత వారు అందించే సూచనలు పాటిస్తూ పిల్లల బరువును క్రమంగా పెంచాలి. దీనివల్ల ఎప్పటికప్పుడు వారు ఎంత బరువు పెరుగుతున్నారు? ఒకవేళ ఉండాల్సిన దానికంటే బరువు ఎక్కువైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. తక్కువైతే పెంచాల్సిన మార్గాలు.. వంటి విషయాలన్నింటిపై తల్లిదండ్రులకు మంచి అవగాహన ఉంటే మంచిది. కాబట్టి తక్కువ బరువు నుంచి వారిని బయటపడేయాలంటే ఇలా ఎప్పటికప్పుడు వారి బరువును చెక్ చేస్తూ తగిన జాగ్రత్తలు పాటించడం ముఖ్యం.

తక్కువ బరువున్న పిల్లల్ని ఆ సమస్య నుంచి బయటపడేయాలంటే తల్లిదండ్రులు దృష్టిలో ఉంచుకోవాల్సిన అంశాలేంటో తెలుసుకున్నారు కదా! మరి మీరు కూడా మీ పిల్లల విషయంలో ఇవన్నీ పాటించి వారి శారీరక ఆరోగ్యానికి తోడ్పడండి.

అభిరుచికి దూరమయ్యారా..?



చాలామంది అమ్మాయిలు పెళ్లయ్యాక తమ అభిరుచులను, వ్యాపకాలను, స్నేహితులను, కొన్ని అలవాట్లనీ వదిలేసుకుంటారు. దానికి కారణాలు ఎన్నైనా ఉండొచ్చు. దీంతో తామేదో కోల్పోతున్నామనే వెలితి వారిని వెంటాడుతుంది. అలాంటి ఒత్తిడికి దూరంగా ఉండాలంటే ఇలా చేయొచ్చు.

– ఓ మంచి స్నేహ బంధాన్ని కొనసాగించడానికి వారు మీ క్లాస్‌మేట్స్, పక్కింటివారో అయి ఉండాల్సిన అవసరం లేదు. అత్త, ఆడపడుచు, చెల్లి... ఇలా ఎవరికైనా ఆ స్థానాన్ని ఇవ్వొచ్చు. మీరే ఒక అడుగు ముందుకేసి మీ బంధాన్ని బలపరుచుకోండి. ఒంటరితనం దూరమవుతుంది.

– పెండ్లయ్యాక మీకిష్టమైన వ్యాపకాలను వదిలేసుకున్నాం అని భావించక్కర్లేదు. సాంకేతికత మీ ఇంటి ముందుకు అలాంటి అవకాశాలెన్నో తెచ్చిపెడుతుంది. ఇందుకోసం సామాజిక మాధ్యమాల వేదికగా ఎన్నో గ్రూపులు ఉన్నాయి. ఉదాహరణకు మీకు వంటలంటే ఇష్టమనుకోండి. మీ అభిరుచులకు దగ్గరగా ఉన్న పోస్టులను గమనించి ఆ బృందంలో సభ్యురాలిగా చేరండి. కొత్త విషయాలెన్నో తెలుస్తాయి. తోటపని ఆసక్తి అయితే గార్డెనింగ్ నెట్‌వర్క్‌లో చేరి మెలకువలు నేర్చుకోండి. మీరు పెంచిన మొక్కలనీ, వాటి ప్రత్యేకతల్నీ వారితో పంచుకోండి. మనసు తేలికపడుతుంది.

– వివాహమయ్యాక స్నేహితులందరికంటే వెనకబడిపోయాం అని భావిస్తారు చాలామంది అమ్మాయిలు. అసలు అలాంటి బెంగే అక్కర్లేదు. అంతర్జాలమే ఆధారంగా ఎప్పటికప్పుడు మీ చదువు, హాబీలకు సంబంధించిన వ్యాపకాల్ని సానబెట్టుకునే అవకాశం కల్పిస్తున్నాయి అనేక సంస్థలు. ఇంట్లోనే ఉండి మీకు నచ్చిన అంశాన్ని ఎంచుకుని వాటిపై దృష్టిపెట్టండి. ఉదాహరణకు ఓ కొత్త భాష లేదా కొత్త కోర్సు నేర్చుకోండి. ఇవన్నీ మీలో ఉత్సాహాన్ని నింపుతాయి.

ఇట్ల చేద్దాం



పూరీ పిండిని నీళ్లతో బదులు, పాలతో తడిపితే మృదువుగా, రుచిగా వస్తాయి.



అప్పటికప్పుడు కూరలో గ్రేవీ చిక్కబడాలంటే జీడిపప్పు పొడి, కొద్దిగా పాలు పోసి కలిపితే సరిపోతుంది.

అల్లు అర్జున్ ఇంటివద్ద ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పలువురు ఆందోళన కారులను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఓయూ జేఏసీ నాయకులను వెంటనే విడుదల చేయాలి : భీంరావ్ నాయక్

అల్లు అర్జున్ ఇంటి ముందు ధర్నా చేసిన ఓయూ జేఏసీ నాయకులు రెడ్డి శ్రీను, బైరు నాగరాజ గౌడ్, బోనాల నాగేష్‌ను వెంటనే విడుదల చేయాలని ఓయూ జేఏసీ నేత భీమ్ రావు నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లేని పక్షంలో రేపటి నుంచి రాష్ట్రంలో అల్లు అర్జున్ సినిమా పుష్ప-2 ఏ థియేటర్‌లో నడిచినా అడ్డుకుంటామని హెచ్చరించారు. రేవతి చనిపోయి దాదాపు 15 రోజులు అవుతున్నా కనీసం వాళ్ళ కుటుంబానికి ఆర్థిక నష్టపరిహారాన్ని ప్రకటించలేదని అసహనం వ్యక్తం చేశారు. చట్టం తన పని తాను చేసుకుంటూ అల్లు అర్జున్‌ను రిమాండ్ చేస్తే.. కేటీఆర్, కవిత, హరీశ్‌రావు.. అల్లు అర్జున్‌పై ప్రేమ చూపడం సిగ్గుచేటని తెలిపారు.

తైవాన్‌కు సైనిక సాయాన్ని ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాదేశిక సమగ్రతను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటుందని ప్రతినిధి చెప్పారు.ఇదిలావుండగా తైవాన్ వ్యవహారాలను చూసే చైనా విదేశాంగశాఖ విభాగం ప్రతినిధి జు ఫెంగ్లిన్ మాట్లాడుతూ, "తైవాన్ స్వాతంత్ర్యం" వేర్పాటువాద కార్యకలాపాలు, విదేశీ జోక్యం తైవాన్ జలసంధిలో శాంతికి పెద్ద ముప్పు అని పేర్కొన్నారు. తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేయడాన్ని అమెరికా వెంటనే ఆపాలని, తైవాన్ అంశంపై అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని చైనా కోరుకుంటోందని అన్నారు. అమెరికా మిలిటరీ బలగాలపై ఆధారపడి 'తైవాన్ స్వాతంత్ర్యం' సాధించాలనుకుంటున్న డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ అథారిటీకి కూడా ఇదే హెచ్చరిక చేస్తున్నామన్నారు. ఈ నెల ప్రారంభంలో, తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేయాలన్న నిర్ణయానికి ప్రతిగా 13 అమెరికన్ మిలిటరీ కంపెనీలపైనా, అలాగే ఆరుగురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లపైన చైనా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.

తిప్పలు తీరేదెట్లా...

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. తమ పిల్లల పెండ్లిళ్లు, వారి ఉన్నత చదువుల కోసం జీపీఎఫ్, గ్రాడ్యుటీ ఉపయోగపడుతుందని భావించిన పలువురు రిటైర్డ్ ఉద్యోగులు... చెక్కులు, టోకెన్లు విడుదలైనా డబ్బులు తమ ఖాతాల్లో పడటం లేదని వాపోతున్నారు. ఆర్థిక పరిస్థితి సంక్లిష్టంగా ఉన్నప్పటికీ ఇలాంటి చిన్న బిల్లులనైనా చెల్లించటం ద్వారా ఆయా బాధితులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. మరోవైపు వివిధ ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాలకు రేషన్ బియ్యం సరఫరా, వివిధ భవనాలకు అద్దెల చెల్లింపులు కూడా సమస్యాత్మకంగానే ఉన్నాయి. ఇందుకు సంబంధించి ఒక్కో కాంట్రాక్టరుకి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చెల్లించాల్సి ఉందని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. ఇవన్నీ ప్రస్తుతం పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

ఏడాది కాలంలో అప్పుల పరిస్థితి ఇదీ...

(మొదటిపేజీ తరువాయి)

సంస్థల పేరిట మరో రూ.70 వేల కోట్ల రుణాలున్నాయి. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులకు, వడ్డీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీనెలా కిస్తీలు కడుతుండటం మంచిపరిణామమే. ఇదే సయమంలో పౌర సరఫరాల కార్పొరేషన్, విద్యుత్ సంస్థలకు ఉన్న రుణాలను దశలవారీగానైనా చెల్లించాలనీ, లేదంటే ముున్ముందు ఆయా సంస్థలకు ఇబ్బందులు తప్పబోవని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బకాయిలు, చెల్లింపులు, అప్పులపై ప్రజలకు భరోసా కల్పించాలంటే ప్రభుత్వం తక్షణమే నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించాలి. మరో రెండున్నర నెలల్లో 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించాల్సిన తరుణంలో ఇందుకనుగుణంగా సర్కారు అడుగులేయాల్సి ఉంది. కొత్త సంవత్సరంలో జనవరి నుంచే వివిధ శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు, సంబంధిత సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశంలో ఏ రకంగా ముందుకెళుతుందనేది ఆసక్తికరంగా మారింది.

సంధ్య థియేటర్ ఘటనపై న్యాయ సలహా తీసుకుని ముందుకెళ్తాం

(మొదటిపేజీ తరువాయి)

మీడియా అడిగిన ప్రశ్నలకు సీపీ సమాధానమిచ్చారు. ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంధ్య థియేటర్ సంఘటనలో బౌన్సర్లు చేసిన ఓవర్ యాక్షన్‌ను తీవ్రంగా ఖండించారు. అల్లుఅర్జున్ వచ్చిన సమయంలో బౌన్సర్లు ప్రేక్షకులతోపాటు పోలీసులను సైతం నెట్టడాన్ని తీవ్రంగా పరిగణించారు. బౌన్సర్లు ఇకపై పోలీసులను ముట్టుకున్నా, మిస్ బిహేవ్ చేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దీనిపై పూర్తి బాధ్యత సప్లయ్ ఏజెన్సీలదేనన్నారు. పోలీసులు యూనిఫామ్‌లో ఉండగా ఎలా తోసివేస్తారని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బంది గురించి ఆలోచించే బాధ్యత కూడా వీఐపీలదే అని స్పష్టం చేశారు. వీఐపీలు, వీవీఐపీలతో ప్రముఖులతో వచ్చే బౌన్సర్లు అతిగా ప్రవర్తిస్తే వీఐపీలు, వీవీఐపీలే బాధ్యత తీసుకోవాల న్నారు. బౌన్సర్లపై ఏజెన్సీలపై కేసులు నమోదు చేస్తామని, మరోసారీ ఓవర్



యాక్షన్ చేస్తే తాటతీస్తానని హెచ్చరించారు.

సినిమా చూశాకే అల్లు అర్జున్ వెళ్తానన్నారు: చిక్కడపల్లి ఏసీపీ


హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్‌లో ఇటీవల జరిగిన ఘటనపై పోలీసులు సెన్సేషనల్ వీడియోను విడుదల చేశారు. సంధ్య థియేటర్ వద్ద డిసెంబరు 4న రాత్రి ఏం జరిగిందనే విషయాన్ని చిక్కడపల్లి ఏసీపీ రమేశ్ కుమార్ మీడియాకు వివరించారు. అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌ని కలిసి తొక్కిసలాటలో మహిళ చనిపోయారని, బాలుడు తీవ్రంగా గాయపడ్డారని, పరిస్థితి అదుపుతప్పింది.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించామని, అయినా మేనేజర్ తమను అల్లు అర్జున్ వద్దకు వెళ్లనీయలేదని తెలిపారు. అక్కడి నుంచి అల్లు అర్జున్ వెళ్లకపోతే పరిస్థితి చేయి దాటిపోతుందని చెప్పామని, అయినా కూడా ఆయన స్పందించలేదని అన్నారు.

దాంతో అతి కష్టం మీద వారిని నెట్టుకుంటూ వెళ్లి జరిగిన విషయం అల్లు అర్జున్‌కు చెప్పామని, మీకు అధికారులంతా సహకరించి రూట్ క్లియర్ చేశారని, దయ చేసి ఇక్కడి నుంచి ఖాళీ చేయండి అని చెప్పామని, అయినా కూడా సినిమా చూసిన తర్వాతే వెళ్తానని అర్జున్ చెప్పారని తెలిపారు. వెంటనే డీసీపీకి సమాచారం ఇవ్వడంతో డీసీపీతోపాటు తాము లోపలికి వచ్చి 10 నిమిషాలు సమయం ఇచ్చామని, ఆ తర్వాత అల్లు అర్జున్‌ను బయటకు తీసుకొచ్చామని ఏసీపీ అన్నారు. ఆ మహిళ మృతి చెందడం తనను ఎంతో కృంగదీసిందని, ఆ సంఘటన ఇంకా కండ్లముందే కదలాడుతోందని చిక్కడపల్లి ఎస్‌హెచ్‌వో రాజునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.

పౌరుల భద్రత, రక్షణే మాకు ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కొత్తపల్లిలో నిర్మించిన భరోసా కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంధ్య థియేటర్ ఘటనపై డీజీపీ స్పందించారు. సమాజంలో శాంతిభద్రతలు పరిఢవిల్లాలంటే పౌరులు బాధ్యతా యుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సినీ ప్రమోషన్ కంటే పౌరుల భద్రత, రక్షణే తమకు ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరమని, అల్లు అర్జున్‌కు తాము వ్యతిరేకం కాదని.. చట్ట ప్రకారం ఆయనపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల భద్రత కంటే సినిమా ప్రమోషన్ ముఖ్యమైన అంశం కాదని అన్నారు. ఇలాంటి ఘటనలు జరగటం సమాజానికి ఏమాత్రం మంచిది కాదని తెలిపారు. జర్నలిస్టుపై దాడి ఘటనలో సినీ నటుడు మోహన్‌బాబుపై కేసు నమోదు చేశామని, ఈ విషయంలో చట్టపకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు, పిల్లల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని అన్నారు. అందువల్లనే ప్రతి



జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 20 ఎస్పీ కార్యాలయాలు, మరో తొమ్మిది కమిషనరేట్లు ఉన్నాయని, ఇప్పటివరకు 27 భరోసా కేంద్రాలను ప్రారంభించినట్టు చెప్పారు. కరీంనగర్‌లో భరోసా కేంద్రాన్ని నిర్మించేందుకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ నిధులను వెచ్చించి దాదాపు 6,800 చదరపు అడుగుల భవనాన్ని నిర్మించిందని వివరించారు. ఐజీ రమా రాజేశ్వరితో కలిసి భవనాన్ని ప్రారంభించిన డీజీపీ భరోసా కేంద్ర సేవలను వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రంలో నక్సలిజం లేదని తాము భావించడం లేదని, ఇక్కడివారు పొరుగు రాష్ట్రాల్లో నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు.

సింగరేణి పూర్తిస్థాయి సీఎమ్‌డీగా బలరాం నాయక్?

- డిప్యూటేషన్‌ను మరో ఏడాది పొడిగించిన కేంద్రం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



సింగరేణి కాలరీస్‌కు పూర్తిస్థాయి సీఎమ్‌డీగా ఎన్ బలరాంనాయక్‌ను నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఆయన డిప్యూటేషన్‌పై సింగరేణి ఇంచార్జి సీఎమ్‌డీగా పనిచేస్తున్నారు. డిప్యూటేషన్ కాలపరిమితి ముగియడంతో తాజాగా మరో ఏడాది పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. త్వరలో దీనికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. అదే సమయంలో ఆయన్నే పూర్తిస్థాయి సీఎమ్‌డీగా ప్రకటించే అవకాశం కూడా ఉన్నట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బలరాం సీఎమ్‌డీగా వ్యవహరిస్తున్నారు. అంతకుముందు అదే పదవిలో సుదీర్ఘకాలం ఎన్ శ్రీధర్ పనిచేసిన విషయం తెలిసిందే. బలరాం నాయక్ తెలంగాణ గిరిజన బిడ్డ. ఐఆర్ఎస్ కేడర్‌కు చెందిన ఆయన ఐదేండ్లుగా సింగరేణి సంస్థలో వివిధ హోదాల్లో చేసిన సేవలు, చూపిన ప్రతిభ, కనబరిచిన పురోగతి దృష్ట్యా ఆయన్నే పూర్తి స్థాయి సీఎమ్‌డీగా నియమించనున్నారు.

సినీ ప్రముఖుల ఇండ్లపై దాడులకు సీఎం ఖండన

హైదరాబాద్: సినీ ప్రముఖుల ఇండ్లపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర డీజీపీ, నగర పోలీస్ కమిషనర్‌ను ఆదేశించినట్టు తెలిపారు. ఈ విషయంలో అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ ఘటనతో సంబంధంలేని పోలీసు సిబ్బంది, ఉన్నతాధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు.

ఈసీ సమగ్రతకు ప్రణాళికాబద్ధమైన హాని

(మొదటిపేజీ తరువాయి)

చేయటానికి మోడీ ప్రభుత్వ క్రమబద్ధమైన కుట్రలో భాగమని ఆరోపించారు. ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి అని కూడా ఖర్గే ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈసీని నిర్వీర్యం చేయటానికి మోడీ గతంలో ఎన్నికల కమిషనర్లను నియమించే సెలక్షన్ ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించారని గుర్తు చేశారు. "ఇప్పుడు వారు చేసే కుట్రలు బయటకు రాకుండా మార్పులు చేస్తున్నారు. ఓటర్ల పేర్లు తొలగింపు, ఈవీఎంలలో పారదర్శకత లేకపోవటం వంటి అక్రమాల గురించి మేం ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఈసీ స్పందించలేదు. ఇప్పుడు కేంద్రం చేస్తున్న కుట్రలు బయటకు రాకుండా చేసేందుకు పోలింగ్‌కు సంబంధించిన సీసీ ఫుటేజీని, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. వీటిని బట్టి చూస్తే ఈసీ తన స్వతంత్రతను కోల్పోతున్నదని వెల్లడవుతున్నది" అని ఖర్గే అన్నారు. సీసీటీవీ కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఫుటేజీలతో పాటు అభ్యర్థుల వీడియో రికార్డింగ్‌ల వంటి కొన్ని ఎలక్ట్రానిక్ పత్రాల విషయంలో ప్రజా తనిఖీని నిరోధించేందుకు ప్రభుత్వం ఎన్నికల నియమావళిలో మార్పులు చేసింది. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సిఫారసు ఆధారంగా, కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ శుక్రవారం ఎన్నికల నియమావళి, 1961లోని రూల్ 93(2)(ఏ)ను సవరించింది.

ఎన్నికల నిబంధనలకు సవరణలు తగవు

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. 'ఎన్నికల కమిషన్ ప్రారంభంలో వివిధ రాజకీయ పార్టీలను సంప్రదించింది. మరింత పారదర్శకత కోసం ఎలక్ట్రానిక్ రికార్డులు పొందే అవ కాశాన్ని పార్టీలు, అభ్యర్థులకు కల్పించింది. ఇప్పుడు కొత్త నిబంధనలు రూపొందిస్తూ ఎన్నికల కమిషన్‌తో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరిపిందని మీడియాలో వార్తలు వచ్చాయి. అనేక సంవత్సరాల నుండి వస్తున్న సంప్రదాయానికి భిన్నంగా రాజకీయ పార్టీలతో సంప్రదింపులు జరిపేందుకు ఎన్నికల కమిషన్ ఇష్టపడడం లేదు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై తన అభిప్రాయాన్ని తెలియజేసేందుకు పిటిషనర్‌కు ఉన్న హక్కును ప్రశ్నించేలా ప్రభుత్వ వాదన ఉంది. అనుసరించాల్సిన విధానాల విషయంలో రాజకీయ పార్టీల ప్రమేయాన్ని ఈ వైఖరి పూర్తిగా హరించేలా ఉంది' అని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో తెలిపింది. గతంలో త్రిపురలో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో సీపీఐ (ఎం) ఎదుర్కొన్న అనుభవాన్ని గమనిస్తే...రిగ్గింగ్ జరిగిందంటూ పార్టీ చేసిన ఆరోపణల కారణంగా పోలింగ్ కేంద్రాలలో వీడియోగ్రాఫిక్ రికార్డులను పరిశీలించడం జరిగింది. చివరికి రెండు నియోజకవర్గాలలోని దాదాపు సగం పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్‌కు ఆదేశించారు. నేడు ఎన్నికల ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానం అంతర్భాగమై పోయింది. ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వ ప్రయత్నం తిరోగమన చర్యే. కాబట్టి ఎన్నికల నిర్వహణకు సంబంధిం చిన నిబంధనలకు ప్రతిపాదించిన సవరణలను వెంటనే ఉపసంహరిం చుకోవాలని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది.

'రైతు భరోసా' మోసాన్ని ఎదిరించండి

(మొదటిపేజీ తరువాయి)

రూ.7,500 కోట్లకు ఎగనామం పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన రైతు భరోసాను డిసెంబర్ 9న చెల్లిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఏడాది గడిచినా అడుగు ముందుకు వేయలేదనీ, ఇప్పుడేమో మళ్లీ సంక్రాంతి తర్వాత అంటూ దాటవేస్తోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను రైతు భరోసాపై నిలదీయాలని పిలుపునిచ్చారు. రుణమాఫీ విషయంలోనూ రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. రూ.28 వేల కోట్ల రుణమాఫీ, రూ.73 వేల కోట్ల రైతుబంధు మొత్తంగా బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రూ.లక్ష కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని చెప్పారు. "రైతుబంధు లబ్దిదారుల్లో 80 శాతం దళిత, గిరిజన, బహుజన రైతులే వున్నారు. పదెకరాల పైబడి వున్న రైతులు 1.3 శాతం మంది మాత్రమే. వాస్తవాలను కప్పిపుచ్చి రైతుబంధు మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు! పంట పెట్టుబడి రైతు హక్కు. రైతుకు ఏమిచ్చినా, ఎంతిచ్చినా తక్కువే! విత్తు వేసిన నాటి నుంచి పంట అమ్మేదాకా భరోసా లేదు. రాష్ట్రంలో 47 శాతం మందికి ఉపాధినిచ్చే పెద్ద పరిశ్రమ వ్యవసాయం! రైతులు, రైతు కూలీల బతుకు బాగుండాలంటే వ్యవసాయానికి సబ్సిడీలు ఇవ్వాలి" అని కేటీఆర్ లేఖలో డిమాండ్ చేశారు.

యువ చాంపియన్

అండర్-19 మహిళల ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత అమ్మాయిలు | ఫైనల్లో గొంగడి త్రిష సూపర్ షో



కౌలాలంపూర్ (మలేషియా) : మహిళల క్రికెట్‌లోనూ నవతరం అమ్మాయిలు అదరగొట్టారు. తొట్టతొలి మహిలల అండర్-19 ఆసియా కప్ చాంపియన్లుగా అవతరించారు. ఆదివారం కౌలాలంపూర్‌లో జరిగిన టైటిల్ పోరులో బంగ్లాదేశ్ అండర్-19పై భారత అమ్మాయిలు 41 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. అండర్-19 ఆసియా కప్‌ను కైవసం చేసుకున్నారు. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (52, 47 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్) మెరుపు అర్థ సెంచరీతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత అమ్మాయిలు 20 ఓవర్లలో 117/7 పరుగులు చేశారు. ఓపెనర్ కమలిని (5), సానిక (0), కెప్టెన్ నికి ప్రసాద్ (12) సహా ఐశ్వరీ (5) విఫలం అయ్యారు. కానీ మరో ఎండ్‌లో ఓపెనర్ త్రిష అదరగొట్టింది. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో చెలరేగిన త్రిష 47 బంతుల్లోనే 52 పరుగులు పిండుకుంది. టెయిలెండర్లు మిథిల వినోద్ (17), ఆయుశీ (10)ల సహకారంతో భారత్‌కు మంచి స్కోరు అందించింది. ఊరించే ఛేదనలో బంగ్లాదేశ్ అమ్మాయిలు చతికిల పడ్డారు. ఆయుశీ శుక్లా (3/17), సోనమ్ యాదవ్ (2/13), సిసోడియ (2/12) వికెట్ల వేటలో రెచ్చిపోవటంతో బంగ్లాదేశ్ 18.3 ఓవర్లలో 76 పరుగులకే కుప్పకూలింది. చోయ (18), ఫెర్డోస్ (22) మినహా బంగ్లా తరపున మరో బ్యాటర్ రెండెంకల స్కోరు దాటలేదు.

రోహిత్‌కు గాయం?

• ప్రాక్టీస్‌లో మోకాలికి గట్టి దెబ్బ • ఆకాశ్ దీప్‌కు సైతం గాయం

నవతెలంగాణ-మెల్‌బోర్న్

ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్టు సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. మెల్‌బోర్న్‌లో ప్రతికూల ఘటనలను చవిచూస్తున్న టీమ్ ఇండియాకు ఆదివారం నెట్ ప్రాక్టీస్ సెషన్లోనూ అదే పునరావృతం అయ్యింది. మెల్‌బోర్న్ విమానాశ్రయంలో విరాట్ కోహ్లి తన కూతురు ఫోటోలను తీసిన మీడియాతో వాదనకు దిగగా.. శనివారం రవీంద్ర జడేజా భారత మీడియాతో మాట్లాడుతుండగా 'ఇంగ్లీష్'లో సమాధానం ఇవ్వటం లేదని కంగారూ మీడియా గగ్గోలు పెట్టిన సంగతి తెలిసిందే. నెట్స్‌లో సాధన చేస్తుండగా రోహిత్ శర్మ మోకాలు గాయానికి గురవగా, ఆకాశ్ దీప్ మోచేతికి దెబ్బ తగిలింది. రోహిత్ శర్మ, ఆకాశ్ దీప్ గాయం పెద్ద విషయం కాదని టీమ్ మేనేజ్‌మెంట్ వెల్లడించినా.. గ్రౌండ్‌లో రోహిత్ శర్మ మోకాలుకి ఐస్‌ప్యాక్‌తో మర్దన చేసుకోవటంతో అభిమానుల్లో కాస్త ఆందోళన వ్యక్తమైంది.

స్పిన్ ఆడుతూ..

రోహిత్ శర్మ మానసికంగా మిడిల్ ఆర్డర్‌లో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. కెఎల్ రాహుల్ కోసం ఓపెనర్ స్థానాన్ని త్యాగం చేసిన రోహిత్ శర్మ.. అడిలైడ్, బ్రిస్బేన్ టెస్టుల్లో మిడిల్ ఆర్డర్‌లో వస్తున్న సంగతి తెలిసిందే. మెల్‌బోర్న్ నెట్స్‌లో కెఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి సహా శుభ్‌మన్ గిల్ కొత్త బంతితో సాధన చేశారు. మెరుపుతో కూడిన బంతితో పేసర్లను టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఆడుతుండగా.. పక్కనే మరో నెట్స్‌లో రోహిత్ శర్మ స్పిన్ ఆడుతూ కనిపించాడు. ఓ బంతిని తన ఫేవరేట్ పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించగా లో బౌన్స్‌తో అది నేరుగా మోకాలుకు గట్టిగా తగిలింది. వెంటనే ఫిజియో వచ్చి రోహిత్ శర్మ తక్షణ చికిత్స అందించాడు.



మోకాలి గాయానికి ఐస్ ప్యాక్‌తో హిట్‌మ్యాన్

మోకాలు గాయం కావటంతో ఐస్ ప్యాక్‌ను ఉంచి గాయం తీవ్రత తగ్గించేందుకు చూశారు. ఆ తర్వాత సాధారణంగా గ్రౌండ్‌లో తిరుగుతూ, సహాయక సిబ్బందితో మాట్లాడుతూ రోహిత్ శర్మ ఉత్సాహంగానే కనిపించాడు. ఆకాశ్ దీప్ సైతం నెట్స్‌లో బ్యాటింగ్ చేశాడు. అతడు సైతం పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొంటూ చేతి గాయానికి గురయ్యాడు. ఇటువంటి గాయాలు క్రికెట్ సాధారణమని, ఎటువంటి ఇబ్బంది లేదని ఆకాశ్ దీప్ మీడియాతో తెలిపాడు.

కొత్త బంతిపై ఫోకస్

ఆస్ట్రేలియాలో కొత్త బంతిని ఎదుర్కోవటం కఠిన సవాల్. టీమ్ ఇండియా టాప్ ఆర్డర్ తొలి మూడు టెస్టుల్లో ఈ అంశంలో వెనుకంజ వేసింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు నిలకడగా విఫలం అవుతున్నారు. ఆసీస్ పిచ్‌లపై కొకాబురా బంతులు 20-30 ఓవర్లలో మెత్తబడతాయి. మెరుపు పోయి, మెత్తబడిన బంతితో పేసర్లు నిప్పులు చెరగలేదు. ఈ సమయంలో బ్యాటర్లకు పరుగుల వేట సులభతరం అవుతుంది. కానీ, ఆ 20-30 ఓవర్ల పాటు కొత్త బంతితో కంగారూ పేసర్లను కాచుకోవటమే అసలు సమస్య. ఐదు మ్యాచుల టెస్టు సిరీస్ కీలక ఘట్టానికి చేరుకోవటం, 1-1తో ఇరు జట్లు సమవుజ్జీలుగా నిలువటంతో భారత బ్యాటర్లు నెట్స్‌లో కొత్త బంతిపై ఫోకస్ పెట్టారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్ సహా విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్‌లు నెట్స్‌లో కొత్త బంతిపై సాధన చేశారు. కాస్త పచ్చిక ఎక్కువగా ఉన్న ప్రాక్టీస్ పిచ్‌లను ఎంచుకున్న టాప్ ఆర్డర్ బ్యాటర్లు.. త్రో డౌన్స్‌తో పాటు భారత పేసర్లను నెట్స్‌లో ఎదుర్కొన్నారు. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్ సహా విరాట్ కోహ్లి ఫామ్ కోల్పోయినట్టు కనిపించరు. కానీ వేగంగా పరుగులు పిండుకోవాలనే తపనలో అనవసర షాట్లు ఆడుతున్నారు. మెల్‌బోర్న్ టెస్టులో టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఈ అవలక్షణం వదలుకోవాలి. ముఖ్యంగా వికెట్లకు దూరంగా వెళ్తోన్న బంతులను గౌరవంగా వదిలేయటంపై విరాట్ కోహ్లి నెట్స్‌లో సాధన చేయాలి. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌లు ఆచితూచి ఆడితే తొలి ఇన్నింగ్స్‌లోనూ భారత్ మెరుగైన స్కోరు సాధించడానికి అవకాశం ఉంటుంది. కెఎల్ రాహుల్ ఒక్కడే టాప్ ఆర్డర్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. ఆసీస్ పేసర్లు బుల్లెట్ల వంటి బంతులు సంధించినా తెలివిగా వదిలేస్తూ.. బాడీలైన్ బ్యాటింగ్‌తో అలవోకగా పరుగులు పిండుకుంటున్నాడు. ఇదే వ్యూహం కోహ్లి, గిల్, యశస్వి అలవాటు చేసుకుంటే భారత్‌కు మెల్‌బోర్న్‌లో ఎదురుండదు.



మెల్‌బోర్న్ నెట్స్‌లో రోహిత్ శర్మ బ్యాటింగ్ సాధన

పిచ్‌పై పచ్చిక!

భారత్, ఆస్ట్రేలియా నాల్గో టెస్టు 26 నుంచి ఆరంభం కానుంది. పెర్త్, అడిలైడ్, బ్రిస్బేన్‌లో పచ్చిక పిచ్‌లతో ఆస్ట్రేలియా స్వాగతం పలికింది. మెల్‌బోర్న్‌లోనూ అదే కథ పునరావృతం కాబోతుంది. మెల్‌బోర్న్ పిచ్‌పై ప్రస్తుతం పచ్చిక ఉంది. గతంలో మెల్‌బోర్న్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. కానీ భారత్ చివరగా ఇక్కడ 2020 మెల్‌బోర్న్ టెస్టులో భారత్ 8 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఆ తర్వాత పిచ్ స్వభావంలో భారీ మార్పులు వచ్చాయి. బ్యాటింగ్ పిచ్ కాస్త బౌలింగ్ స్వర్గధామంగా రూపాంతరం చెందింది. మ్యాచ్ ఆరంభానికి మరింత సమయం ఉండటంతో పిచ్‌పై పచ్చిక కాస్త తొలగించవచ్చు. అయినా, తొలి రోజు ఉదయం సెషన్లో పేసర్లను ఎదుర్కోవటం కష్టసాధ్యంగా మారనుంది.

విండీస్ విలవిల

• 211 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం • ఐదు వికెట్లతో చెలరేగిన రేణుక సింగ్



వడోదర (గుజరాత్) : భారత మహిళల జట్టు వన్డే ఫార్మాట్‌లో అతిపెద్ద విజయం నమోదు చేసింది. వడోదరలో ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో 211 పరుగుల భారీ తేడాతో రికార్డు విజయం సాధించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన... ఈ ఫార్మాట్‌లో పరుగుల పరంగా భారత్‌కు అత్యుత్తమ విజయాన్ని అందించింది. పేసర్ రేణుక సింగ్ (5/29) ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగటంతో 315 పరుగుల భారీ ఛేదనలో వెస్టిండీస్ విలవిల్లాడింది. 26.2 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. ప్రియ మిశ్రా (2/22), దీప్తి శర్మ (1/19), టిటాస్ సాదు (1/24) మెరిసినా.. రేణుక సింగ్ పదునైన పేస్‌కు విండీస్ అమ్మాయిలు తేలిపోయారు. కరీబియన్ ఓపెనర్లు మాథ్యూస్ (0), జోసెఫ్ (0) డకౌట్‌గా నిష్క్రమించగా.. విలియమ్స్ (3), డాటిన్ (8), అలెనా (13), శాబిక (3), జైద (9) నిరాశపరిచారు. కాంప్‌బెల్ (21), ఫ్లెచర్ (24 నాటౌట్) పోరాటంతో వెస్టిండీస్ వంద పరుగుల మార్క్ దాటింది. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన భారత మహిళలు 50 ఓవర్లలో 314/9 పరుగులు చేశారు. ఓపెనర్ స్మృతీ మంధాన (91, 102 బంతుల్లో 13 ఫోర్లు) భీకర ఫామ్ కొనసాగించింది. 13 ఫోర్లతో 91 పరుగులు చేసి తృటిలో శతకం చేజార్చుకుంది. ప్రతిక రావల్ (40), హర్లీన్ డియోల్ (44) సహా హర్మన్‌ప్రీత్ కౌర్ (34), రిచా ఘోష్ (26), జెమీమా రొడ్రిగస్ (31) వేగంగా పరుగులు సాధించారు. విండీస్ బౌలర్లలో జైద (5/45) ఐదు వికెట్లు ఖాతాలో వేసుకుంది. రేణుక సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. ఈ విజయంతో వన్డే సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. భారత్, వెస్టిండీస్ మహిళల రెండో వన్డే మంగళవారం ఇదే వేదికపై జరుగనుంది.

అమెరికా కెప్టెన్ అనికకు సత్కారం

హైదరాబాద్: ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్‌లో పాల్గొనే అమెరికా మహిళల జట్టు కెప్టెన్ కొలన్ అనిక రెడ్డి, లెగ్ స్పిన్నర్ ఇమ్మడి శాన్వి సెంటర్ ఫర్ క్రికెట్ (సీఎఫ్‌సీ) ఎక్సలెన్స్ అకాడమీ నిర్వాహకులు కె.భరణి, చీఫ్ కోచ్ జగదీష్ రెడ్డి కలిసి ఘనంగా సత్కరించారు. అమెరికా అండర్-19 క్రికెట్ జట్టులో కీలక ప్లేయర్లుగా ఉన్న ఈ తెలుగు మూలాలు గల క్రికెటర్లు కొద్ది నెలలుగా హైదరాబాద్‌లోని ఐసీసీ లెవల్ 3 కోచ్ జగదీష్ రెడ్డి దగ్గర శిక్షణ తీసుకుంటున్నారు. ఈ ఇరువురికి సీఎఫ్‌సీ నిర్వాహకులు భరణి క్రికెట్ కిట్లను ప్రదానం చేశారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలకు చేరాలని భరణి ఆకాంక్షించారు.



నవచిత్రం

యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్



సుమంత్ ప్రభాస్

తన తొలి మూవీ 'మేం ఫేమస్'తో లీడ్ యాక్టర్, దర్శకుడిగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా తన రెండో మూవీతో రాబోతున్నారు. ఈ కొత్త మూవీ రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ మేడిన్ వెంచర్. ఎంఆర్ ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్స్‌తో పాపులరైన సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం ఫస్ట్ షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఫస్ట్ షెడ్యూల్‌ని రేలంగి, వేల్పూరి, భీమవరంలోని బ్యూటీఫుల్ లొకేషన్స్‌లో చేశారు. ఈ యూత్‌ఫుల్ మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ బిగ్ స్క్రీన్స్‌కు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ తీసుకువస్తుంది. ఈ చిత్రంతో నిధి ప్రదీప్ హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. జగపతి బాబు మేజర్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, హర్షవర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, వైవా రాఘవ్, రీను, రోహిత్ కృష్ణ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి దర్శకత్వం : సుభాష్ చంద్ర, డీవోపీ : సాయి సంతోష్, సంగీతం : నాగ వంశీ కృష్ణ, ఎడిటర్ : అనిల్ కుమార్ పి, ప్రొడక్షన్ డిజైనర్ : ప్రవల్య, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : మధులిక సంచన లంక.



రామ్‌చరణ్, కియారా అద్వానీ

విజువల్ ట్రీట్‌గా 'డోప్' సాంగ్

రామ్ చరణ్, శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ మూవీ జనవరి 10న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అవుతోంది. ఈనెల 21న యు.ఎస్‌లోని డల్లాస్‌లో జరిగిన ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సినిమా నుంచి క్రేజీగా సాగే 'డోప్' సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. అలాగే ఈ సాంగ్‌ను ఇండియాలో ఆదివారం ఉదయం 8 గంటల 30 నిమిషాలకు రిలీజ్ చేశారు. డైరెక్టర్ శంకర్ తనదైన శైలిలో మరోసారి మేకింగ్‌లో తనేంటో ఈ సాంగ్‌తో ప్రూవ్ చేశారు. విజువల్ ట్రీట్‌గా ఉన్న ఈ పాటకు మ్యూజిక్ సెన్సేషనల్ తమన్ కంపోజిషన్ దీనికి పెద్ద ఎసెట్‌గా మారింది. రామజోగయ్యశాస్త్రి రాసిన ఈ పాటను తమిళంలో వివేక్, హిందీలో రక్వీబ్ ఆలం రాశారు. అలాగే తెలుగులో ఈ పాటను తమన్ ఎస్, రోషిణి, పృథ్వీ శ్రుతి రంజని ఆలపించగా, తమిళంలో తమన్ ఎస్, అదితీ శంకర్, పృథ్వీ.. హిందీలో తమన్ ఎస్, రాజకుమారి, పృథ్వీ శ్రుతి రంజని ఆలపించారు. పాటకు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వస్తోంది. రామ్ చరణ్, కియారా అద్వానీ వేసిన డాన్స్ ఎంతో క్యూట్‌గా ఉంది అని చిత్ర బృందం తెలిపింది.

'మర్రిచెట్టు కింద మనోళ్ళు'



శ్రీ నారసింహ చిత్రాలయ బ్యానర్‌పై నరేష్ వర్మ ముద్దం దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్ళు'. ప్రమోద్ దేవా, రణధీర్, కీర్తన స్వర్గం ముస్కాన్ రాజేందర్ హీరో,హీరోయిన్లుగా నటించనున్న ఈ చిత్రం సారథి స్టూడియోలో పూజ కార్యక్రమంతో ప్రారంభమైంది.

నటుడు బాబు మోహన్ నటీనటులపై క్లాప్ కొట్టారు. ఆర్టిస్టు నాగ మహేష్ కెమెరా స్విచ్చాన్ చేశారు. థర్టీ ఇయర్స్ పృథ్వీ, రాజీవ్ కనకాల, తెలుగు ఫిలించాంబర్ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత సి.కళ్యాణ్, టీఎంఏపీ ప్రెసిడెంట్ రష్మీ ఠాగుర్ చిత్ర ప్రారంభోత్సవంలో పాల్గొని, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

దర్శకుడు నరేష్ వర్మ ముద్దం మాట్లాడుతూ, 'ప్రతి ఒక్కరిని అలరించే విధంగా ఒక మంచి సబ్జెక్టుతో చేస్తున్న చిత్రమిది. మా టైటిల్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రారంభానికి ముందే ఈ సినిమా జనాల్లోకి వెళ్లిపోయింది. ఈ సినిమాను సపోర్టు చేసి, ఆదరించాలని అందరిని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'యువతకు సరైన దిశా నిర్దేశం చేసే సబ్జెక్ట్ ఇది. ఇప్పటికే ఈ సినిమా పబ్లిక్‌లోకి వెళ్ళిపోయింది. ఇందులో మా కొడుకు ప్రమోద్ దేవా ఒక హీరోగా నటిస్తున్నాడు' అని సహ నిర్మాత ఆకుల రిషేంద్ర నరసయ్య చెప్పారు. మరో సహ నిర్మాత బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ,'మర్రి చెట్టు తెలియని వారు ఉండరు. జీవితంలో ప్రతి ఒక్కరికి మర్రిచెట్టుతో జ్ఞాపకాలు ఉంటాయి. అలాంటి మర్రి చెట్టు కాన్సెప్టుతో రానున్న ఈ సినిమా అందరిని అలరించడం ఖాయం' అని తెలిపారు.

ఎన్డీయేలో చేరే ప్రసక్తే లేదు.. : ఎన్సీ

ప్రజల్ని తప్పుదోవ పట్టించే కుట్ర



శ్రీనగర్: ఇటీవలి జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన నేషనల్ కాన్ఫరెన్స్ 'ఇండియా' కూటమిలోని మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఎన్సీ పార్టీ బీజేపీ నేతత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరనుందని ఓ మీడియాలో కథనం వెలువడింది. దీన్ని నిరాధారమైనదిగా పార్టీ కొట్టిపారేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో చేసిన ఈ వాదనలు పచ్చి అబద్ధమని స్పష్టం చేసింది.జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ప్రతిగా ఎన్డీయేలోకి నేషనల్ కాన్ఫరెన్స్ వెళ్లేందుకు సన్నద్ధమవుతోందని వచ్చిన కథనంపై పార్టీ ప్రధాన ప్రతినిధి తన్వీర్ సాదిక్ స్పందించారు. "ఇటువంటి నిరాధార వదంతులను వ్యాప్తి చేయడం బాధ్యతారాహిత్యం. సీఎం ఒమర్ అబ్దుల్లా కలిసినట్టు చెబుతున్న బీజేపీ అగ్రనాయకత్వం పేర్లను బహిర్గతం చేయాలి. లేకపోతే.. బహిరంగ క్షమాపణ చెప్పి, ఆ కల్పిత కథనాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవు" అని 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు.

ఇటీవల ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో జమ్మూకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా భేటీ అయ్యారు. జమ్మూకాశ్మీర్‌కు వీలైనంత త్వరగా రాష్ట్ర హోదా పునరుద్ధరణతోపాటు స్థానికంగా ఉగ్రవాదం కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వాన్ని భాగస్వామ్యం చేయడం వంటి అంశాలపై చర్చించారు. అయితే, ఈ సమావేశం గురించి మీడియా సహా అందరికీ తెలిసిందేనని సాదిక్ అన్నారు. ఈ భేటీపై ఇతరత్రా వాదనలు చేస్తే మాత్రం.. వాటిని రుజువు చేయాల్సి ఉంటుందని సవాల్ విసిరారు.

'బాల్య వివాహాలు'పై వెనక్కి తగ్గని అసోం

• తాజాగా మరో 416మంది అరెస్టు



గౌహతి : బాల్య వివాహాల కేసులపై ఎన్ని విమర్శలు వస్తున్నా అసోంలోని బీజేపీ ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. తాజాగా మూడో విడత కేసుల్లో 416 మందిని అరెస్టు చేసింది. ఈ కేసుల అరెస్టులో భాగంగా శనివారం అర్ధరాత్రి వేళ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 416 మందిని అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి ఈ అరెస్టులు చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. మూడో విడతలో భాగంగా ఈ నెల 21 రాత్రి నుంచి 22వరకు మొత్తంగా 335 కేసులు నమోదు చేసిన పోలీసులు 416మందిని అరెస్టు చేసినట్లు స్వయంగా ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ ప్రకటించారు.

బాల్య వివాహం చేసుకున్నా.. అందుకు సహకరించినా కేసులు నమోదు చేసినా అస్సాం ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. ఈ వివాహాలు ఎన్ని ఏండ్ల క్రితం జరిగినా కూడా కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తోంది. ఫిర్యాదులు లేకపోయినా కూడా చర్యలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒక మతం వారిని లక్ష్యంగా చేసుకునే ఈ కేసులు నమోదవుతున్నాయని విమర్శలు వస్తున్నా అసోం ప్రభుత్వం పట్టించు కోవడం లేదు. మొదటి విడతలో 4,515 కేసుల్లో 3,483మందిని అరెస్టు చేయగా.. రెండో దశలో 710 కేసుల్లో 915మందిని అరెస్టు చేశారు. తాజాగా మరో 335 కేసులు బనాయించి, 416మందిని అరెస్టు చేయడం గమనార్హం.

బ్రెగ్జిట్‌కు రెండేండ్లు భారీ మూల్యం చెల్లించుకున్న బ్రిటన్

లండన్ : లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ సెంటర్ పరిశోధకుల వివరణాత్మక విశ్లేషణ ప్రకారం, యూరోపియన్ యూనియన్‌కు చెందిన సింగిల్ మార్కెట్, కస్టమ్స్ యూనియన్ నుంచి వైదొలగాలని బ్రిటన్ తీసుకున్న నిర్ణయం వల్ల మొదటి రెండేండ్లలో దేశం 2, 700 కోట్ల పౌండ్లు (34.1 బిలియన్ డాలర్లు) నష్టపోయింది.ఈయూ ట్రేడింగ్ బ్లాక్ నుంచి బ్రిటన్ నిష్క్రమించడం వల్ల చెల్లించుకున్న మూల్యం ఎక్కువగా ఉన్నప్పటికీ, కొంతమంది భవిష్య సూచకులు పేర్కొన్నంత ఎక్కువగా లేదని ఆ అధ్యయనం తెలిపింది. ఇయు, బ్రిటన్ మధ్య వాణిజ్య అడ్డంకులను తిరిగి ప్రవేశపెట్టడంతో చిన్న వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొంది. వందలాది బ్రిటన్ కంపెనీలు ఇయుతో వ్యాపారాన్ని నిలిపివేయడంతో పెద్ద సంస్థలే ఎక్కువగా లబ్ధి పొందాయని తెలిపింది. లక్షకు పైగా కంపెనీలకు సంబంధించి బ్రిటన్ కస్టమ్స్ ఏజెన్సీ సేకరించిన సమాచారాన్ని పరిశీలించిన తర్వాత పరిశోధకులు ఈ నిర్ధారణలకు వచ్చారు. 2022 చివరి నాటికి బ్రిటన్, ఈయూ వాణిజ్య సహకార ఒప్పందం లేదా బ్రెగ్జిట్‌పై సంతకం చేసిన రెండు సంవత్సరాల తర్వాత, ఐరోపాకు బ్రిటన్ ఎగుమతి చేసే సరుకుల విలువ 6.4 శాతంలోపే ఉందని తెలిపింది.

రాహుల్ గాంధీకి యూపీ కోర్టు సమన్లు

• అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కులగణనపై వ్యాఖ్యలకు..

రాయ్‌బరేలీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కి యూపీ కోర్టు సమన్లు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కులగణన పై ఆయన చేసిన వ్యాఖ్యలపై బరేలీ జిల్లా కోర్టు ఈ సమన్లు జారీ చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.'ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ కులగణనపై చేసిన వ్యాఖ్యలు దేశంలో అంతర్యుద్ధానికి దారి తీసేలా ఉన్నాయి. అందుకే ఆ వ్యాఖ్యలపై తొలుత ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో కేసు దాఖలు చేశాం. అక్కడ కేసును కొట్టివేశారు. దీంతో బరేలీ జిల్లా కోర్టును ఆశ్రయించాం. ఈ క్రమంలోనే కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. వచ్చే జనవరి 7న హాజరుకావాలని కోర్టు అందులో పేర్కొంది' అని పిటిషనర్ తెలిపారు.



ఇట్స్ రిలాక్స్ టైమ్..
న్యూఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లోని క్వాలిటీ రెస్టారెంట్‌లో భోజనంచేస్తున్న రాహుల్ గాంధీ, తల్లి సోనియా, సోదరి ప్రియాంక గాంధీ,బావమరిది రాబర్ట్ వాద్రా తదితరులు..

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.